ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శుక్రవారం 22.05.2026 | సంపుటి :12 సంచిక : 302 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్




## కార్మికుల కనీస వేతనాలపై

# ప్రభుత్వం కీలక నిర్ణయం

**భారీగా ప్రభుత్వం నిర్ణయం • జూన్ 1 నుంచి అమల్లోకి**

- లబ్ధిపొందనున్న 1.11 కోట్ల మంది కార్మికులు
- రాష్ట్రాన్ని 3 జోన్లుగా విభజించిన రాష్ట్ర ప్రభుత్వం
- జోన్-1కార్పొరేషన్లు, జోన్-2-మున్సిపాల్టీలు,జోన్-3 గ్రామీణం
- కేబినేట్ సబ్‌కమిటీ నిర్ణయాలకు ఆమోదం

ఎన్నికలవగానే పెట్రో రేట్లు రోజుకోసారి పెంచడమేంటీ?

మోదీపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం

బండి సంజయ్ తనయుడు భగీరథను పోలీసులే అరెస్ట్ చేశారు

కేటీఆర్ ఇంకా ప్రభుత్వంలోనే ఉన్నానన్న భ్రమలో ఉన్నారు

మీడియా సమావేశంలో సీఎం




ఏఐతో కోట్లాది ఉద్యోగాలకు ముప్పు వస్తోంది. జర్మనీ, జపాన్, సింగపూర్‌లో ఎన్నో ఉద్యోగాలు ఉన్నాయి. రాష్ట్ర యువత స్కిల్స్ పెంచుకొని విదేశీ ఉద్యోగాలను అందిపుచ్చుకోవాలి. ఏఐ వచ్చినా బ్లూకాలర్ ఉద్యోగాలకు ముప్పు ఉండదు. నైపుణ్యాలు ఉన్నవారు కావాలని విదేశాలు మమ్మల్ని సంప్రదిస్తున్నాయి. స్కిల్స్ పెంచుకునేందుకు అవసరమైన ప్రోత్సా హకాలను ఇస్తున్నాం. ఏఐ వచ్చినా బ్లూకాలర్ ఉద్యోగాలకు ముప్పు ఉండదు. నైపుణ్యాలు పెంచుకుంటే విదేశాల్లో రూ.2 లక్షల వరకు వేతనం ఉంటుంది. నైపుణ్యాలు పెంచేందుకు ఏటీసీ విద్యార్థులకు నెలకు రూ.2 వేలు ఇస్తున్నాం

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,

హైదరాబాద్(జనంసాక్షి): కార్మికులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. కనీస వేతనాలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర సచివాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి కీలక విషయాలను వెల్లడించారు. కార్మికుల కనీస వేతనాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని సీఎం రేవంత్ తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో 1.11 కోట్ల మంది కార్మికులు నష్టపోయా రని.. అందుకే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో కేబినెట్ సబ్ కమిటీని నియమించామని అన్నారు. సబ్ కమిటీ నివేదించిన

మిగతా 2లో..

## సోనియా కుటుంబానికి తెలంగాణ రుణపడిఉంది

- సాంకేతికతను దేశానికి పరిచయం చేసిన రాజీవ్
- దేశం కోసం ప్రాణాలర్పించిన మహానేత ఆయన
- నివాళి అర్పించిన ముఖ్యమంత్రి రేవంత్

వార్త 2లో

# మంత్రివర్గం ప్రక్షాళన!?





## కొందరి కొత్త మొహాలు..

**మరికొందరికి స్థానచలనం.. పొన్నంకు పీసీసీ..**

**అసెంబ్లి స్పీకర్ పదవిలో మార్పు**


**భట్టికి కొత్త బాధ్యతలు అప్పగించనున్న అధిష్టానం**

**కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ఈసారీ నో ఛాన్స్**

**ఢిల్లీ కేంద్రంగా ఇప్పటికే లాబీయింగ్ ముమ్మరం**

**తెలంగాణ రాజకీయాల్లో ఊహాగానాలకు తెరదించుతూ కాంగ్రెస్ అధిష్టానం మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు (క్యాబినెట్ విస్తరణ) ముమ్మర కసరత్తులు చేస్తోంది. ప్రస్తుతం రాష్ట్ర మంత్రివర్గంలో రెండు క్యాబినెట్ బెర్తులు ఖాళీగా ఉండటంతో, వాటిని భర్తీ చేయడంతో పాటు కీలక మార్పులు చేర్పులు చేసేందుకు హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మంత్రివర్గంలో కొందరికి కొత్త మొహాలు కనిపించనుండగా.. ఒకరిద్దరికి స్థానచలనం అయ్యే అవకాశాలు ఉన్నాయి.**






హైదరాబాద్ (జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రాష్ట్ర మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణకు ముహూర్తం ఖరారైనట్లు కాంగ్రెస్ వర్గాల్లో గట్టి ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం క్యాబినెట్‌లో ఖాళీగా ఉన్న రెండు స్థానాలను భర్తీ చేయడంతో పాటు, పార్టీ, ప్రభుత్వంలో సమతుల్యత సాధించేందుకు అధిష్టానం సరికొత్త సమీకరణాలను తెరపైకి తెచ్చింది. ఇప్పటికే ఆశావహులు ఢిల్లీ స్థాయిలో తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

**మహేష్ కుమార్‌కు మంత్రి పదవి.. పొన్నంకు పీసీసీ?**

రాజకీయ సమీకరణాల్లో భాగంగా ప్రస్తుత పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌ను మంత్రివర్గంలోకి తీసుకోవాలని అధిష్టానం భావిస్తున్నట్లు సమాచారం. ఆయనకు క్యాబినెట్ ర్యాంక్ కట్టబెడితే.. ఖాళీ అయ్యే పీసీసీ అధ్యక్షుడు పీఠాన్ని అదే సామాజికవర్గానికి చెందిన ప్రస్తుత మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అప్పగించే అవకాశం ఉంది. సామాజిక సమీకరణాలు దెబ్బతినకుండా ఉండేందుకే హైకమాండ్ ఈ వ్యూహాన్ని అమలు చేయబోతున్నట్లు తెలుస్తోంది.

**భట్టి విక్రమార్కకు కొత్త బాధ్యతలు?**

మంత్రివర్గ మార్పుల్లో భాగంగా శాసనసభ స్పీకర్ స్థానంలో కూడా పెద్ద మార్పే జరగనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ప్రస్తుత స్పీకర్‌ను మంత్రివర్గంలోకి తీసుకుని.. ప్రస్తుత డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను స్పీకర్‌గా నియమించే యోచనలో అధిష్టానం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ మార్పు ఎంతవరకు సాధ్యమవుతుందనేది ఆసక్తికరంగా మారింది.

**రంగారెడ్డి జిల్లాకు ప్రాతినిధ్యం దక్కేనా?**

భౌగోళిక, రాజకీయ ప్రాధాన్యత దృష్ట్యా కీలకమైన రంగారెడ్డి జిల్లా నుంచి మరో నేతకు ఈ విడతలో మంత్రి పదవి దక్కడం ఖాయంగా కనిపిస్తోంది. జిల్లాలో పార్టీ బలాన్ని మరింత పెంచేందుకు, సీనియర్ల అసంతృప్తిని చల్లార్చేందుకు ఈ నిర్ణయం తీసుకోబోతున్నారు. మరోవైపు, క్యాబినెట్ విస్తరణ వార్తలతో సీనియర్ నేత, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వర్గంలో

మిగతా 2లో..



## కొనుగోలు కేంద్రాల్లో రైతులు పిట్టల్లా రాలుతున్నారు

- అయినా ప్రభుత్వానికి పట్టింపులేదా?
- మార్కెట్‌కు వచ్చిన ధాన్యం కొనేదెన్నడు?
- ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడండి
- 23న కేబినేట్ భేటీలో అయినా చర్చించండి
- సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ

హైదరాబాద్(జనంసాక్షి):పంట కొనుగోళ్ల సంక్షోభంపై ఎన్నాళ్లీ మొద్దునిద్ర ముఖ్యమంత్రి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. కేబినెట్ మీటింగ్‌లోనైనా కళ్లు తెరవండి అని హితవు పలికారు. రైతుల ప్రాణాలు పోతున్నా.. పంటలు కొనరా..? కొనుగోలు కేంద్రాల్లో కుప్పకూలుతున్నా కనికరించరా అని మండిపడ్డారు. ధాన్యం తగలబెట్టుకుంటున్నా తండ్లాట తీర్చరా అని ప్రశ్నించారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు.కొనుగోలు కేంద్రాల్లో ఈ మరణ మృదంగ మేంటని సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. రాష్ట్రంలో రోడ్డెక్కని రైతు లేడు.. రాస్తారోకో జరగని రహదారి లేదని అన్నారు. ఇవాళ బూతులు తిడుతున్న రైతులే.. రేపు వాతలు పెడతారని హెచ్చరించారు. కాంటా పెట్టని కాంగ్రెస్ సర్కారుకు రైతు చేతిలోనే కౌంట్ డౌన్ మొదలైందని అన్నారు. రైతుకు రక్షణగా కేసీఆర్ అమలుచేసిన ఒక్కో పథకానికి గత రెండేన్నరేళ్లుగా పాతరేసిన మీరు మీ చేతకానితనంతో అన్నదాత వెన్నువిరిచారు.ఇవాళ మీ అరాచక పాలన ఆనవాళ్లు పరాకాష్టకు చేరాయి. అష్టకష్టాలు పడి పండించిన పంటను కొనే దిక్కులేక రెండునెలలుగా రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఆర్థనాదాలు చేస్తున్నారు. చేతకాని మీ సర్కారు నిర్వాకం వల్ల తెలంగాణ వ్యాప్తంగా ఏ మూలన చూసినా ఈరోజు

మిగతా 2లో..

# ‘సంధి’పై పకడ్బందీ

## హర్మూజ్ జలసంధి మీద ఇరాన్ పట్టు

- అమెరికా ఎత్తులను ఎప్పటికప్పుడు చిత్తుచేసిన వైనం
- ప్రపంచ ఇంధన భద్రతను శాసించే వ్యూహాత్మక ఆయుధం
- అంతర్జాతీయ వార్తా సంస్థ ‘రాయిటర్స్’ ప్రత్యేక కథనం




**ప్రపంచ చమురు రక్షణ కారిడార్‌గా పేరొందిన ‘హర్మూజ్ జలసంధి’ స్టార్ పై ఇరాన్ రోజురోజుకూ తన పట్టును బిగిస్తోంది. పాశ్చాత్య దేశాలతో, ముఖ్యంగా అమెరికాతో ఉద్రిక్తతలు పెరిగిన ప్రతిసారీ ఈ వ్యూహాత్మక జలమార్గాన్ని ఇరాన్ ఒక శక్తివంతమైన ఆయుధంగా వాడుకుంటోందని అంతర్జాతీయ వార్తా సంస్థ ‘రాయిటర్స్’ తన తాజా విశ్లేషణాత్మక కథనంలో స్పష్టం చేసింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను సైతం శాసించగల ఈ జలసంధిపై ఇరాన్ సాధించిన పూర్తి పట్టు, దాని వెనుక ఉన్న వ్యూహాలపై రాయిటర్స్ నివేదిక సారాంశం ఇది.**

ఇంటర్నేషనల్‌డెస్క్ (జనంసాక్షి): హర్మూజ్ జలసంధి పర్షియన్ గల్ఫ్‌ను, ఒమన్ గల్ఫ్, అరేబియా సముద్రంతో కలుపుతుంది. భౌగోళికంగా ఇది ఒమన్, ఇరాన్ దేశాల మధ్య ఉంది. దీని అత్యంత ఇరుకైన భాగం కేవలం 33 కిలోమీటర్ల వెడల్పు మాత్రమే ఉంటుంది. అయితే, ప్రపంచవ్యాప్తంగా వినియోగించే ముడి చమురులో దాదాపు 20 శాతం (ఐదో వంతు) ఈ ఇరుకైన మార్గం గుండానే రవాణా అవుతుంది. సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్, ఇరాక్, ఇరాన్ వంటి ప్రధాన ఓపెక్ దేశాల చమురు ఎగుమతులు ఈ మార్గం పైనే ఆధారపడి ఉన్నాయి.

**ఇరాన్ ‘సైనిక పహారా’- ఆధిపత్యం**

రాయిటర్స్ కథనం ప్రకారం, హర్మూజ్ జలసంధికి ఉత్తర తీరం అంతా ఇరాన్ ఆధీనంలో ఉండటం దానికి అతిపెద్ద భౌగోళిక అనుకూలత. ఇరాన్‌కు చెందిన అత్యంత శక్తివంతమైన సైనిక విభాగం ‘ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్’ నౌకాదళం ఈ ప్రాంతంలో నిరంతరం నిఘా ఉంచుతుంది. భారీ యుద్ధ నౌకల కంటే, వేగంగా దూసుకెళ్లే వందలాది స్పీడ్ బోట్లు, గైడెడ్ మిస్సైళ్లు, ఆధునిక డ్రోన్ల సహాయంతో ఇరాన్ ఈ జలసంధి

మిగతా 2లో..



## మోదీ,షాలు దేశాన్ని అమ్మేస్తున్నారు

**రాహుల్ గాంధీ ధ్వజం**

రాయ్‌బరేలీ(జనంసాక్షి): కాంగ్రెస్, భాజపాల మధ్య మాటల యుద్ధం తీవ్రమైంది. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆరెస్సెస్‌లు ద్రోహులని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ విరుచుకుపడగా.. ఆయనది అరాచక మనస్తత్వమంటూ భాజపా ప్రతి దాడి చేసింది. మోదీ, అమిత్ షా, ఆరెస్సెస్ నేతలు ప్రతి రోజూ రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని, దేశ ప్రయోజనాలను కొంత మంది పారిశ్రామికవేత్తలకు అమ్మి ద్రోహం చేస్తున్నారని రాహుల్ గాంధీ విమర్శించారు. వీర పసీ అనే స్థానిక యోధుడి స్మారకార్థం బుధవారం రాయ్‌బరేలీలో ఏర్పాటు చేసిన బహుజన్ స్వాభిమాన్ సభలో ఆయన మాట్లాడారు. అనంతరం అమేఠీలో జరిగిన సభలోనూ ప్రసంగించారు. “మీరు ఎదురు నిలిచి పోరాడండి. ఆరెస్సెస్ కార్యకర్తలు మీ ఇళ్లకు వచ్చి మోదీ, అమిత్ షాల గురించి చెబితే.. వారు ద్రోహులని చెప్పండి. మన దేశాన్ని అమ్మడానికి పని చేస్తున్నారని

మిగతా 2లో..

## ఘనంగా సరస్వతీ పుష్కరాలు ప్రారంభం

- కంచి పీఠాధిపతి విజయేంద్రసరస్వతి రాక
- పుణ్యస్నానాలు ఆచరించిన మంత్రులు సురేఖ, శ్రీధర్ బాబు

2లో..

## లోన్ల రికవరీ పేరుతో వేధించే బ్యాంకులకు అడ్డుకట్ట

కఠిన నిబంధనలను ప్రతిపాదించిన ఆర్‌బీఐ




9లో..

## అంతర్జాతీయ వేదికపై పాకిస్థాన్‌కు మళ్లీ భంగపాటు

దయాది నరమేధ చర్యలను ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో మరోసారి ఎండగట్టిన భారత్

## మణుగూరు-రామగుండం రైల్వేలైన్‌కు



# కేంద్రం ఆమోదం?

**రూ. 5,818.45 కోట్ల భారీ అంచనా వ్యయంతో నిర్మాణం**




**మారుమూల గిరిజన పల్లెలకు పట్టనున్న మహర్దశ**

**రైల్వే ప్రాజెక్టులపై అశ్వినీ వైష్ణవ్‌తో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చర్చ**

న్యూఢిల్లీ(జనంసాక్షి):తెలంగాణ రాష్ట్రంలో రవాణా రంగాన్ని సరికొత్త ఎత్తుకు తీసుకెళ్లేలా కేంద్ర ప్రభుత్వం మరో శుభవార్త చెప్పింది. రాష్ట్రంలో ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న కీలకమైన మణుగూరు-రామగుండం కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టుకు ప్రధాని నరేంద్ర మోదీ సర్కార్ అధికారికంగా ఆమోదముద్ర వేసింది. దాదాపు రూ. 5,818.45 కోట్ల భారీ అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన ఈ ప్రాజెక్టును పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం పద్ధతిలో చేపట్టనున్నారు. ఈ కొత్త లైన్ అందుబాటులోకి వస్తే తెలంగాణలోని మారుమూల గిరిజన ప్రాంతాలకు రైల్వే సౌకర్యం దక్కడంతో పాటు, ప్రముఖ పుణ్య క్షేత్రాలకు వెళ్లే భక్తులకు పెద్ద ఉపశమనం లభించనుంది. మొత్తం 207.8 కిలోమీటర్ల పొడవున నిర్మించనున్న ఈ సరికొత్త రైల్వే లైన్ మంథని, భూపాలపల్లి, తాడ్వాయి, గోపాలరావుపేటలతో పాటు ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర జరిగే మేడారం మీదుగా వెళ్లనుంది. ప్రస్తుతం మణుగూరు నుండి రామగుండం వెళ్లాలంటే భద్రాచలం రోడ్ (కొత్తగూడెం), కాజీపేట మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది.

మిగతా 2లో..


## బండి భగీరథ్ రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌కు హైకోర్టు అనుమతి



హైదరాబాద్(జనంసాక్షి): బండి భగీరథ్ ముందస్తు బెయిల్ పిటిషన్ ఉపసంహరణకు హైకోర్టు అనుమతించింది. మైనర్ బాలిక తల్లి ఫిర్యాదు మేరకు ఈనెల 8న పేట్ బషీరాబాద్ పీఎస్‌లో భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈనెల 15న వాదనలు విన్న

మిగతా 2లో..

# ప్రచండ భానుడు



- దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో నిప్పుల వాన
- ఎండల తీవ్రతతో రికార్డు ఉష్ణోగ్రతలు
- పిడుగురాళ్లలో 48.1.. ముత్తారంలో 46.5 డిగ్రీలు

న్యూఢిల్లీ/హైదరాబాద్/విజయవాడ(జనంసాక్షి): ఎండలు తారెత్తిస్తున్నాయి. ఎండల తీవ్రతతో తెలుగు రాష్ట్రాలు నిప్పుల కుంపటిని తలపిస్తున్నాయి. ఏపీ, తెలంగాణలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగాయి. అంతకంతకూ ఎండ తీవ్రత పెరిగిపోయి రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రజలు బయటకు అడుగుపెట్టాలంటేనే బాబోయో ఎండ అనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఆకాశం నుంచి నిప్పుల వర్షం కురిపిస్తున్నాడా అన్నట్లుగా ఉష్ణోగ్రతలు రోజురోజుకూ రికార్డు స్థాయిలో పెరుగుతున్నాయి. గురువారం రాష్ట్రంలో పలుచోట్ల రికార్డు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏపీలో అత్యధికంగా పిడుగురాళ్లలో 48.1, తెలం గాణలోని పెద్దపల్లి జిల్లా ముత్తారంలో 46.5,

మిగతా 9లో..

## ఎబోలా వైరస్ కలకలం.. ఇండియా-ఆఫ్రికా సమిట్ వాయిదా

ఎయిర్‌పోర్ట్‌లో అడ్వయిజరీ జారీ

2లో..

## ‘రూపాయి’కి రిపేర్లు

పతనంపై ఆర్‌బిఐ దిద్దుబాటు

అధికారులతో గవర్నర్ మల్హోత్రా మంతనాలు

2లో..

## పాక్‌లోనే పహల్గాం దాడికి పథకం

ఎన్ఐఏ ఛార్జ్‌షీట్‌లో సంచలన విషయాలు

# ఘనంగా సరస్వతీ పుష్కరాలు ప్రారంభం

**కంచి పీఠాధిపతి విజయేంద్రసరస్వతి రాక**

**పుణ్యస్నానాలు ఆచరించిన మంత్రులు సురేఖ, శ్రీధర్ బాబు**

**కాళేశ్వరం(జనంసాక్షి):** సరస్వతీ నది అంత్య పుష్కరాలు వైభవంగా ఆరంభమయ్యాయి. గురువారం ఉదయం కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామి, మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ పుష్కరాలను ప్రారంభించారు. వీరంతా తొలుత పుష్కరస్నానం ఆచరించి ప్రారంభంచారు. పుష్కరాలకు వచ్చే భక్తుల కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున ఏర్పాట్లు చేసింది. ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి తొలిసారి అంత్య పుష్కరాలు నిర్వహిస్తోంది. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని అసౌకర్యం కలగకుండా భారీ టెంట్లు, కూలర్లు సైతం ఏర్పాటు చేశారు. సరస్వతీ ఘాట్‌తోపాటు ప్రధాన ఘాట్ వద్ద స్నానాలు ఆచరించేవారు దుస్తులు మార్చుకొనేందుకు తాత్కాలిక గదులను 300కు పైగా ఏర్పాటు చేశారు. నదిలో లోతులోకి వెళ్లకుండా భద్రతా చర్యల్లో భాగంగా తాళ్లతో హద్దులు ఏర్పాటు చేశారు. జూన్ 1 వరకు ప్రతిరోజు సాయంత్రం హారతి ఉంటుంది. అంత్య పుష్కరాలకు భక్తులు పెద్దసంఖ్యలో వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారని అధికారులు చెబుతున్నారు. ప్రాణహిత, గోదావరి నదుల్లో అంతర్వాహిణిగా సరస్వతి నది ప్రవహిస్తున్న ప్రాంతంగా కాళేశ్వరం ప్రసిద్ధి చెందింది. దేశంలో సరస్వతి నది ఉన్నది ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్, రెండోది కాళేశ్వరంలోనే. అక్కడ కుంభమేళా నిర్వహించటం ఆనవాయితీ. కాగా, తెలంగాణలో తొలిసారి అంత్య పుష్కరాలకు సైతం ప్రాధాన్యమిచ్చి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయటం విశేషం. ఆది పుష్కరాల్లో నది స్నానం ఆచరించటం.. పితృతర్పణాలు ఇవ్వడం ఎలా ఫలితాలొస్తాయో.. అంత్య పుష్కర సమయంలోనూ ఆయా కార్యక్రమాలతో అవే ఫలితాలుంటాయని పండితులు చెబుతున్నారు.

# కొనుగోలు కేంద్రాల్లో రైతులు పిట్టల్లా రాలుతున్నారు

రైతులు నిత్యం ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలతో హోరెత్తిస్తున్నారు. పంట అమ్ముకుందామనే ఆశతో వచ్చిన రైతులు రోజుల తరబడి పడిగాపులు పడలేక కొనుగోలు కేంద్రాల్లోనే గుండెపగిలి కుప్పకూలుతున్నా మీ సర్కారుకు చీమకుట్టినట్టు కూడా లేదు. 70 సార్లు ఢిల్లీకి చక్కర్లు కొట్టడంలో మీకున్న శ్రద్ధలో ఒక్క శాతం రైతులపై పెట్టి ఉంటే ఈ దుస్థితి వచ్చేది కాదన్నారు. మీ కుర్చీని కాపాడుకోవడానికి ఢిల్లీకి మూటలు మోయడం తప్ప రైతులు తెచ్చిన ధాన్యాన్ని కొనాలన్న సోయి మాత్రం మీలో కనిపించడం లేదు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల వద్ద దాదాపు పదిమంది రైతులు వడదెబ్బకు తోడు సర్కారు చేసిన ద్రోహానికి తమ నిండు ప్రాణాలు కోల్పోయారు. ధాన్యం కుప్పలు మీ అసమర్థతకు ప్రత్యక్ష సాక్ష్యాలు. విలువైన భూములను తెగనమ్మి వేలకోట్లు దోచుకోవాలన్న ఉత్సాహం తప్ప రైతుల పంటలను కొనాలన్న ధ్యాస మీలో ఏమాత్రం కనిపించడం లేదు. వరంగల్ నుంచి ఖమ్మం దాకా అనేక జిల్లాల్లోని కొనుగోలు కేంద్రాల్లో రోజుకు కనీసం ఒక్కటంటే ఒక్క లారీ లోడ్ కూడా ఎత్తడం లేదు. చివరికి గన్నీ బ్యాగు కోసం రైతులే 50 రూపాయల చొప్పున డిపాజిట్ చేసే దుస్థితి తెచ్చినందుకు మీరు, మీ ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలి.అన్నదాతలు అడుగడుగునా పడిగాపులు పడుతుంటే వాటిని వదిలేసి, పర్యాటక వారోత్సవాలు నిర్వహించాలన్న మీ సర్కారుకు ప్రాధాన్యతలే కాదు, చివరికి పోయి కూడా లేదని తేలిపోయింది.కేసీఆర్ హయాంలో మూడు నెల ముందు నుంచే పంటల కొనుగోలు ప్రణాళికలను పకడ్బందీగా అమలుచేసే వారు. గన్నీ బ్యాగుల నుంచి మొదలుకుని రైతుల ఖాతాల్లో పంట డబ్బులు సకాలంలో జమ అయ్యేదాకా నిరంతర సమీక్షలతో పర్యవేక్షించేవారు. కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షాల నుంచి తమ పంటను కాపాడుకునేందుకు చివరికి టార్పాలిన్లు కూడా సమకూర్చలేని మీ కాంగ్రెస్ సర్కారు ఉండి రైతులకు ఏం ప్రయోజనం అన్నారు.60 రోజులు గడిచినా కొనుగోలు కేంద్రాల్లో కాంటా పెట్టని కాంగ్రెస్ సర్కారుకు మరణశాసనం రాసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. రాష్ట్రమంతా రైతుల నిరసనలు హోరెత్తుతున్న ఈ తరుణంలో 23న నిర్వహించే కేబినెట్ సమావేశంలోనైనా లెంపలేసుకుని దిద్దుబాటు చర్యలు చేపట్టండని కెటిఆర్ తన లేఖలో కోరారు.

# 'రూపాయి'కి రిపేర్లు

**పతనంపై ఆర్‌బిఐ దిద్దుబాటు**

**అధికారులతో గవ్నర్ మల్హోత్రా మంతనాలు**

ముంబయి(జనంసాక్షి):రూపాయి విలువను స్థిరీకరించడానికి, వడ్డీ రేట్ల పెంపుతో సహా అందుబాటులో ఉన్న అన్ని ప్రత్యామ్నాయ మార్గాలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) పరిశీలిస్తోందని సంబంధిత అధికారులను ఉద్దేశించి 'బ్లూమ్‌బెర్గ్' గురువారం ఒక నివేదికలో వెల్లడించింది. రూపాయి పతనాన్ని అడ్డుకునేందుకు, తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు గవర్నర్ సంజయ్ మల్హోత్రాతో సహా ఆర్‌బీఐ ఉన్నతాధికారులు వరుస అంతర్గత సమావేశాలు నిర్వహించినట్లు ఈ నివేదిక పేర్కొంది. గడిచిన బుధవారం నాటి ట్రేడింగ్‌లో రూపాయి అంతర్గతంగా 96.95 వద్ద రికార్డు స్థాయి కనిష్టానికి పడిపోయింది. ఆ తర్వాత కోలుకుని డాలర్‌తో పోలిస్తే 96.86 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో డాలర్ ఇండెక్స్ బలంగా ఉండటం, ముడి చమురు ధరలు అధికంగా కొనసాగడంతో డాలర్లకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. ఈ పరిణామాల వల్లే రూపాయి విలువ చారిత్రక కనిష్ట స్థాయికి పడిపోయి, కొత్త ముగింపు రికార్డును నమోదు చేసింది. అయితే, గురువారం ఉదయం ట్రేడింగ్‌లో రూపాయి తన సర్వకాలిక కనిష్ట ముగింపు స్థాయి నుండి 41 పైసలు పుంజుకుని అమెరికా డాలర్‌తో పోలిస్తే 96.45కు చేరుకుంది. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో డాలర్‌తో పోలిస్తే రూపాయి 96.25 వద్ద బలంగా ప్రారంభమై, ఆ తర్వాత స్వల్పంగా తగ్గి 96.45 వద్ద ట్రేడయ్యింది. బుధవారం నాటి ముగింపు ధర 96.86తో పోలిస్తే ఇది 41 పైసల రికవరీని సూచిస్తోంది.

# ఝార్ఖండ్‌లో 27 మంది మావోయిస్టుల లొంగుబాటు..!

రాంచీ(జనంసాక్షి):ఝార్ఖండ్‌లో నేడు భారీ సంఖ్యలో మావోయిస్టులు ఆ రాష్ట్ర డీజీపీ తదాషా మిశ్రా సమక్షంలో లొంగిపోయారు. మొత్తం 27 మంది మావోలు ఝార్ఖండ్ పోలీసు సీనియర్ అధికారుల ఎదుట ఆయుధాలతో లొంగిపోయినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇది ఝార్ఖండ్ చరిత్రలోనే రికార్డు. వీరిలో చాలామంది మోస్ట్ వాంటెడ్ మావోయిస్టులు కూడా ఉన్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ నవజీవన్‌కు ప్రభావితమై వీరు జనజీవన స్రవంతిలోకి వచ్చినట్లు వెల్లడించారు. 2026లో



రాష్ట్రంలో 22 మంది మావోయిస్టులను మట్టుబెట్టగా.. 44 మందిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. 29 మంది లొంగిపోయారన్నారు. మిగిలినవారు జనజీవన స్రవంతిలోకి చేరినట్లు పేర్కొన్నారు. నేడు లొంగిపోయిన 27 మందికి పునరావాసం కల్పిస్తామని అధికారులు వెల్లడించారు.

**లొంగిపోయిన వారిలో మిశ్ర్ బస్త్ర ఉన్నారా..?**

నేడు మావోయిస్టు పార్టీ చివరి యాక్టివ్ పొలిట్ బ్యూరో సభ్యుడు మిశ్ర్ బస్త్ర అలియాస్ సాగర్‌జీ కూడా ఉండే అవకాశం ఉందని తొలుత మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇప్పటివరకు అధికారుల నుంచి వెలువడిన ప్రకటనలో ఆయన పేరు ప్రస్తావన లేదు. తాజాగా లొంగిపోయిన వారిలో ఆయన సన్నిహిత బృందంలోని టాప్ కమాండర్లు, స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు, ఏరియా కమిటీ సభ్యులు ఉన్నట్లు తెలుస్తోంది.

# కార్మికుల కనీస వేతనాలపై ప్రభుత్వం కీలక నిర్ణయం

అం శాలపై చర్చించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం తరపున శుభాకాంక్షలు. కార్మికులను నాలుగు కేటగిరీలుగా చేశాం. అన్‌స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హైలీ స్కిల్డ్‌గా విభజించాం. వర్క్ జోన్లను మూడు భాగాలుగా విభజించాం. జోన్-1లో మున్సిపల్ కార్పొరేషన్స్, జోన్-2లో మున్సిపాలిటీలు, జోన్-3లో గ్రామీణ ప్రాంతాలను తీసుకుని కనీసవేతనం నిర్ణయించాం అన్నారు. అన్‌స్కిల్డ్ కేటగిరీలో కనీస వేతనాన్ని రూ.12,750 నుంచి రూ.16 వేలకు పెంచాం. సెమీ స్కిల్డ్ కేటగిరీలో రూ.13,152 నుంచి రూ.17 వేలకు.. స్కిల్డ్ కేటగిరీలో రూ.13,772 నుంచి రూ.18,500కు పెంచాం. హైలీ స్కిల్డ్ కేటగిరీలో రూ.14,607 నుంచి రూ.20 వేలకు పెంచాం. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో 1.11 కోట్ల మంది కార్మికులకు మేలు జరుగుతుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం జూన్ 1, 2026 నుంచి అమలవుతుందని అన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మొదటిసారిగా కార్మికుల సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయం ఇది. గత ప్రభుత్వం తన బాధ్యతను వదిలేసింది. మా ప్రభుత్వం బాధ్యతతో వారి ప్రయోజనం కోసం నిర్ణయం తీసుకుంది. కార్మిక నాయకుడంటే వెంకటస్వామి గుర్తొస్తారు. ఆయన వారసుడిగా మంత్రి వివేక్ వెంకటస్వామి.. కార్మికుల సంక్షేమం కోసం మంచి నిర్ణయం తీసుకున్నారు. యువతకు నేను ఒకటే సూచన చేస్తున్నా. ఐటీ, అమెరికా అనే ఆలోచనను వీడండి. ఉద్యోగాలు రాని, ఉపాధి అవకాశాలు లేని చదువులు వ్యర్థం. సాంకేతిక నైపుణ్యంతో జర్మనీ, జపాన్, సింగపూర్ లాంటి ఇతర దేశాల్లో అనేక అవకాశాలు ఉన్నాయి. అందుకే రాష్ట్ర ప్రభుత్వం స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి యువతను ప్రోత్సహిస్తోంది. ఆ దిశగా యువత దృష్టి సారించాలని సూచించారు. ప్రజా సమస్యలను, దేశాల మధ్య యుద్ధాన్ని బీజేపీ, ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం రాజకీయ కోణంలో చూస్తోంది. అందుకే ఎన్నికలు అయిపోగానే పెట్రోల్, డీజిల్ ధరలను రోజుకోసారి పెంచుతున్నారు. మా ప్రభుత్వం ప్రతి అంశాన్నీ దీర్ఘకాలిక దృష్టితో చూస్తుంది. అందుకే కార్మికుల కనీస వేతనం పెంపుపై నిర్ణయం తీసుకున్నాం. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ 80 శాతం పూర్తయింది. ఇంకా 20 శాతం మిగిలి ఉంది. ఆ ప్రక్రియ కూడా త్వరలోనే పూర్తి చేస్తాం. బీఆర్‌ఎస్ నేతలు మానవత్వం మరిచిపోయి వ్యవహరిస్తున్నారు. రైతుల విషయంలో శవ రాజకీయాలు చేయాలని చూస్తున్నారు. రాజకీయాల కోసం మరీ ఇంత దిగజారి వ్యవహరిస్తారా?. నిజంగా రైతులపై ప్రతిపక్షాలకు చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. పోక్సో కేసులో బండి భగీరథ్‌ను పోలీసులే అరెస్ట్ చేశారని స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తన కుమారుడిని అప్పగించి ఉంటే తమ ఇంట్లోనే అప్పగించి ఉండేవారు. పోక్సో కేసులో ఏదో సాధించినట్లు బీఆర్‌ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారు. రాజకీయాలు చేయాలనుకుంటే ఎన్నికల్లో ఓడించాలి.. అంతేకాని దిగజారి ప్రవర్తించొద్దు. కేటీఆర్ బావమరిది ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ దొరికినా నోటీసు ఇచ్చి విచారించాం. బండి భగీరథ్ విషయంలోనూ నోటీసులు ఇచ్చి విచారణ చేస్తున్నాం. పోక్సో కేసులో పోలీసులు ప్రొసీజర్ ప్రకారమే వ్యవహరిస్తున్నారు. కేటీఆర్ ఇంకా కల్వకుంట రాజ్యాంగంలోనే ఉన్నానని అనుకుంటున్నారని అంటూ ఎద్దేవా చేశారు. కేసీఆర్ దిగిపోయి చాలా రోజులు అయ్యింది. పార్టీ మీటింగ్ కోసం జగిత్యాలకు వెళ్లిన కేసీఆర్.. రాష్ట్రంలో ఇంత పెద్ద సంఘటన జరిగితే ఎందుకు బయటకు రాలేదు?. కులగణన విషయంలో సుప్రీంకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. తెలంగాణ నిర్ణయాన్ని ఉన్నత న్యాయస్థానం సమర్థించడం మాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాం. తెలంగాణలో జనగణనతో పాటు కులగణన చేసి అన్ని వివరాలు ప్రజల ముందుంచాం. 'జనగణనలో కులగణన' విషయంలో తెలంగాణ దేశానికి దిక్సూచిగా నిలిచింది. మోదీ ప్రభుత్వం తక్షణమే జనగణనలో కులగణన చేర్చి బలహీన వర్గాలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించాలి' అని అన్నారు.

# సోనియా కుటుంబానికి తెలంగాణ రుణపడిఉంది



హైదరాబాద్(జనంసాక్షి): దేశం కోసం ప్రాణాలర్పించిన మహా నాయకుడు రాజీవ్‌గాంధీ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా సచివాలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి సీఎంతో పాటు కాంగ్రెస్ నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సాంకేతిక విప్లవాన్ని దేశానికి అందించిన గొప్ప దార్శనికుడు అని కొనియాడారు. 'కంప్యూటర్, ఐటీ, టెలికామ్‌లను దేశానికి తీసుకువచ్చింది ఆయనే. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు తెచ్చారు. రాహుల్‌గాంధీ కుటుంబం దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసింది. తెలంగాణ సమాజం సోనియాగాంధీ కుటుంబానికి ఎంతో రుణపడి ఉంది. సోనియా సాహసోపేత నిర్ణయంతోనే తెలంగాణ సాకారమైంది. మహిళా రిజర్వేషన్ల అమలు బిల్లులో మోదీ సర్కార్ కుయుక్తులు పన్నింది. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు డీలిమిటేషన్‌తో లింక్ పెట్టారు. ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి.. మహిళా బిల్లును ఎన్డీఏ ప్రభుత్వం మళ్లీ పార్లమెంట్‌లో పెట్టాలని సీఎం డిమాండ్ చేశారు. దేశంలో సాంకేతికతను తీసుకొచ్చిన గొప్ప దార్శనికుడు రాజీవ్ గాంధీ అని అన్నారు. దేశంలో మహిళా రిజర్వేషన్లు తీసుకొచ్చారని తెలిపారు. సరళీకృత విధానాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లిన గొప్ప దార్శనికుడు రాజీవ్ అని చెప్పుకొచ్చారు. సోనియా గాంధీ సాహసోపేత నిర్ణయంతోనే తెలంగాణ కల సాకారమైందని సీఎం అన్నారు. తెలంగాణకు గాంధీ కుటుంబంతో అవినాభావ సంబంధం ఉందన్నారు. అది కుటుంబ సంబంధం కంటే ఎక్కువని తెలిపారు. తెలంగాణ ఉన్నంత వరకు ప్రజలు గాంధీ కుటుంబాన్ని గుర్తు చేసుకుంటారని అన్నారు. రాజీవ్ గాంధీ స్ఫూర్తితో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు తీసుకురావాలన్నారు. తక్షణమే ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు ఏర్పాటు చేసి లోక్ సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఇండియా కూటమి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందన్నారు.మహిళా రిజర్వేషన్ల ముసుగులో రాజకీయాలు చేయాలనుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. రాజీవ్ గాంధీ స్ఫూర్తితో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళ్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సీఎంతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు... రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు దానం నాగేందర్, అంజన్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రివర్గం ప్రక్షాళన..!?

తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ పునర్వ్యవస్థీకరణలో కూడా ఆయనకు మొండిచేయే ఎదురయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. అయితే, "నన్ను బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించిన సమయంలోనే మంత్రి పదవి ఇస్తామని అధిష్టానం పెద్దలు హామీ ఇచ్చారు. కానీ ఇప్పుడు ఆ మాట తప్పుతున్నారు." అని రాజగోపాల్ రెడ్డి తన సన్నిహితుల వద్ద తీవ్ర ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే 'అసమ్మతి నేత'గా ముద్రపడటంతో ఆయన పేరును పక్కన పెట్టారా? లేక చివరి నిమిషంలో ఏమైనా మార్పులు జరుగుతాయా? అన్నది వేచి చూడాలి.

**ఢిల్లీ వేదికగా ఆశావహుల లాబీయింగ్**

మంత్రివర్గంలో ఇంకా రెండు స్థానాలు ఖాళీగా ఉండటంతో.. ఎలాగైనా సరే ఆ బెర్తులను దక్కించుకునేందుకు ఆశావహులు తమ శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. అధిష్టానాన్ని ప్రసన్నం చేసుకునేందుకు ఇప్పటికే పలువురు నేతలు ఢిల్లీ బాట పట్టారు. ఇప్పటికే పలువురు పలుమార్లు హస్తిన చుట్టూ చక్కర్లు కొట్టి వచ్చారు. రాష్ట్ర పగ్గాలు చేపట్టిన తర్వాత జరుగుతున్న మొదటి ప్రధాన మార్పులు కావడంతో, అటు కాంగ్రెస్ శ్రేణుల్లోనూ, ఇటు ప్రతిపక్షాల్లోనూ ఈ మంత్రివర్గ విస్తరణ తీవ్ర ఉత్కంఠను రేపుతోంది.

**ఎబోలా వైరస్ కలకలం..**

# ఇండియా-ఆఫ్రికా సమిట్ వాయిదా

**ఎయిర్‌పోర్ట్‌లో అడ్వయిజరీ జారీ**

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఆఫ్రికాలో ఎబోలా వైరస్ విజృంభిస్తోంది. ముఖ్యంగా కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ వంటి దేశాల్లో పరిస్థితి తీవ్రంగా ఉంది. ఈ పరిణామాల నడుమ దిల్లీ వేదికగా ఈ నెల 28-31 తేదీల మధ్య జరగాల్సిన 'ఇండియా- ఆఫ్రికా ఫోరమ్ సమిట్' వాయిదా పడింది. భారత్, ఆఫ్రికన్ యూనియన్ కలిసి ఈమేరకు నిర్ణయం తీసుకున్నట్లు విదేశాంగశాఖ వెల్లడించింది. కొత్త తేదీలను పరస్పర సంప్రదింపుల ద్వారా ఖరారు చేస్తామని తెలిపింది. ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాల్లో ప్రజారోగ్యానికి సంబంధించి విపత్కర పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సమస్య పరిష్కారానికి ఆఫ్రికా సీడీసీ, సంబంధిత సంస్థలకు మద్దతు ఇచ్చేందుకు భారత్ సిద్ధంగా ఉందని విదేశాంగశాఖ పేర్కొంది. మరోవైపు.. ఎబోలా వైరస్ వ్యవహారంలో దిల్లీ ఎయిర్‌పోర్టు అధికారులు కీలక అడ్వైజరీ జారీ చేసిన విషయం తెలిసిందే. కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ నుంచి వచ్చే ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జ్వరం, తలనొప్పి, నీరసం, కండరాల నొప్పులు తదితర సమస్యలు కనిపిస్తే వెంటనే ఎయిర్‌పోర్టు వైద్యసిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. దాదాపు 600 అనుమానిత కేసులను గుర్తించారు. కాంగోలో వైరస్ వ్యాప్తిని ఎదుర్కొనేందుకు తమకు మరింత సామగ్రి, సిబ్బంది అవసరమని అధికార వర్గాలు, సహాయక బృందాలు కోరాయి. మొదటి మరణం నమోదైన బునియా ప్రాంతానికి దాదాపు 20 టన్నుల సహాయ సామగ్రిని తరలించినప్పటికీ.. ఐసొలేషన్ గదుల కొరత కారణంగా వైద్యులు సాధారణ వార్డుల్లోనే ఎబోలా అనుమానిత రోగులకు చికిత్స అందిస్తున్నారు.

# మోదీ,షాలు దేశాన్ని అమ్మేస్తున్నారు

గుర్తు చేయండి. వారు రోజూ రాజ్యాంగంపై, అంబేడ్కర్‌పై, గాంధీజీపై దాడి చేస్తున్నారని తెలపండి" అని ప్రజలకు సూచించారు. "మన రాజ్యాంగాన్ని బలహీనపరచడంతోపాటు ధ్వంసం చేసిన వారిని ఏమందాం.. ద్రోహులు అనవద్దా" అని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలు చేసినందుకు తాను క్షమాపణ చెప్పాలని డిమాండు చేస్తారని, అయినా భయపడేది లేదని రాహుల్ స్పష్టం చేశారు. "పెద్ద నోట్ల రద్దు, కొవిడ్ సమయంలో మాదిరిగానే టీవీలో ఏడుస్తున్నట్లు మోదీ మళ్లీ నటిస్తారు. వారే రాజ్యాంగాన్ని ధ్వంసం చేసి మళ్లీ ఏడుపు ముఖం పెడతారు. మహనీయుల విగ్రహాల వద్దకు వెళ్లి చేతులు జోడించడంవల్ల లాభం లేదు. అక్కడి నుంచి వెళ్లగానే వారి సిద్ధాంతాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే అందులో అర్థమేముంది" అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. భారత ఆర్థిక వ్యవస్థను అదానీ, అంబానీ, అమెరికా చేతిలో మోదీ పెట్టారని విమర్శించారు. ప్రభుత్వ రంగాన్ని మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరిస్తోందని, ఆరెస్సెస్‌తో సంబంధమున్న వారిని వైస్ ఛాన్సలర్లుగా నియమిస్తోందని రాహుల్ ఆరోపించారు. వారికి సైన్స్, చరిత్ర, జాగ్రఫీపై అవగాహన లేదని విమర్శించారు. మోదీ, అమిత్ షాలను ద్రోహులుగా పేర్కొనడం ద్వారా 140 కోట్ల మంది ప్రజలను రాహుల్ గాంధీ అవమానించారని, అది ఆయన అరాచకత్వానికి నిదర్శనమని భాజపా అధ్యక్షుడు నితిన్ నబీన్ వ్యాఖ్యానించారు. రాహుల్ క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. ఎన్నికల్లో ఓడిపోయిన అసహనం ఆయన వ్యాఖ్యల్లో కనిపిస్తోందని తెలిపారు. మానసిక సమతుల్యతను కోల్పోయారని విమర్శించారు. రాహుల్ గాంధీ అర్బన్ నక్సల్ మనస్తత్వానికి ఇది నిదర్శనమని భాజపా అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ వ్యాఖ్యానించారు. ఆయన దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీ 'తిరస్కరణకు గురైన మాల్' (పదార్థం) అని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ విమర్శించారు.

# పుల్వామా ఉగ్రదాడి సూత్రధారి హతం

**ఆక్రమిత కాశ్మీర్‌లో దుండగుల చేతిలో మృతి**

న్యూఢిల్లీ(జనంసాక్షి):2019 పుల్వామా ఉగ్రదాడికి కీలక సూత్రధారిగా భావిస్తున్న హమ్జా బుర్హాన్ పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో హతమైనట్లు సమాచారం. ముజఫరాబాద్‌లో గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరపడంతో అతడు మృతి చెందినట్లు వార్తలు వస్తున్నాయి. 2019 ఫిబ్రవరి 14న జమ్మూ కశ్మీర్‌లోని పుల్వామాలో సీఆర్‌పీఎఫ్ కాన్వాయ్‌పై జరిగిన ఆత్మాహుతి దాడిలో 40 మంది జవాన్లు మరణించారు .పుల్వామా దాడికి పాకిస్థాన్‌కు చెందిన జైష్-ఎ-మహ్మద్ ఉగ్రసంస్థ బాధ్యత వహించింది. జైష్-ఎ-మహ్మద్ సంస్థకు అనుబంధంగా పని చేసిన హమ్జా బుర్హాన్ పుల్వామా దాడి ప్రణాళికలో కీలక పాత్ర పోషించాడని భారత దర్యాప్తు సంస్థలు అనుమానించాయి. తాజాగా అతడు గుర్తు తెలియని వ్యక్తుల చేతుల్లో హతమవడం సంచలనంగా మారింది . ఇటీవల పాకిస్థాన్‌లో భారత వ్యతిరేక ఉగ్రవాదులు వరుసగా గుర్తు తెలియని వ్యక్తుల దాడుల్లో హతమవుతున్న ఘటనలు పెరుగుతున్నాయి.

# 'సంధి'పై పకడ్బందీ

గుండా వెళ్లే ప్రతి అంతర్జాతీయ నౌకను తన రాడార్ పరిధిలోకి తెచ్చుకుంది. అంతర్జాతీయ చట్టాలను, నిబంధనలను ఉల్లంఘించాయనే సాకుతో పాశ్చాత్య దేశాలకు చెందిన వాణిజ్య నౌకలను, చమురు ట్యాంకర్లను ఐఆర్ జిసి దళాలు అడ్డుకోవడం లేదా జప్తు చేయడం ద్వారా ఇరాన్ క్షేత్రస్థాయిలో తన సార్వభౌమాధికారాన్ని ప్రదర్శిస్తోంది.

**అంతర్జాతీయ చట్టాల పరిమితులు**

ఐక్యరాజ్యసమితి 'కన్వెన్షన్ ఆన్ ది లా ఆఫ్ ది సీ' ప్రకారం, ఈ అంతర్జాతీయ జలసంధి గుండా ప్రయాణించే నౌకలకు 'ట్రాన్సిట్ పాసేజ్' (స్వేచ్ఛా ప్రయాణ) హక్కు ఉంటుంది. అయితే, ఇరాన్ ఈ చట్టాన్ని పూర్తిగా ఆమోదించలేదు. తమ జాతీయ భద్రత దృష్ట్యా ఏ నౌకనైనా తనిఖీ చేసే హక్కు, నిలిపివేసే హక్కు తమకు ఉందని ఇరాన్ వాదిస్తోంది. తమపై పాశ్చాత్య దేశాలు ఆర్థిక ఆంక్షలు విధిస్తే.. హర్ముజ్ జలసంధిని పూర్తిగా మూసివేస్తామని ఇరాన్ పదేపదే హెచ్చరించడం ప్రపంచ దేశాలను ఆందోళనకు గురిచేస్తోంది.

**ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం**


హర్ముజ్ జలసంధి వద్ద ఇరాన్ చిన్న చర్య చేపట్టినా ప్రపంచవ్యాప్తంగా అలజడి రేగుతుంది. ఇక్కడ ఉద్రిక్తతలు పెరిగిన మరుక్షణమే అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా ఆకాశాన్ని తాకుతాయి. అదేవిధంగా ఈ మార్గంలో ప్రయాణించే వాణిజ్య నౌకల భద్రతా భీమా ఖర్చులు విపరీతంగా పెరిగి, అంతర్జాతీయ వ్యాపారాలపై మోయలేని భారం పడుతుంది. అమెరికా, దాని మిత్రదేశాల నౌకాదళాలు ఈ ప్రాంతంలో నిరంతరం పహారా కాస్తున్నప్పటికీ, ఇరాన్ ఉన్న భౌగోళిక సామీప్యత దానికి స్పష్టమైన ఆధిక్యతను ఇస్తోందని రాయిటర్స్ పేర్కొంది. హర్ముజ్ జలసంధిపై ఇరాన్ కలిగి ఉన్న పట్టు కేవలం సైనికపరమైనది మాత్రమే కాదు.. అది ప్రపంచ ఇంధన భద్రతను బ్లాక్‌మెయిల్ చేయగల ఒక వ్యూహాత్మక ఆయుధంగా మారిందని అంతర్జాతీయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# మణుగూరు-రామగుండం రైల్వేలైన్‌కు కేంద్రం ఆమోదం?

కానీ, ఈ కొత్త లైన్ పూర్తయితే మణుగూరు-రామగుండం మధ్య ఏకంగా 90 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. దీనివల్ల ప్రయాణికులకు సమయం, డబ్బు భారీగా ఆదా అవుతాయి. మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరతో పాటు, భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి వెళ్లే భక్తులకు కనెక్టివిటీ మరింత సులభతరం కానుంది. ఈ ప్రాజెక్ట్ ముఖ్యంగా ములుగు, పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని వెనుకబడిన మారుమూల గిరిజన ప్రాంతాలకు ఒక పెద్ద వరంగా మారబోతోంది. దశాబ్దాలుగా రైలు ముఖం చూడని ఎన్నో గ్రామాలకు ఈ లైన్ ద్వారా రైల్వే కనెక్టివిటీ లభిస్తుంది. కేవలం ప్రయాణికులకు మాత్రమే కాకుండా, ఈ ప్రాంతంలో లభించే బొగ్గు, ఖనిజాలు, ఎరువులు , ఇతర పారిశ్రామిక సరుకు రవాణాకు ఈ రైల్వే లైన్ అత్యంత కీలకంగా మారనుంది. దీనివల్ల సింగరేణి బొగ్గు గనుల రవాణా మరింత వేగవంతం కానుంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు పనులను వేగంగా పూర్తి చేసేందుకు రైల్వే శాఖ సరికొత్త ప్లాన్ సిద్ధం చేసింది. డీపీఆర్ తయారీ, భూసేకరణ, వివిధ ప్రభుత్వ శాఖల నుండి అనుమతులు తీసుకునే బాధ్యతలను రైల్వే శాఖ చూసుకుంటుంది. అయితే, ప్రాజెక్ట్ నిర్మాణం , నిధుల సమీకరణ పనులను ప్రైవేట్ భాగస్వామ్య సంస్థకు అప్పగిస్తారు. దీనికోసం రైల్వే శాఖ త్వరలోనే టెండర్లను ఆహ్వానించనుంది. ఈ ప్రాజెక్ట్ టైమ్‌లైన్ ప్రకారం.. మొదటి ఏడాదిలో పూర్తిగా భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి, ఆ తర్వాత నాలుగు సంవత్సరాల్లో అంటే మొత్తం ఐదేళ్ల వ్యవధిలో ఈ కొత్త రైల్వే లైన్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇదిలావుంటే కేంద్ర రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌ను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గురువారం ఢిల్లీలో కలిశారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై ఇరువురు చర్చించారు. తెలంగాణలో రైల్వేప్రాజెక్టుల పురోగతి, కొత్త ప్రాజెక్టులు, ఎలక్ట్రిఫికేషన్ తదితర ప్రాజెక్టులపై మాట్లాడారు. ఈ సమావేశంలో తెలంగాణలోని 42 ప్రధాన రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులకు సంబంధించి వివరంగా చర్చించారు. హైదరాబాద్ నగరంతో పాటుగా, చుట్టుపక్కల ప్రాంతాల ప్రయాణికులకు కీలకమైన రవాణా సౌకర్యంగా ఉన్న విషయంపై మాట్లాడారు. టైమింగ్స్ రెగ్యులరైజేషన్, సౌకర్యాలను మరింత మెరుగు పరిచేలా చొరవ తీసుకోవాలని తాను కోరానని.. దీనికి కేంద్ర రైల్వేమంత్రి సానుకూలంగా స్పందించారని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి తదనుగుణంగా ఎంఎంటిఎస్ మెరుగుపరచడం కోసం చర్యలు తీసుకుంటామని కిషన్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో కొత్త రైల్వేలైన్లు, హైస్పీడ్ రైల్ కారిడార్ పనుల పురోగతి తదితర అంశాలు కూడా ఈ సమావేశంలో చర్చకు వచ్చాయని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో తెలంగాణలో రైల్వేల అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం పూర్తి అంకితభావంతో పనిచేస్తోందని వెల్లడించారు. రానున్న రోజుల్లోనూ రైల్వేనెట్‌వర్క్ పెంచడం, ప్రజలకు సౌకర్యాల అభివృద్ధిలో పూర్తి సహకారం ఉంటుందని రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు.

# పాక్‌లోనే పహల్గాం దాడికి పథకం

**ఎన్ఐఏ ఛార్జ్‌షీట్‌లో సంచలన విషయాలు**



న్యూఢిల్లీ(జనంసాక్షి):జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిపై జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ దాఖలు చేసిన ఛార్జిషీట్‌లో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ఉగ్రదాడికి సంబంధించి.. వ్యూహారచన, పథకం అమలు అంతా పాకిస్థాన్ కేంద్రంగానే సాగిందనేందుకు బలమైన సాక్ష్యాలతో ఎన్ఐఏ బహిర్గతం చేసింది. ఈ ఘటన జరిగిన వెంటనే ఈ దాడికి తామే బాధ్యులమంటూ లష్కరే తోయిబా అనుబంధ సంస్థ ది రెసిస్టెంట్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్) ప్రకటించింది. ఈ దాడికి వ్యూహ రచన నుంచి టీఆర్ఎఫ్ చేసిన ఈ ప్రకటన వరకు అంతా పాకిస్థాన్‌లోనే జరిగిందని వివరించింది. అందుకు సంబంధించిన ఫోన్ కాల్స్, ఐపీ అడ్రాస్ తదితర అంశాలను ఈ ఛార్జిషీట్‌లో ఎన్ఐఏ పొందుపరిచింది. ఈ ఉగ్రదాడికి పాల్పడిన ఉగ్రవాదులు ఫైజల్ జాట్ అలియాస్ సులేమాన్ షా, హబీబ్ తాహిర్ అలియాస్ జిబ్రాన్, హమ్జా అఫ్ఘానీల ఐపీ అడ్రస్, ఫోన్ నెంబర్లతోపాటు ఇతర ఆధారాలన్నీ పాక్‌లోని ఈ దాడి వెనుక సూత్రధారులతో వీరికి సంబంధాలు ఉన్నట్లు ఎన్ఐఏ గుర్తించింది. సైనిక బలగాలు చేపట్టిన 'ఆపరేషన్ మహాదేవ్'లో ఈ ముగ్గురు ఉగ్రదాలను కాల్చి చంపాయి. వారి నుంచి మొబైళ్లు స్వాధీనం చేసుకున్నాయి. అవి పాక్‌లోనే కొనుగోలు చేసినట్లు ఎన్ఐఏ దర్యాప్తులో తేలింది. ఈ మొబైల్ ఫోన్లు.. లాహోర్, కరాచీలో కొనుగోలు చేసినట్లు గుర్తించాయి. 2025, ఏప్రిల్ 22వ తేదీన పహల్గాంలోని బైసరన్ లోయలోకి ఉగ్రవాదులు ప్రవేశించి.. పర్యాటకులపై కాల్పులు జరిపారు. ఈ ఘటనలో మొత్తం 25 మంది మరణించారు. ఈ కాల్పుల ఘటనకు తామే బాధ్యులమని లష్కరే తోయిబా అనుబంధ సంస్థ ది రెసిస్టెంట్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్) ప్రకటించింది. అది కూడా సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. దీనిపై అంతర్జాతీయంగా విమర్శలు వెల్లువెత్తాయి. దాంతో టీఆర్ఎఫ్ వెనక్కి తగ్గింది. ఈ టీఆర్ఎఫ్ ప్రకటనపై కూడా ఎన్ఐఏ విచారణ జరిపింది. ఇవి కూడా పాకిస్థాన్ నుంచే వచ్చాయని వివరించింది. ఉగ్రదాడికి టీఆర్ఎఫ్‌కు చెందిన ఉగ్రవాది సైపుల్లా అలియాస్ సాదిజ్ జాట్ కీలక సూత్రధారి అని ఎన్ఐఏ స్పష్టం చేసింది. అతడి ఆదేశాల మేరకే తీవ్రవాదులు బైసరన్ లోయలో రెక్కి నిర్వహించారని తన ఛార్జిషీట్‌లో ఎన్ఐఏ వెల్లడించింది. ఈ దాడి జరిగిన రోజు.. ఆ తీవ్రవాదులతో సైపుల్లా నిరంతరం చర్చలు జరిపినట్లు గుర్తించామని ఎన్ఐఏ తెలిపింది.

# బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు

**119 నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జిల నియామకం**

హైదరాబాద్(జనంసాక్షి):బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కోసం అధినేత కేసీఆర్ ఇన్‌ఛార్జిలను ప్రకటించారు. డిజిటల్ ప్రక్రియలో బీఆర్‌ఎస్ సభ్యత్వ నమోదు జరగనుంది. 119 నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జిలను బీఆర్‌ఎస్ అధినేత నియమించారు. నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలకు తెలంగాణ భవన్‌లో ఐటీ నిపుణులతో డిజిటల్ శిక్షణ ఇవ్వనున్నారు. సభ్యత్వ నమోదు కోసం డిజిటల్ యాప్‌ను రూపొందించారు. తెలంగాణ భవన్‌లో శిక్షణ తర్వాత.. పార్టీ జిల్లా కార్యాలయాల్లో పార్టీ ప్రధాన కార్యదర్శులు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జిల ఆధ్వర్యంలో శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నారు. పోలింగ్ బూత్‌కు ఇద్దరు చొప్పున వారం రోజుల పాటు శిక్షణ శిబిరాలు నిర్వహించాలని బీఆర్‌ఎస్ నిర్ణయించింది. .

# బండి భగీరథ్ రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌కు హైకోర్టు అనుమతి

హైకోర్టు.. తీర్పును రిజర్వు చేసింది. 16న భగీరథ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో ముందస్తు బెయిల్ పిటిషన్ ఉపసంహరణకు ఆయన తరపున న్యాయవాది అనుమతి కోరారు. న్యాయవాది విజ్ఞప్తి మేరకు హైకోర్టు ఆ పిటిషన్‌ను కొట్టివేసింది. రెగ్యులర్ బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకునేందుకు ఉన్నత న్యాయస్థానం అనుమతించింది.

# భారత ముఖచిత్రాన్ని మార్చిన రాజీవ్

**వర్ధంతి సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి నివాళి**



**హైదరాబాద్, మే21 (జనంసాక్షి) :** భారతదేశ ముఖచిత్రాన్ని మార్చిన మహోన్నత నాయకుడు, మాజీ ప్రధాని, భారత రత్న రాజీవ్ గాంధీ అని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ఉన్న తన నివాసంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన రాజీవ్ గాంధీ సేవలు స్మరించుకున్నారు. భారతదేశాన్ని 21వ శతాబ్దంలోకి నడిపించిన ఘనత, ఆధునిక సాంకేతిక విప్లవానికి నాంది పలికిన దార్శనికుడు రాజీవ్ గాంధీ. దేశంలో ఐటీ, టెలికాం రంగాల్లో నేడు మనం చూస్తున్న పురోగతి ఆయన వేసిన పునాదే. దేశ సమగ్రత, ఐక్యత కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన అమరవీరుడు రాజీవ్ గాంధీ. ఆయన ఆశయ సాధన కోసం, దేశ పురోభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలి.' అని పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ చూపిన శాంతి, సామరస్యం, లౌకికవాద మార్గంలో నడుస్తూ, బలహీన వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు, అభిమానులు పాల్గొని అంజలి ఘటించారు.

# పుష్కర స్నానమాచరించిన గవర్నర్ శుక్లా

**కాళేశ్వరం, మే 22 (జనంసాక్షి) :** సరస్వతి అంత పుష్కరాల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా కాళేశ్వరం సరస్వతి పుష్కర ఘాట్ లో మొదటిరోజు పుష్కర స్నానం ఆచరించారు. ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా హైదరాబాదు నుండి సాయంత్రం నాలుగు గంటల 30 నిమిషాలకు పుష్కర ఘాట్ వద్ద ఏర్పాటుచేసిన హెలిపాడ్ వద్దకు గవర్నర్ చేరుకున్నారు. ఎలిప్యాడ్ వద్ద మంత్రి శ్రీధర్ బాబు , కలెక్టర్ రాహుల్ శర్మ , ఎస్పీ సంకీర్త్ గవర్నర్ దంపతులకు స్వాగతం పలికారు. అనంతరం మెగా కంపెనీ నిర్మించిన అతిథి గృహం వద్దకు చేరుకున్న గవర్నర్ కు పోలీస్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అతిథి గృహంలో కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న అనంతరం సరస్వతి పుష్కర ఘాటుకు చేరుకొని పుణ్య స్నానమాచరించారు. అనంతరం శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామివారి దర్శనం చేసుకున్నారు. ఆలయానికి చేరుకున్న గవర్నర్ కు అర్చకులు , వేద పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. కాళేశ్వర ముక్తేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాల అనంతరం పార్వతి,





సరస్వతి అమ్మవార్ల దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆశీర్వచన మండపం వద్ద గవర్నర్ దంపతులకు, మంత్రి శ్రీధర్ బాబు దంపతులకు అర్చకులు వేద ఆశీర్వచనం చేసి ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పాలకమండలి చైర్మన్, సభ్యులు గవర్నర్ తో ఉన్నారు. అనంతరం కంచి శ్రీ శంకర విజయేంద్ర స్వామి వారిని దర్శించుకుని వారి ఆశీస్సులు పొందారు. తరువాత కంచి శ్రీ శంకర విజయేంద్ర స్వామి వారితో , మంత్రి శ్రీధర్ బాబు తో కలిసి గవర్నర్ మ్యూజియంలో ఆవిష్కరించారు. ఈ మ్యూజియంలో పురాతన విగ్రహాలను పొందుపరిచి ఆలయ చరిత్రను తెలిపే విధంగా తీర్చిదిద్దారు. మరల పుష్కర ఘాటు వద్దకు వెళ్లి సరస్వతీ నదిహారతి, తెప్పోత్సవం తిలకించారు.

### మ్యూజియంను ప్రారంభించిన గవర్నర్

రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా దంపతులు గురువారం కాళేశ్వరం లో 1.20 కోట్ల వ్యయంతో నిర్మించబడిన నూతన మ్యూజియంను కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతితో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మ్యూజియంను పరిశీలించి, అందులో ఏర్పాటు చేసిన విభిన్న శిలా సంపదను ఆసక్తిగా వీక్షించారు. ఈ మ్యూజియం చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా నిర్మించబడినదని గవర్నర్ తెలిపారు. ప్రజలు, ముఖ్యంగా యువత మరియు విద్యార్థులు ఈ మ్యూజియంను సందర్శించి శిలా సంపదపై అవగాహన పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. శిలా సంపద మ్యూజియం ఏర్పాటు చేయడం పట్ల ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఈ దేవాదాయ శాఖ కార్యదర్శి శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం గవర్నర్ దంపతులకు జిల్లా యంత్రాంగం ధన్యవాదాలు తెలిపారు.

# మైనార్టీ డిగ్రీ కాలేజీలపై 'సీఎం' మాట తప్పొద్దు

- మైనార్టీ గురుకుల డిగ్రీ కళాశాలల జీవో విడుదల చేయాలి
- మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు యాకూబ్ పాషా డిమాండ్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రంలో మైనార్టీ గురుకుల డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలు కేవలం వాగ్దానాలకే పరిమితం కానున్నాయ్యాని మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యాకూబ్ పాషా గురువారం ఒక ప్రకటనలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఐదేళ్లుగా రాష్ట్రంలో మైనార్టీలకు గురుకుల డిగ్రీ కళాశాలలు లేకపోవడం వల్ల, ప్రతి ఏటా సుమారు 8,000 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ పూర్తి చేసినా ఉన్నత చదువులకు దూరం అవుతూ డ్రాప్ అవుట్లుగా మిగులుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు గురుకుల డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేసిన ప్రభుత్వాలు, మైనార్టీల విషయానికి వచ్చేసరికి మీనమేషాలు లెక్కించడం వారిని కేవలం ఓటు బ్యాంకుగా చూసే విధానానికి నిదర్శనమని మండిపడ్డారు. ఈ నెల 8వ తేదీన సచివాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి స్వయంగా ఉమ్మడి జిల్లా కేంద్రాలలో మైనారిటీలకు ప్రత్యేక డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేసి వాటిలో నైపుణ్యాభివృద్ధికి ఏఐ శిక్షణకు ప్రా ధాన్యతనిచ్చి సాంప్రదాయ కోర్సులకు కాకుండా ఉపాధి ఆధారిత కోర్సులతో కాలేజీ లను ఏర్పాటు చేయాలని సూచించినప్పటికీ, నేటి వరకు ఆ దిశగా ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయకపోవడం విస్మయానికి గురిచేస్తోం దన్నారు. ఇప్పటికే 'దోస్త్' మొదటి, రెండు దశల అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో, సీఎం రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి ప్రస్తుత విద్యా సంవత్సరంలోనే మైనార్టీ డిగ్రీ కాలేజీల ఏర్పాటుకు జీవో విడుదల చేయాలని, తద్వారా మైనారిటీ విద్యార్థుల ఉన్నత చదువులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.

# సోలార్ ఎనర్జీ నిల్వ... సింగరేణికి సిరులు..

- మిగులు సోలార్ విద్యుత్‌కు విలువ తెచ్చిన సింగరేణి
- సోలార్ విద్యుత్తు నిల్వ చేస్తున్న బీఈఎస్ఎస్
- తొలి అతిపెద్ద ప్రాజెక్టు సింగరేణిలో ఏర్పాటు
- నాలుగు నెలల్లోనే సత్ఫలితాలు

**హైదరాబాద్, మే21 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు రాష్ట్రంలోనే తొలిసారిగా సింగరేణిలో ఏర్పాటు చేసిన బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ సత్ఫలితాన్ని ఇస్తోంది. పగటిపూట ఉత్పత్తి జరిగే సోలార్ విద్యుత్తులో వినియోగించబడని విద్యుత్తును ఉచితంగా గ్రిడ్ కు సరఫరా చేయకుండా, బ్యాటరీలో నిలువ చేసుకొని, అవసరమైన ప్పుడు వాడుకునే అవకాశం కలిగించే ఈ వ్యవస్థ సింగరేణికి ఆర్థిక లబ్ది చేకూర్చుతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశాల మేరకు నాలుగు నెలల క్రితం మందమర్రి ఏరియాలోని 28 మెగావాట్ల సింగరేణి సోలార్ ప్లాంట్‌కు అనుబంధంగా 1 మెగావాట్ బ్యాటరీ ఎనర్జీ సిస్టమ్ నెలకొల్పడం జరిగింది. ఇందు కోసం రూ.2.5 కోట్లను యాజమాన్యం వెచ్చించింది. రాష్ట్ర ప్రభుత్వం సౌర విద్యుత్తుకు అందిస్తున్న ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకొని సింగరేణితో సహా పలు రాష్ట్ర సంస్థలు సోలార్ విద్యుత్ ను ఉత్పత్తి చేస్తున్నాయి. సింగరేణి సంస్థ ఇప్పటికే 8 చోట్ల 245.5 మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ ప్లాంట్లను ఏర్పా టు చేసింది. వీటిలో 147 మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్లను ఓపెన్ యాక్సెస్ ప్లాంట్లుగా, మిగిలిన 98.50 మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్ ను ఇన్ హౌజ్ ప్లాంట్స్‌గా గుర్తించి తెలంగాణ విద్యుత్తు గ్రిడ్డులకు అనుసంధానం చేసింది. ఈ ఇన్ హౌజ్ ప్లాంట్ ట్ల విద్యుత్తును కూడా తెలంగాణ విద్యుత్ శాఖ గ్రిడ్లకు అనుసం ధానం చేసినప్పటికీ విద్యుత్ ఒప్పందం ప్రకారం ఇక్కడ స్థానిక అవసరాలకు వాడగా మిగిలిన విద్యుత్తుకు మాత్రం తెలంగాణ డిస్కము ఎటువంటి చెల్లింపులు జరపదు. మిగులు విద్యుత్తును కేవలం ఉచితంగానే గ్రిడ్డుకు సరఫరా చేయాల్సి ఉంటుంది. ఈ విధంగా ఇన్ హౌస్ ప్లాంట్ల నుండిరోజుకు వేలాది యూనిట్ల మిగులు విద్యుత్తును ఎటువంటి ఆర్థిక ప్రయోజనం లేకుండా గ్రిడ్ కు సరఫరా చేయడం జరుగుతోంది. అయితే ఈ మిగులు విద్యుత్తును కూడా సొమ్ము చేసుకోవాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు సింగరేణి సంస్థ రాష్ట్రంలోనే తొలిసారిగా ఒక మెగావాట్ సామర్థ్యం గల బీఈఎస్ఎస్ ను మందమర్రి ప్లాంట్ లో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసింది. మందమర్రి లో గల 28 మెగావాట్ల సోలార్ ప్లాంట్ సమర్థంగా పనిచేస్తూ మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియా లలోని గనులకు, కాలనీలకు అవసరమైన విద్యుత్తును అందిస్తోంది. అయితే స్థానిక విద్యుత్తు అవసరాలకు సరిపోగా ఇంకా కొంత విద్యుత్తు మిగిలిపోతుంది. ఈ నేపథ్యంలో మందమర్రి ప్లాంటు లో జనవరి నెలలో బ్యాటరీ ఎనర్జీ స్టోరీ సిస్టం ను సింగరేణి ఏర్పాటు చేసింది. అప్పటి నుండి ఇప్పటి వరకు బీఈఎస్ఎస్ యూనిట్ స్థానిక అవసరాలకు వినియోగిం చగా ఇంకా మిగిలిన 3,35,485 యూనిట్ల విద్యుత్తును నిల్వ చేసుకొని అవసరమైన సందర్భంలో వినియోగించు కుంది. తద్వారా సింగరేణి సంస్థకు రూ. 25,66,460 ఆర్థిక లబ్ది చేకూరింది. ఇక మెగావాటు సామర్థ్యం గల బీఈఎస్ఎస్ యూనిట్ ఇంత పెద్ద మొత్తంలో విద్యుత్తును ఆదా చేయడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ఇక్కడ ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన బీఈఎస్ఎస్ విజయవంతం అవడంపై సింగరేణి యాజమా న్యం హర్షం వ్యక్తం చేసింది. పునరుత్పాదక ఇంధన వనరులను ప్రోత్సహించాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా మరిన్ని ప్రాజెక్టులను చేపట్టేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు యాజమాన్యం ప్రకటించింది.



## రాజీవ్‌కు భట్టి ఘన నివాళి

**న్యూఢిల్లీ, మే21 (జనంసాక్షి) :** భారతరత్న, దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా న్యూఢిల్లీలోని 'వీర్ భూమి' వద్ద డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కక ఘన నివాళులు అర్పించారు. భారతదేశాన్ని ఆధునిక సాంకేతిక యుగం వైపు నడిపించిన మహోన్నత నాయకుడు రాజీవ్ గాంధీ అన్నారు. నవ భారత నిర్మాణం కోసం, యువతకు ఓటు హక్కు కల్పించి వారి సాధికారత కోసం ఆయన చూపిన దూరదృష్టి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకం. దేశ ప్రగతి కోసం, ప్రజాస్వామ్య విలువల రక్షణ కోసం ఆయన చేసిన త్యాగాలు వృథా కావన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాల సాధనలో, కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి ప్రజా సేవకు నిరంతరం పునరంకితమౌతామని పిలుపునిచ్చారు.

# మ్యూల్ అకౌంట్లతో సైబర్ మోసాలు

- ఫ్రాడ్ చేస్తున్న ఒకరి అరెస్ట్

**హైదరాబాద్, మే21 (జనంసాక్షి) :** సైబర్ క్రైమ్ పోలీస్, ఎస్ఓటీ, సైబరాబాద్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో సైబర్ మోసాలకు మ్యూల్ బ్యాంక్ అకౌంట్లు సరఫరా చేస్తున్న ఒక నిందితుడిని అరెస్ట్ చేశారు. నిందితుడు, అతని సహచరులు ట్రేడింగ్ ఫ్రాడ్, డిజిటల్ అరెస్ట్, ఆన్‌లైన్ గేమింగ్, స్టాకింగ్, పార్ట్‌టైమ్ జాబ్ ఫ్రాడ్స్, ఇతర ఆన్‌లైన్ ఆర్థిక మోసాలలో ఈ మ్యూల్ అకౌంట్లను ఉపయోగించి అమాయక ప్రజల నుండి భారీ మొత్తంలో డబ్బును మోసపూరితంగా సేకరించినట్లు విచారణలో బయటపడింది. ఈ అకౌంట్లు ట్రేడింగ్ ఫ్రాడ్, డిజిటల్ అరెస్ట్, గేమింగ్, పార్ట్‌టైమ్ జాబ్ ఫ్రాడ్స్ వంటి సైబర్ నేరాలకు ఉపయోగిస్తారని తెలిసినా, సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో నిందితుడు అంగీకరించాడు. తరువాత తనకు చెందినవి మరియు ఇతరుల బ్యాంక్ అకౌంట్లను సేకరించి, ఎటిఎం కార్డులు, క్రెడిట్కార్డులు, పాస్‌బుక్స్, చెక్‌బుక్స్ మరియు ఇతర బ్యాంకింగ్ పత్రాలను సైబర్ నేరగాళ్లకు కమిషన్ కోసం అందజేశాడు. విచారణలో కొంతమంది సంబంధిత బ్యాంక్ ఉద్యోగులు నిందితులతో కుమ్మక్కై అకౌంట్లు తెరవడం మరియు వాటిని సైబర్ మోసాలకు సరఫరా చేయడంలో సహకరించినట్లు ప్రాథమికంగా వెలుగులోకి వచ్చింది. ఈ కోణంలో మరింత దర్యాప్తు కొనసాగుతోంది. సైబర్ నేరగాళ్లు ప్రస్తుతం 'మ్యూల్ అకౌంట్లు' ద్వారా మోసపూరితంగా సంపాదించిన డబ్బును ట్రాన్స్‌ఫర్ చేయడం, విత్‌డ్రా చేయడం మరియు మనీలాండరింగ్‌కు ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా డిజిటల్ అరెస్ట్, ట్రేడింగ్ ఫ్రాడ్, ఫేక్ ఇన్వెస్ట్మెంట్, గేమింగ్ యాప్స్, లోన్ యాప్స్, జాబ్ ఫ్రాడ్స్ వంటి కేసుల్లో ఈ అకౌంట్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి.

# రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా క్రీడా దినోత్సవం



**హైదరాబాద్, మే21 (జనంసాక్షి) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 'స్పోర్ట్స్ అండ్ యూత్ వారోత్సవాలు' కార్యక్రమాల్లో భాగంగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా 'క్రీడా దినోత్సవం'ను అత్యంత ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలోని 32 జిల్లా కేంద్రాల్లో జిల్లా కలెక్టర్లు మరియు అధికార యంత్రాంగం పర్యవేక్షణలో జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో వివిధ క్రీడా పోటీలు విజయవంతంగా జరిగాయి. రాష్ట్ర స్థాయి ప్రధాన ఉత్సవాలు హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడగా, యువత, క్రీడాకారులు, తల్లిదండ్రులు మరియు ప్రజల నుండి విశేష స్పందన లభించింది. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జంట నగరాల్లోని గచ్చిబౌలి జీఎంసీబీ స్టేడియం, కేవీబీఆర్ ఇండోర్ స్టేడియం, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, జింఖానా గ్రౌండ్స్, సైక్లింగ్ వెలోడ్రోమ్ తదితర క్రీడా వేదికల్లో ఇంటర్ స్టేడియా కాంపిటీషన్స్ నిర్వహించబడ్డాయి. పోటీల్లో అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, ఫెన్సింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, టెన్నిస్, ఫుట్‌బాల్, చెస్, హ్యాండ్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, రెజ్లింగ్ తదితర క్రీడాంశాల్లో క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏ. సోనీ బాలాదేవి ఈ పోటీలను స్వయంగా పర్యవేక్షించారు. ఆమె వివిధ క్రీడా విభాగాల్లో పాల్గొంటున్న క్రీడాకారులను కలుసుకుని ఉత్సాహ పరిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న స్పోర్ట్స్ అండ్ యూత్ వారోత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగు తున్నాయని తెలిపారు. యువతతో పాటు క్రీడాకారులు, తల్లిదండ్రులు, సమాజంలోని వివిధ వర్గాల ప్రజల నుండి ఈ కార్యక్రమాలకు విశేష ఆదరణ లభిస్తోందన్నారు. సమాజంలోని అన్ని వర్గాల వారు, అన్ని వయస్సుల వారు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకునేలా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ కృషి చేస్తోందని ఆమె పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన క్రీడల్లో పాల్గొనే అవకాశాలను కల్పించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు రవితేజ, సుజాత, శ్రీనివాస్, స్టేడియం అడ్మినిస్ట్రేటర్లు రవికుమార్, రాజ్‌వీర్, నందకిషోర్, కన్నం మధు, పీఆర్‌వో కాలేరు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలుపై ఆందోళన వద్దు

- మంత్రి శ్రీధర్ బాబు



**కాళేశ్వరం, మే 22 (జనం సాక్షి) :** ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావొద్దని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. గురువారం ధాన్యం కొనుగోలుపై మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి ప్రతి గింజను కొనుగోలు చేయడానికి కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. రైతులు ఎలాంటి అపోహలు, ఆందోళనలు పెట్టుకోవద్దని, ప్రభుత్వం పూర్తిస్థాయిలో వారి పక్షాన నిలుస్తుందని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, సకాలంలో జరుగుతుందని మంత్రి తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు ప్రభుత్వం చేస్తున్నదని ఆయన వివరించారు. రైతుల సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని, రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టంచేశారు.

# పుష్కర పనుల్లో అధికారుల నిర్లక్ష్యం బహిర్గతం


- సాధారణ ఘాట్ వద్ద కుప్పకూలిన టెంట్..
- జాతీయ రహదారిపై ప్రమాదకరంగా మారిన స్వాగత తోరణం.
- సరస్వతి ఘాట్ వద్ద కూలిన స్వాగత ద్వారం రోడ్డుపై పడిపోవడంతో కలకలం



**కాళేశ్వరం, మే 22 (జనం సాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతీ నది అంత్య పుష్కరాల ఏర్పాట్లలో అధికారుల నిర్లక్ష్యం ఒక్కొక్కటిగా వెలుగు చూస్తుంది. కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన పనుల్లో పర్యవేక్షణ లేకపోవడం, నాణ్యత లోపం స్పష్టంగా కనిపిస్తోంది. భక్తుల సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన నిర్మాణాలే ఇప్పుడు ప్రమాదాలకు కారణమవుతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణ ఘాట్ వద్ద భక్తుల కోసం ఏర్పాటు చేసిన భారీ టెంట్ అకస్మాత్తుగా కుప్పకూలింది. అదృష్టవశాత్తూ ఘటన జరిగిన సమయంలో టెంట్ కింద భక్తులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే ఈ ఘటనతో అక్కడికి వచ్చిన భక్తులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. టెంట్ ఏర్పాటు పనుల్లో నాణ్యత పాటించకపోవడం, సరైన బిగింపులు లేకపోవడమే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన స్వాగత తోరణం కూడా ప్రమాదకరంగా మారింది. నామమాత్రంగా ఏర్పాటు చేసిన స్వాగతతోరణం స్వల్ప గాలికే అటూ ఇటూ ఊగిసలాడుతోంది. ఏ క్షణమైనా కూలిపోయే పరిస్థితులు ఉండటంతో వాహనదారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వాహన రాకపోకలు జరిగే ప్రాంతంలో ఇలాంటి నిర్లక్ష్య ఏర్పాట్లు చేయడం అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని ప్రజలు మండిపడుతున్నారు. అలాగే సరస్వతి ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన స్వాగత తోరణం ఒక్కసారిగా కుప్పకూలి రోడ్డుపై పడిపోవడం కలకలం రేపింది. ఘటన సమయంలో రహదారిపై భారీ రద్దీ లేకపోవడంతో ప్రమాదం తప్పినప్పటికీ, భక్తులు మరియు స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

# సంక్షేమ నిధి నుంచి జర్నలిస్టులకు ఆర్థిక సాయం

- 21 మందికి మంజూరు చేసినట్లు వెల్లడి



**హైదరాబాద్, మే21 (జనంసాక్షి) :** జర్నలిస్టుల సంక్షేమ నిధి నుంచి 21 మందికి ఆర్థిక సహాయం మంజూరు చేసినట్లు తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గురువారంనాడు నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమి కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో జర్నలిస్టుల సంక్షేమ నిధి కమిటీ 5వ సమావేశం చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఆర్థిక సహాయం కోసం వచ్చిన 29 దరఖాస్తులను కమిటీ సభ్యులు పరిశీలించి 17 మంది మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు, తీవ్ర ప్రమాదాలకు గురైన, దీర్ఘకాలికంగా అనారోగ్యం బారిన పడిన నలుగురు జర్నలిస్టులకు కూడా కమిటీ ఆర్థిక సహాయం మంజూరు చేసింది. కమిటీ సమావేశంలో ఎంపికైన 17 మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ఒక లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సాయం, అలాగే ఆయా కుటుంబాలకు ప్రతి నెల మూడు వేల రూపాయల చొప్పున పెన్షన్ ఐదు సంవత్సరాల పాటు అందజేస్తామని ఆయన తెలిపారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలలో ఎల్.కే.జి నుండి పదవ తరగతి వరకు చదువుతున్న ఇద్దరు పిల్లలకు ఒక్కొక్కరికి నెలకు ఒక వెయ్యి రూపాయల చొప్పున ట్యూషన్ ఫీజును మంజూరు చేస్తున్నట్లు ఆయన వివరించారు. నలుగురు అనారోగ్యం బారిన పడిన వర్కింగ్ జర్నలిస్టులకు జర్నలిస్టుల సంక్షేమ నిధి నుంచి ఆర్థిక సహాయం మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. కమిటీ సమావేశంలో సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ డి.ఎస్. జగన్, మీడియా అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు, అకౌంట్స్ ఆఫీసర్ పూర్ణ చందర్ రావు, మేనేజర్ డి.ఆర్.ఎస్. శైలెశ్వర్

## దుబ్బపల్లి నిర్వాసితులకు ఊరట

- రూ.145 కోట్లు జమ చేసిన టీజీజెన్కో

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** టీజీజెన్కో ప్రాజెక్టు కోసం దుబ్బపల్లి గ్రామ భూసేకరణ, పునరావాస ప్యాకేజీ కింద టీజీజెన్కో ఇప్పటివరకు మొత్తం రూ.145 కోట్లు రెవెన్యూ అధికారుల వద్ద జమ చేసింది. దుబ్బపల్లి గ్రామ భూసేకరణ కోసం టీజీజెన్కో చెల్లించిన రూ.77 కోట్లను భూపాలపల్లి ఆర్డీఓ, ల్యాండ్ అక్విజిషన్ ఆఫీసర్ అవార్డులు జారీ చేసి, ప్రభావితమైన 247 కుటుంబాలకు 2023 సంవత్సరంలో పరిహారాన్ని పూర్తిగా పంపిణీ చేశారు. పునరావాస, పునర్నిర్మాణ (ఆర్ అండ్ ఆర్) ప్యాకేజీ కోసం టీజీజెన్కో ఈ నెల 7న కలెక్టర్ కార్యాలయంలో రూ.68 కోట్లు జమ చేసింది. దీంతో భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి సంబంధించి టీజీజెన్కో చెల్లించాల్సిన మొత్తం రూ.145 కోట్లు రెవెన్యూ శాఖ వద్ద జమ అయినట్లు అధికారులు తెలిపారు. నిర్వాసిత కుటుంబాలకు త్వరలోనే ఆర్ అండ్ ఆర్ పరిహారం అందజేసేందుకు చర్యలు చేపడతామని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
22 మే 2026

సంపాదకీయం

# దేశంలో "కొత్త" భ్రమలు!!

దేశంలో నిరాశ పరిపక్వమవుతున్న వేళ ప్రత్యామ్నాయ రాజకీయాల మాట వినిపిస్తే చాలు.. ఆశతో పరుగెత్తే స్వభావం భారత యువతకు పుష్కలంగా ఉంది. అదే సమయంలో మోసపోయిన చరిత్ర కూడా పుష్కలంగా ఉంది. కాబట్టి ఏ కొత్త పార్టీ వచ్చినా, ఏ కొత్త ముఖం కనిపించినా ముందుగా ఆవేశం కాదు, అంచనా అవసరం.

*సాంప్రదాయ పార్టీలపై ప్రజలకు విసుగు సహజమైనది, సమంజసమైనది కూడా. అవినీతి, వంశపారంపర్య రాజకీయాలు, వేదికలపై వేషాలు వేయడం, ఇవన్నీ ప్రజలను తీవ్రమైన రాజకీయ అసహ్యానికి నెట్టాయి. కానీ ఆ విసుగు మరింత ప్రమాదకరమైనవైపు మళ్ళకుండా చూసుకోవడం కూడా అంతే అవసరం. ఎందుకంటే నేడు భారతదేశంలో కేవలం పాలకపక్షాల వైఫల్యమే కాదు, రాజ్యాంగ స్ఫూర్తి మీదనే నేరుగా దాడి జరుగుతున్న సందర్భం ఇది.*

భారత రాజ్యాంగ ప్రవేశిక ఒక పవిత్రమైన ప్రతిజ్ఞ. సార్వభౌమత్వం, సామ్యవాదం, లౌకికవాదం, ప్రజాస్వామ్యం, ఈ నాలుగు స్తంభాల మీద నిర్మించిన గణతంత్రం ఇది. కానీ నేడు లౌకికవాదం అనే పదమే అపహాస్యానికి గురవుతున్నది. మతం పేరిట ప్రజలను రెండు వర్గాలుగా చీల్చడం రాజకీయ వ్యూహంగా మారింది. మెజారిటీ సెంటిమెంటును రెచ్చగొట్టి, మైనారిటీలను శత్రువులుగా చిత్రించి, ఆ విద్వేష వేడిమిలో ఓట్లు కాల్చుకోవడం, ఇది ఒక్క పార్టీ చేస్తున్న పని కాదు, వ్యవస్థగా స్థిరపడిన ప్రక్రియ. ఈ చీకటిలో కొత్త పార్టీ వెలుతురు తీసుకొస్తుందా, లేక అదే చీకటికి మరో పేరు పెడుతుందా అన్నది నిఘాగా గమనించాలి.

పద్దెనిమిదవ శతాబ్దంలో రూసో చెప్పిన సాధారణ సంకల్పం, జనరల్ విల్ నేటికీ ఏ ప్రజాస్వామ్యానికైనా ప్రాణాధారం. పాలన అనేది మెజారిటీ సమూహపు కోరికలకు బానిసగా ఉండకూడదు. పౌరులందరి సమష్టి శ్రేయస్సుకు సేవకంగా ఉండాలని ఆయన స్పష్టంగా చెప్పాడు. కానీ నేడు పరిస్థితి మరోలా ఉంది. ఆరోగ్యం, విద్య, ఉపాధి, నీరు, రోడ్లు ఈ సర్వజనీన అవసరాలు నేపథ్యంలోకి నెట్టబడుతున్నాయి. వాటి స్థానంలో దేవాలయాలు, చారిత్రక పేర్ల మార్పులు, మతపరమైన ఉద్రేకాలు ముందుకొస్తున్నాయి. ఇది మధ్యయుగాల రాజకీయ తర్కం, జనాన్ని ఆహారం కోసం ఆలోచించనీయకుండా ఆవేశంలో ముంచెత్తడం.

మెజారిటీ ప్రజలను నిజంగా గౌరవించే పాలన అంటే వారి మతాన్ని రాజకీయ ఆయుధంగా వాడుకోవడం కాదు, వారి పిల్లలకు చదువు కల్పించడం, వారి పొలాలకు నీళ్ళు తేవడం, వారి ఆసుపత్రులను బతికించడం. ఈ బాధ్యత నుండి తప్పించుకోవడానికే మతం ముసుగు ఉపయోగపడుతోంది. మైనారిటీలను భయపెట్టడం ద్వారా మెజారిటీలను మేల్కొల్పుతున్నట్టు నటించడం, ఇది రాజనీతి కాదు, మానసిక మోసం. ఈ మోసాన్ని గుర్తించే నేత్రాలు లేకపోతే, కొత్త పార్టీ కూడా అదే మోసాన్ని వేరే యాస్‌లో చదువుతుంది.

అన్నా హజారే ఉద్యమం ఈ దేశానికి ఒక చేదు పాఠం నేర్పింది. జన్ లోక్ పాల్ అనే సెంటిమెంటును కూడగట్టి, మన్మోహన్ సింగ్ సర్కారుపై అపఖ్యాతి పేర్చి, దేశం మొత్తాన్ని ఒక ఎమోషనల్ సుడిగుండంలోకి నెట్టిన తర్వాత, అసలు లబ్ధిదారులు మాత్రం వేరే వేదిక నుంచి అధికారంలోకి వచ్చారు. హజారే పక్క సందులోంచి మాయమయ్యారు. లోక్ పాల్ మాటే లేకుండా పోయింది. అవినీతి అదేచోట చిరునవ్వుతో కూర్చుంది. రైతు ఉద్యమ సమయంలో మళ్ళీ నిద్రలేచి, వెంటనే వెనక్కి తగ్గిన ఆయన ప్రవర్తన, నైతిక నాయకత్వం చివరకు ఏ శక్తికి జవాబుదారీగా ఉంటుందో చెప్పకనే చెప్పింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఉద్భవిస్తున్న కొత్త రాజకీయ వేదికలను అంచనా వేయాల్సిన తీరు మారాలి. దేశ సార్వభౌమత్వంపై ఆ పార్టీ వైఖరి ఏమిటి? రాజ్యాంగ ప్రవేశికలో పొందుపర్చిన లౌకికవాదాన్ని అది నిలబెడుతుందా? మతాన్ని రాజకీయ సాధనంగా వాడుకోవడాన్ని స్పష్టంగా తిరస్కరిస్తుందా? నిధుల వనరులు ఎక్కడివి? కార్పొరేట్ ప్రయోజనాలు కొత్త ముఖాలను అద్దెకు తీసుకున్నాయా? ఈ ప్రశ్నలు అడగడం దేశద్రోహం కాదు, పరిణత ప్రజాస్వామ్య బాధ్యత.

ప్రత్యామ్నాయం నిజంగా అవసరమే, కానీ ప్రత్యామ్నాయం పేరిట వచ్చే ప్రతిదీ ప్రత్యామ్నాయం కాదు. కొన్నిసార్లు అది అదే మతవిద్వేష రాజకీయాలకు కొత్త సువాసన పూసిన అవతారం మాత్రమే. దేశాన్ని హిందువులు–ముస్లింలుగా చీల్చి చదరంగం ఆడే రాజకీయాలకు ముగింపు పలికే నిజాయితీ ఆ పార్టీకి ఉందా అని పరీక్షించే బాధ్యత ఓటరుదే. యువత పూర్తి అంజన కళ్ళకు అద్దుకున్న తర్వాతే ముందడుగు వేయాలి. పరిగెత్తే ముందు దారి తెలిసుండాలి. గమ్యం కనిపించాలి. వెనుక నిలిచిన శక్తులు అర్థమయి ఉండాలి. అప్పుడు మాత్రమే ఆ అడుగు చరిత్రలో నిలుస్తుంది. లేదంటే మరో పాదముద్ర మాత్రమే అవుతుంది, మరో తప్పిదానికి సాక్ష్యంగా..!

# "స్వదేశీ మాటల్లో - విలాసం చేతల్లో.. మోదీ మోడల్"

నరేంద్ర మోదీ దేశ ప్రజలకు నిరాడంబర జీవితం, పొదుపు, స్వదేశీ ఉత్పత్తుల వాడకం పై పాఠాలు చెబుతూ వస్తున్నారు. కానీ వారి స్వంత జీవితం లగ్జరీ, ఆడంబరం, విదేశీ వస్తువులతో నిండి ఉందని విమర్శలు ఎప్పటి నుంచో వినిపిస్తున్నాయి. ఈ వ్యత్యాసం కేవలం రాజకీయ విమర్శ కాదు. ఒక నాయకుడి బహిరంగ చిత్రం మరియు వ్యక్తిగత వాస్తవాల మధ్య ఉన్న అసంబద్ధతలను పరిశీలించడం.

మోదీ తన బాల్యాన్ని సాధారణ చాయ్ విక్రేత కుటుంబం నుంచి వచ్చినట్లు చిత్రీకరిస్తారు. వద్నగర్‌లో తండ్రి టీ స్టాల్ వద్ద సహాయం చేశారని చెప్పేది నిజమే. కానీ రైల్వే స్టేషన్‌లో తాను చాయ్ అమ్మినట్లు చెప్పిన కథలు అతిశయోక్తి అని కుటుంబ సభ్యులు, ముఖ్యంగా సోదరుడు ప్రహ్లాద్ మోదీ వ్యాఖ్యలు సూచిస్తాయి. తండ్రి టీ వ్యాపారం చేస్తే కుటుంబం సహాయం చేసింది కానీ మోదీ ప్రధానంగా చాయ్ విక్రేత కాదని వారు చెప్పారు. ఇలాంటి కథలు రాజకీయ ఇమేజ్ కు సహాయపడతాయి కానీ వాస్తవాలను వక్రీకరిస్తాయి.



మోదీ విద్యా పరమైన డిగ్రీల విషయంలో కూడా సందేహాలు అనేకం ఉన్నాయి. ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ, గుజరాత్ విశ్వవిద్యాలయం నుంచి పీజీ చేసినట్లు తన అఫిడవిట్‌లో చెప్పినా, డాక్యుమెంట్లు, మార్కులు, తేదీల్లో అసంబద్ధతలు ఉన్నాయని విమర్శకులు ఆరోపించారు. విశ్వవిద్యాలయాలు కొంత సమాచారం ఇచ్చినా పూర్తి పారదర్శకత లేకపోవడం సందేహాలను పెంచింది. ఒక నాయకుడు తన విద్యా నేపథ్యాన్ని కూడా స్పష్టంగా చెప్పలేకపోతే, ప్రజలు ఇతర విషయాల్లో ఎలా నమ్ముతారు?

మోదీ తనను సన్యాసి, బ్రహ్మచారి జీవితం గడిపిన వ్యక్తిగా చిత్రీకరిస్తారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘంలో ప్రచారక్‌గా ఉన్నప్పుడు అలాంటి జీవనం సాధ్యమైందని చెప్పవచ్చు. కానీ 1968లో 18 ఏళ్ల వయసులో యశోదాబెన్‌ను వివాహం చేసుకున్నారు. కొన్ని నెలలు మాత్రమే కలిసి ఉన్నారని యశోదాబెన్ స్వయంగా చెప్పారు. వారు విడివిడిగా జీవిస్తున్నారు. యశోదాబెన్ ఉపాధ్యాయురాలిగా పని చేసి రిటైర్ అయ్యారు. ఆమె మోదీని గౌరవిస్తున్నా, వారి వివాహ జీవితం గురించి ప్రశ్నలు ఉంటాయి. సన్యాస జీవితం అనేది ఎంతవరకు వాస్తవం అనేది వ్యక్తిగతం కానీ రాజకీయ ఇమేజ్‌లో దీనిని ఎక్కువగా ఉపయోగించుకోవడం విమర్శనీయం.

కుటుంబం గురించి కూడా మోదీ దూరం పాటిస్తారు. సోదరులు సోమభాయ్, ప్రహ్లాద్, అమృత్, పంకజ్‌లు సాధారణ జీవితాలు గడుపుతున్నారు. కొందరు మోదీ కుటుంబానికి ప్రత్యేక సౌకర్యాలు లేవని చెప్పినా, ఒక ప్రధాన మంత్రి కుటుంబాన్ని దూరం పెట్టడం అసాధారణం కాదు కానీ "నాకు అవినీతికి కుటుంబం లేదు" అనే వాదనను హైలైట్ చేయడం రాజకీయ లాభం కోసమే.

ప్రధాన మంత్రి పదవిలో మోదీ జీవితం లగ్జరీతో నిండిందని విమర్శకులు చెబుతారు. కొత్త ప్రధాన మంత్రి నివాస భవనం భారీగా, ఆడంబరంగా నిర్మించబడింది. సెంట్రల్ విస్టా ప్రాజెక్ట్ లో భాగంగా నిర్మించిన ఈ కొత్త నివాసం సుమారు 467 కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మాణం జరిగిందని నివేదికలు చెబుతున్నాయి. ఇది సుమారు 36 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటుంది. భారీ బేస్‌మెంట్ పార్కింగ్, అధునాతన సౌకర్యాలు ఇందులో ఉన్నాయని వార్తలు. ఇప్పటికే ఉన్న ప్రధాన మంత్రి నివాసం పునరుద్ధరణకు కూడా ఎనభై తొమ్మిది కోట్ల రూపాయలు ఖర్చు చేశారని ఆరోపణలు. ఇలాంటి భారీ ఖర్చులు కోవిడ్ మహమ్మారి సమయంలో కూడా జరగడం ప్రజల మధ్య అసంతృప్తి కలిగించింది. అధికారిక సౌకర్యాలు ప్రధాన మంత్రికి అవసరమే కానీ వాటిని సాధారణ ప్రజలతో పోల్చి "నేను సాదా జీవితం" అని చెప్పడం అసంగతం.

కాన్వాయ్‌లు, సెక్యూరిటీ, విదేశీ పర్యటనలు వందల సంఖ్యలో, ఖరీదైన సూట్లు, మొంట్‌బ్లాంక్ పెన్నులు, బల్గారి కళ్లజోడు, స్విస్ వాచ్‌లు వాడకం విమర్శలకు దారి తీస్తాయి. ఒకసారి ధరించిన ఖరీదైన మోనోగ్రామ్ సూట్ వివాదాస్పదమైంది. దాని ధర సుమారు పది లక్షల రూపాయలు అని చెప్పబడింది. తర్వాత ఆ సూట్ వేలంలో కోట్ల రూపాయలకు అమ్ముడు పోయిందని వార్తలు. ఇటాలియన్ బల్గారి కళ్లజోడు, జర్మన్ మొంట్‌బ్లాంక్ పెన్ను, స్విస్ మొవాడో వాచ్ వంటి విదేశీ బ్రాండ్లను ఉపయోగించడం విమర్శలను ఆకర్షించింది. స్వదేశీ ప్రచారం చేస్తూ విదేశీ బ్రాండ్లు వాడడం హైపోక్రసీ అని ఆరోపణలు.

ప్రజలు పొదుపు చేయాలని, విదేశీ వస్తువులు మానాలని చెప్పేవారు తమ జీవితంలో ఆడంబరం ప్రదర్శిస్తే ఎలా? గుజరాత్ ముఖ్యమంత్రిగా, ప్రధాన మంత్రిగా విదేశీ సందర్శనలు, ఖర్చులపై కూడా విమర్శలు వచ్చాయి. డాక్టర్ సుబ్రహ్మణ్య స్వామి వంటి నాయకులు కూడా మోదీపై విమర్శలు చేశారు. మోదీ జీవిత చరిత్రలు, ఆత్మకథలు కూడా ఎంతవరకు నిజం అనేది ప్రశ్నార్థకం. మీడియా ద్వారా సృష్టించిన ఇమేజ్ ఒకటి, వాస్తవాలు మరొకలా ఉన్నాయి.

మోదీ పాలనలో అభివృద్ధి, నిర్ణయాలు ఉన్నాయి. కానీ వ్యక్తిగత స్థాయిలో హైపోక్రసీ ఆరోపణలు బలంగా ఉన్నాయి. ప్రజలు నాయకులను నమ్మాలంటే మాటలు అలాగే వారి చర్యల మధ్య అంతరం తగ్గాలి. ఇండియా యొక్క భవిష్యత్ కోసం ఈ అంతరాలను అధిగమించడం అవసరం. నాయకులు ప్రజలకు ఉదాహరణగా ఉండాలి. స్వదేశీని ప్రోత్సహించేవారు తమ రోజువారీ జీవితంలో కూడా దానిని అనుసరించాలి. లేకపోతే ప్రజలలో నమ్మకం కోల్పోతారు.

ఈ అంతరాలు రాజకీయాల్లో మాత్రమే కాకుండా సమాజంలో కూడా ప్రతిబింబిస్తాయి. ప్రజలు తమ నాయకులను ప్రశ్నించాలి. వారి మాటలనూ, చర్యలనూ పరిశీలించాలి. నిజమైన నాయకత్వం ఇమేజ్‌లో కాదు, చర్యలలో ఉంటుంది. మోదీ విషయంలో ఈ విమర్శలు ఒక హెచ్చరికగా చూడాలి. భారతదేశం లాంటి పెద్ద దేశానికి నాయకుల మాటల్లో, చేతల్లో నీతి,నిజాయితీ, సత్యం, స్థిరత్వం, ఏకత్వం కలిగి ఉండాలి. అప్పుడే ప్రజలు "విశ్వ గురువు" గా గౌరవిస్తారు.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# కాక్‌రోచ్ జనతా పార్టీ!

భారత రాజకీయాల్లో కొత్త పార్టీలు పుట్టడం కొత్త విషయం కాదు. ఎన్నికల సీజన్ దగ్గరపడితే కొత్త జెండాలు, కొత్త నినాదాలు, కొత్త గుర్తులు, కొత్త ఆశలు కూడా పుడుతుంటాయి. కానీ కొన్నిసార్లు ఒక పేరు... ఒక ప్రతీక... ఒక వ్యంగ్యం సమాజంలోని లోతైన అసంతృప్తిని అద్దంలా ప్రతిబింబిస్తుంది. అలాంటి ఆలోచనల్లో తాజాగా వినిపిస్తున్న 'బొద్దింక జనతా పార్టీ' అనే ప్రతీకాత్మక భావన కేవలం నవ్వు తెప్పించే పదబంధం మాత్రమే కాదు; నేటి భారత రాజకీయాలపై ప్రజల్లో పెరుగుతున్న విసుగు, వ్యంగ్యం, నమ్మక సంక్షోభానికి ఒక స్పష్టమైన సంకేతం.

బొద్దింక... మనిషి జీవితంలో అసౌకర్యానికి చిహ్నం. ఎంత శుభ్రం చేసినా మళ్లీ కనిపిస్తుంది. ఎన్ని సార్లు తరిమినా తిరిగి వస్తుంది. చీకట్లో ఎక్కువగా సంచరిస్తుంది. ప్రమాదం వస్తే వెంటనే దాక్కుంటుంది. పరిస్థితులకు అనుగుణంగా బతకడంలో దానికి అపూర్వమైన సామర్థ్యం ఉంది. ఇవన్నీ ప్రకృతి లక్షణాలే కావచ్చు. కానీ ఇవే లక్షణాలు నేటి రాజకీయాల్లో కొంతమంది నాయకుల ప్రవర్తనకు అచ్చం సరిపోతున్నాయంటే అతిశయోక్తి కాదు.

ఒకసారి ఓడిపోయినా మరో పార్టీ కండువా కప్పుకొని మళ్లీ ప్రజల ముందుకు వచ్చే నాయకులు... అవినీతి ఆరోపణలతో కొంతకాలం అదృశ్యమై, ఎన్నికల వేళ శుభ్రమైన ముఖచిత్రంతో తిరిగి ప్రత్యక్షమయ్యే రాజకీయ సంస్కృతి... ప్రజా సమస్యలపై నిశ్శబ్దంగా ఉండి, ఓట్ల సమయంలో మాత్రమే చురుకుగా మారే వ్యవస్థ... ఇవన్నీ ప్రజల కళ్ల ముందే జరుగుతున్నాయి. అందుకే "బొద్దింక జనతా పార్టీ" అనే ఆలోచన వ్యంగ్యమైనా, వాస్తవానికి దగ్గరగా అనిపిస్తోంది.

ప్రజాస్వామ్యంలో ఓటరు ఆశతో ఓటేస్తాడు. మార్పు కోసం నాయకుడిని ఎన్నుకుంటాడు. కానీ ప్రతి ఎన్నిక తర్వాత కూడా అదే సమస్యలు, అదే అవినీతి, అదే మాటలు, అదే మోసాలు ఎదురైతే... ఆ ఆశ క్రమంగా విసుగుగా మారుతుంది. ఆ విసుగు చివరకు వ్యంగ్యంగా బయటపడుతుంది. "ఎవరొచ్చినా మారేది ఏముంది?" అన్న ప్రశ్న నేటి యువతలో, మధ్యతరగతిలో, సామాన్య ఓటరులో బలంగా వినిపిస్తోంది. అదే భావన ఒకరోజు "మీరందరూ ఒకటే అయితే, మేం కూడా మీ కోసం బొద్దింక పార్టీ పెడతాం!" అనే నిరసనాత్మక హాస్యంగా రూపాంతరం చెందవచ్చు.

భారత రాజకీయాల్లో గుర్తులకు, పేర్లకు ఉన్న భావోద్వేగ విలువ అపారమైనది. కమలం, చేయి, సైకిల్, గాజు గ్లాస్, కారు... ఇవన్నీ కేవలం గుర్తులు కాదు; కోట్లాది మంది భావోద్వేగాల ప్రతీకలు. అలాంటి దేశంలో "బొద్దింక" కూడా ఒక ప్రతీకగా మారే అవకాశం ఉందని ఊహించడం అసాధ్యం కాదు. ఎందుకంటే "ఎంత కొట్టినా చావదు" అనే జీవనశక్తి, "ఎక్కడైనా బ్రతుకుతుంది" అనే సాధారణుడి పోరాటం, "చీకట్లోనూ నిలబడుతుంది" అనే అణగారిన వర్గాల మనుగడ– ఇవన్నీ ఒక కొత్త రాజకీయ కథనానికి మార్గం చూపవచ్చు. కానీ ఈ వ్యంగ్యాన్ని కేవలం నవ్వుతో తీసేయడం ప్రమాదకరం. ఎందుకంటే ఇది ప్రజాస్వామ్య ఆరోగ్యంపై ఒక హెచ్చరిక. ప్రజలు రాజకీయాలను గౌరవంతో కాకుండా వ్యంగ్యంతో చూడడం ప్రారంభిస్తే, అది నాయకత్వ వైఫల్యానికి నిదర్శనం. నాయకులు ప్రజల బాధలను వినకుండా, కేవలం అధికార సమీకరణలతో కాలక్షేపం చేస్తే... పార్టీలు సిద్ధాంతాల కంటే అవకాశవాదంతో నడిస్తే... ప్రజలు చివరకు వ్యవస్థనే ఎగతాళి చేయడం మొదలుపెడతారు.

సోషల్ మీడియా యుగంలో వ్యంగ్యం ఒక శక్తి. మీమ్‌గా మొదలైన భావన ఉద్యమంగా మారిన ఉదాహరణలు ప్రపంచవ్యాప్తంగా ఉన్నాయి. యువత ముఖ్యంగా రాజకీయాలను సంప్రదాయ పద్ధతుల్లో కాకుండా, విమర్శాత్మక హాస్యంతో పరిశీలిస్తోంది. "బొద్దింక జనతా పార్టీ" వంటి పేర్లు వైరల్ కావడం వెనుక ఉన్న భావోద్వేగం– 'మాకు నమ్మకం తగ్గుతోంది' అనే సామూహిక సందేశం. ఇది రాజకీయ నాయకులు గమనించాల్సిన సమయం. ప్రజలు ఇక వాగ్దానాలతో సంతృప్తి చెందడం లేదు. వారికి మార్పు కావాలి. మాటల్లో కాదు, వ్యవహారంలో. వ్యక్తుల్లో కాదు, వ్యవస్థలో. కొత్త పార్టీలు రావడం కాదు, కొత్త రాజకీయ సంస్కృతి రావాలని కోరుకుంటున్నారు. అసలు ప్రశ్న ఇదే– రాజకీయాలు నిజంగానే బొద్దింకల్లా మారిపోయాయా?

తరిమినా తిరిగి వస్తున్నాయా?

శుభ్రం చేసినా అవినీతి మళ్లీ పుడుతోందా?

ప్రజాస్వామ్యం వెలుగులో కాకుండా చీకట్లో నడుస్తోందా?

ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సింది ప్రజలు కాదు. నాయకులే. ఎందుకంటే ప్రజలు ఇప్పటికే తమ తీర్పును వ్యంగ్యంగా చెప్పడం ప్రారంభించారు.


"బొద్దింక జనతా పార్టీ" నిజంగా వస్తుందో లేదో తెలియదు. కానీ అది ఒక ఆలోచనగా, ఒక వ్యంగ్యంగా, ఒక హెచ్చరికగా మన ముందుంది. దాన్ని నవ్వేసి పక్కన పెట్టడం సులువు. కానీ దాని వెనుక దాగి ఉన్న ప్రజల అసంతృప్తిని అర్థం చేసుకోవడం రాజకీయ నాయకుల బాధ్యత.

ప్రజాస్వామ్యం బలపడాలంటే కొత్త జెండాలు కాదు, కొత్త విలువలు రావాలి. ప్రజల విశ్వాసాన్ని తిరిగి గెలుచుకోవాలి. రాజకీయాల్లో పారదర్శకత, జవాబుదారీతనం, నైతికత పునరుద్ధరించాలి. లేకపోతే రేపు ఓటరు నిజంగానే బొద్దింకను గుర్తుగా చూసి ఓటేయవచ్చు. అప్పుడు అది ఒక పార్టీ విజయం కాదు. ప్రస్తుత రాజకీయ వ్యవస్థ వైఫల్యానికి ప్రజలు వేసిన తుదిముద్ర అవుతుంది.

బొడ్డు రజనీకాంత్
వేములవాడ

# బలవంతుడిదే రాజ్యమా? చట్టం ఏం చేస్తోంది?

సూర్యాస్తమయ వేళ ఆకాశం సింధూర వర్ణంలో మారుతుంది. ఆ రంగు చూస్తే కొందరికి ప్రకృతి అందించిన అద్భుత సౌందర్యం కనిపిస్తుంది. మరికొందరికి హింసతో చిందే రక్తం గుర్తొస్తుంది. ఈ రెండు దృష్టుల మధ్య, ఈ రెండు భిన్న భావజాలాల మధ్య ఉన్న అగాధమే నేడు ఆధునిక భారతదేశాన్ని నిలువునా చీలుస్తోంది. సంధ్య సింధూరం అనేది కేవలం ఒక సినిమా పేరు కాదు అది సమకాలీన సమాజం ముందు నిలిచిన ఒక తాత్వికమైన ప్రశ్న. అత్యంత జటిలమైన మానవీయ సంక్షోభం. న్యాయం కోసం పోరాటం ఎక్కడ ప్రారంభమవుతుంది? వ్యవస్థను మార్చడానికి హింస ఎక్కడ అవసరమనిపిస్తుంది? అదే హింస నియంత్రణ కోల్పోయి, చివరకు సమాజాన్ని ఒక నిర్జీవమైన శవంగా ఎక్కడ మారుస్తుంది? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతకడమే నేటి తరం ముందున్న అతిపెద్ద సవాలు.భారత సమాజంలో అన్యాయం అనేది కేవలం పుస్తకాల్లో చదువుకునే అమూర్తమైన భావన కాదు. అది ఇక్కడి కోట్లాది మంది సామాన్యులకు ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ఎదురయ్యే రోజువారీ పచ్చి నిజం. ఒక దళిత విద్యార్థి అన్ని అర్హతలూ, ప్రతిభ ఉన్నా కేవలం తన పుట్టుక వల్లే ఉన్నత విద్యా సంస్థల్లో చేరిక నిరాకరించబడినప్పుడు లేదా వివక్షకు గురైనప్పుడు; ఒక రైతు ఆకాశం వైపు చూసి అలసిపోయి, అప్పుల ఊబిలో కూరుకుపోయి చివరకు చెట్టుకు ఉరివేసుకున్నప్పుడు; ఒక సామాన్య మహిళ తనపై జరిగిన అఘాయిత్యానికి న్యాయం కోసం పోలీసు స్టేషన్ నుండి కోర్టు మెట్ల వరకు సంవత్సరాల తరబడి తిరిగి, చివరకు సమాజం ముందు అవమానపడినప్పుడు ఆ బాధ అనుభవించేవారికే తెలుస్తుంది. ఆ ఆక్రోశం, ఆ కడుపుమంట అత్యంత సహజమైనవి. కానీ ఇక్కడే మనం అసలు సమస్యను గమనించాలి. ఈ నిజమైన గాయాల మీద, ఈ నిస్సహాయుల ఆవేదన మీద పనిచేస్తున్న శక్తులు ఎవరు? ఆ గాయాలను నయం చేసి, సమాజంలో ధర్మాన్ని నిలబెట్టే వారా? లేక ఆ బాధను, కన్నీళ్లను తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ఒక శక్తివంతమైన ఆయుధంగా మార్చుకునే వారా? ఈ ప్రశ్న చుట్టూనే నేటి వ్యవస్థ తిరుగుతోంది. ఈ ప్రశ్నకు మనం ఇచ్చే నిజాయితీ గల సమాధానమే రేపటి భారత భవిష్యత్తును, మన ప్రజాస్వామ్య మనుగడను నిర్ణయిస్తుంది. హింస లేకుండా ఏ విప్లవమూ సంభవించదు, ఏ పాత వ్యవస్థా కూలిపోదు అని చరిత్రను ఉటంకిస్తూ కొందరు మేధావులు, విప్లవకారులు గట్టిగా వాదిస్తారు. ఇది చారిత్రకంగా పాక్షికంగా నిజమే కావచ్చు. మానవ చరిత్రను మలుపు తిప్పిన ఫ్రెంచ్ విప్లవం భీకరమైన హింసతోనే జన్మించింది. రష్యాలో శ్రామిక రాజ్యాన్ని తెచ్చిన అక్టోబర్ విప్లవం రక్తాక్షరాలతోనే రాయబడింది. కానీ చరిత్ర మనకు నేర్పిన మరో చేదు నిజం ఏమిటంటే అదే హింస ఆ తర్వాత వ్యవస్థీకృతమై మరింత క్రూరంగా మారుతుంది. ఫ్రాన్స్‌లో విప్లవానికి నాయకత్వం వహించిన రోబ్స్పియర్ చివరకు తనే గిలెటిన్‌కు బలయ్యాడు. రష్యాలో సమానత్వం కోసం పోరాడిన దేశంలో స్టాలిన్ కాల నాటి క్రూరమైన గులాగ్‌లు (జైళ్లు) పుట్టుకొచ్చాయి. విప్లవకారులే చివరకు విప్లవ బాధితులుగా మారిన చరిత్ర ప్రపంచవ్యాప్తంగా పదేపదే పునరావృతమవుతూనే ఉంది. భారతదేశంలో ఈనాడు హింస రకరకాల పేర్లు మార్చుకుని సమాజంలోకి చొరబడుతోంది. మతపరమైన హింస, కుల హింస, రాజకీయ హింస, ప్రాంతీయ హింస, మరియు సైద్ధాంతిక హింస ఇలా దేనికదే కొత్త ముసుగు వేసుకుంటున్నాయి. ఇక్కడ విచిత్రం ఏమిటంటే, ప్రతి హింసకూ వెనుక ఒక బలమైన సిద్ధాంతం ఉంది. ప్రతి రక్తపాతానికీ ఒక నైతిక సమర్థన సిద్ధంగా ఉంటుంది. మేం సమాజ శ్రేయస్సు కోసం, న్యాయం కోసమే పోరాడుతున్నాం అని ప్రతి వర్గమూ, ప్రతి సాయుధ సమూహమూ చెప్పుకుంటుంది. కానీ లౌకిక ప్రపంచంలో ఆ హింసాత్మక యుద్ధాల వల్ల నష్టపోయే అసలైన బాధితులు ఎవరు? ఏ సిద్ధాంతాలతోనూ సంబంధం లేని,



ఎదురుతిరిగి సమాధానం చెప్పే నోరు లేని నిరుపేదవాడు, రెక్కాడితే గానీ డొక్కాడని అమాయకపు పౌరుడు, ఆ సిద్ధాంతాల యుద్ధంలో ఏ భాగమూ లేని సామాన్యుడే చివరకు ఆ బలిపీఠంపై నిలబడుతున్నాడు.నేటి భారతీయ యువత రెండు అత్యంత బలమైన, వ్యతిరేక వత్తిళ్ళ మధ్య నలిగిపోతోంది. ఒక వైపు దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు, విద్యా వ్యవస్థలోని లోపాలు, మరియు తమ భవిష్యత్తుపై ఉన్న నైరాశ్యం వారిని వేధిస్తున్నాయి. మరో వైపు డిజిటల్ యుగంలో, ముఖ్యంగా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో 24 గంటలూ అత్యంత వేగంగా వ్యాపించే ఆగ్రహ రాజకీయాలు, మన వర్గానికి, మన మతానికి ద్రోహం జరుగుతోంది అనే నిరంతర ప్రతికూల నేరేటివ్‌లు వారిని చుట్టుముడుతున్నాయి. ఈ రెండూ కలిసినప్పుడు ఒక ప్రమాదకరమైన విస్ఫోటక మిశ్రమం తయారవుతుంది. సంధ్య సింధూరం భావజాలం లోతుగా అర్థమయ్యేది ఇక్కడే. శాంతిని, వెలుగును పంచాల్సిన వయసులో సంహారానికి సైతం సిద్ధపడే యువత, తమలోని న్యాయమైన సామాజిక ఆగ్రహాన్ని తప్పుడు మార్గాల్లో వ్యక్తపరిచే తరం మనకు కనిపిస్తోంది. ఈ కుళ్ళిపోయిన వ్యవస్థ మొత్తం నాశనం కావాలి, అప్పుడే కొత్తది పుడుతుంది అని నమ్మే యువతను చూసినప్పుడు ఒకటే ఆందోళన కలుగుతుంది వీరు దేశ భవిష్యత్తును వికసింపజేసే కొత్త పుష్పాలా లేక ఉన్నదంతా కాల్చి బూడిద చేసే అగ్గిలా మారుతున్న తరామా? యువతలో అన్యాయంపై ఆగ్రహం ఉండటం సహజం, అది స్వాగతించదగ్గదే. కానీ ఆ ఉద్వేగభరిత ఆగ్రహాన్ని దేశ నిర్మాణానికి ఉపయోగపడే సృజనాత్మక శక్తిగా మార్చాలా, లేక విధ్వంసానికి దారితీసే ఆయుధంగా మార్చుకోవాలా అనే ఎంపికే ఒక దేశ తలరాతను, ఆ తరం భవిష్యత్తును నిర్ణయిస్తుంది.ప్రజలను, వారి హక్కులను కాపాడాల్సిన రాజ్యాంగబద్ధ వ్యవస్థలు పోలీసులు, న్యాయవ్యవస్థ, రాజకీయ నాయకత్వం, మరియు సమాజానికి అద్దం పట్టాల్సిన మీడియా ఇవి గనుక తమ ప్రాథమిక విధులను విస్మరించి పరస్పరం కత్తులు దూసుకుంటే ఏం జరుగుతుంది? ప్రజాస్వామ్యం నడిబొడ్డున నిలబడి సామాన్య జనం దిక్కుతోచక ఒంటరిగా మిగిలిపోతారు. దురదృష్టవశాత్తూ ఈ దేశంలో నేడు అదే పరిస్థితి కనిపిస్తోంది. ఇక్కడ పార్టీలకు పార్టీలే పరమ శత్రువులు. వ్యవస్థలకు వ్యవస్థలే ప్రత్యర్థులుగా మారుతున్నాయి. ఒక అత్యున్నత న్యాయస్థానం ఏదైనా తీర్పు ఇస్తే, దానికి తటస్థంగా గౌరవం ఇవ్వడం మానేసి, అది రాజకీయ ప్రేరేపిత తీర్పు అని ఒక వర్గం ఆరోపిస్తుంది. పోలీసులు శాంతిభద్రతల కోసం ఏదైనా చర్య తీసుకుంటే, అది నిరంకుశత్వం, వివక్ష అని మరో వర్గం నినాదాలు చేస్తుంది. ఈ అపనమ్మక వాతావరణంలో, నిజమైన బాధితుడు సకాలంలో న్యాయం పొందటం దాదాపు అసాధ్యమవుతోంది. ఎందుకంటే మొత్తం వ్యవస్థాత్మక నిర్మాణం ఒక రాజకీయ యుద్ధ భూమిగా మారిపోయింది. ఇక్కడ బాధితుని యొక్క నొప్పి లేదా అతనికి జరిగిన అన్యాయం ముఖ్యం కావడం లేదు ఆ బాధితుని యొక్క సామాజిక గుర్తింపు మాత్రమే ముఖ్యం అవుతోంది. అతడు ఏ కులానికి చెందినవాడు? ఏ మతానికి ప్రతినిధి? ఏ రాజకీయ పార్టీకి మద్దతుదారుడు? ఈ పక్షపాత ప్రశ్నలే న్యాయం కంటే ముందు వచ్చి నిలబడుతున్నాయి. దీనివల్ల న్యాయం యొక్క పవిత్రత నశిస్తోంది.మనం ఒక ఆరోగ్యకరమైన సమాజంలో జీవించాలంటే చట్టం, న్యాయం, మరియు విప్లవం అనే ఈ మూడింటి మధ్య ఉన్న సూక్ష్మమైన తేడాలను, వాటి సరిహద్దులను స్పష్టంగా అర్థం చేసుకోవాలి.చట్టం ఇది మానవులు తమ సామాజిక మనుగడ కోసం రాసుకున్న నియమావళి. మనుషులు రాశారు కాబట్టి ఇది ఎల్లప్పుడూ పరిపూర్ణంగా ఉండకపోవచ్చు. కొన్ని చట్టాలు కాలదోషం పట్టి అన్యాయంగా మారవచ్చు. చట్టం కొన్నిసార్లు తక్షణ న్యాయాన్ని అమలు పరచడంలో విఫలం కావచ్చు. కానీ చట్టం యొక్క కనీస రక్షణ లేకుండా ఏ ఆధునిక సమాజమూ నిమిషం పాటు కూడా మనుగడ సాగించలేదు. అది లేకపోతే అడవి చట్టమే రాజ్యం చేస్తుంది.న్యాయం ఇది ఒక ఉన్నతమైన నైతిక భావన. దీన్ని ఒకే రకమైన చట్రంలో ఎవరూ పూర్తిగా నిర్వచించలేరు. ఒకరికి న్యాయంగా కనిపించేది, మరొకరికి తీవ్రమైన అన్యాయంగా అనిపించవచ్చు. అందుకే మానవ సమాజాలు ప్రజాస్వామ్య ప్రక్రియలను, రాజ్యాంగాలను ఏర్పరచుకున్నాయి. నిరంతర సంభాషణ ద్వారా, పరస్పర చర్చల ద్వారా అందరికీ ఆమోదయోగ్యమైన ఒక సమతుల్యాన్ని వెతకడమే ప్రజాస్వామ్యం యొక్క అసలు ఉద్దేశం.విప్లవం విప్లవం అనేది ఈ సుదీర్ఘ ప్రజాస్వామ్య ప్రక్రియను పూర్తిగా నిరాకరిస్తుంది. ప్రస్తుత వ్యవస్థ మొత్తం కుళ్ళిపోయింది, కాబట్టి సంస్కరణలు పనికిరావు, దీన్ని పూర్తిగా పడగొట్టాల్సిందే అని ప్రకటిస్తుంది. చరిత్రలో కొన్ని అరుదైన సందర్భాల్లో ఇది అవసరమై ఉండవచ్చు సమాజం పూర్తిగా నిరంకుశత్వంలోకి వెళ్ళినప్పుడు, శాంతియుత మార్గాలన్నీ పూర్తిగా మూసుకుపోయినప్పుడు. కానీ ఆ తీవ్రమైన సందర్భం ఎప్పుడు వచ్చిందో నిర్ణయించే అధికారం ఎవరికీ ఉంటుంది? ఒకరి వ్యక్తిగత ఆవేశం సమాజ విప్లవం కాగలదా? ఆ తప్పుడు నిర్ణయాలు ఎంతటి మానవ వినాశనానికి దారితీస్తాయో చరిత్ర మనకు పదేపదే హెచ్చరిస్తూనే ఉంది.భారతదేశంలో మెజారిటీ ప్రజలు ఎల్లప్పుడూ మౌనంగా ఉంటారని, దేశంలో ఇంత జరుగుతున్నా స్పందించరని మేధావులు తరచూ విమర్శిస్తూ ఉంటారు. కానీ కోట్లాది మంది సామాన్యుల ఈ సుదీర్ఘ మౌనాన్ని మనం ఎలా అర్థం చేసుకోవాలి? అది కేవలం వ్యవస్థ పట్ల ఉన్న భయమా? లేక సమాజం పట్ల ఉన్న నిర్లిప్తతా? లేక ఉదయం నుండి రాత్రి వరకు చేసే నిరంతర జీవన పోరాటంలో మునిగిపోయి, రాజకీయాలు పట్టించుకోలేని అసమర్థతా?నిజానికి, ఆ సామాన్యుడి మౌనం వెనుక ఒక రకమైన లోతైన జీవిత జ్ఞానం ఉంది. ప్రతిరోజూ కష్టపడి పొట్ట నింపుకోవడమే ఒక మహా సంగ్రామమైన సగటు మనిషికి, టీవీ స్టూడియోల్లోనో, సోషల్ మీడియా వేదికల పైనో ఏ భావజాలం సరైనది, ఏ సిద్ధాంతం గొప్పది అని అర్ధరాత్రి వరకు వాదించే తీరిక, ఓపిక ఉండవు. అతడు మౌనంగా ఉండటం అతని బలహీనత కాదు అది అతని మనుగడకు ఉన్న ఏకైక మార్గం, అత్యవసర వ్యూహం. కానీ దురదృష్టవశాత్తు, ఈ అమాయక ప్రజల మౌనమే నేడు స్వార్థ రాజకీయ నేతలకు, తీవ్రవాద శక్తులకు ఒక అనుకూలమైన ఆయుధంగా మారుతోంది. ధర్మం, చట్టం, ప్రజా బాధ్యత ఈ మూడూ సమాజ ప్రగతికి మూలస్తంభాలు. మనకు ఎంత అన్యాయం జరిగినా తిరిగి అన్యాయం చేయకుండా, క్రోధాన్ని జయించే అత్యంత కష్టమైన ధైర్యమే ధర్మం. అలాగే, చట్టం మనకు నచ్చనప్పుడూ, అనుకూలంగా లేనప్పుడూ కూడా దాన్ని గౌరవించడమే చట్టబద్ధత,ఎందుకంటే చట్టం లేని సమాజంలో బలవంతుడే రాజ్యాంగం అవుతాడు, బలహీనుడు మరింత అణచివేతకు గురవుతాడు. వీటన్నిటితో పాటు, కేవలం ఐదేళ్లకు ఒకసారి ఓటు వేయడమే కాకుండా, నిత్య జీవితంలో జరిగే అన్యాయాన్ని శాంతియుతంగా ప్రశ్నిస్తూ ద్వేషాన్ని నిరోధించడమే నిజమైన ప్రజా బాధ్యత. ఈ మూడు సూత్రాలు కలిసి నడిచినప్పుడే సమాజంలో నిజమైన శాంతి వర్ధిల్లుతుంది. ఈ మూడూ కలిసి నడిచినప్పుడే సమాజంలో శాంతి, ప్రగతి జీవిస్తాయి. ఈ మూడింటిలో ఏ ఒక్క లింకు తెగినా, శాంతి అనేది కేవలం శ్మశాన వైరాగ్యంగా, ఒక శవంగా మారుతుంది.సంధ్య వేళ సింధూర వర్ణం తర్వాత నిబిడాశ్చర్యకరమైన చీకటి రాత్రి వస్తుంది. ఆ రాత్రి చీకటిలో మన దేశం శాశ్వతంగా జారిపోతోందా? ఖచ్చితంగా లేదు. ఎందుకంటే ఆ గాఢాంధకారంలో కూడా దేశవ్యాప్తంగా లక్షలాది చిన్న చిన్న దీపాలు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. అన్ని ఒత్తిళ్లకు లొంగకుండా రాజ్యాంగ నైతికతను పట్టుకుని నిలబడిన నిజాయితీ గల న్యాయమూర్తులు, ప్రాణాలకు తెగించి కలంతో నిజాలను రాసే పాత్రికేయులు, క్షేత్రస్థాయిలో అన్యాయానికి ఎదురు నిలిచే సామాన్య పౌరులు వీరందరూ ఆ ఆశాదీపాలు.కానీ ఈ దీపాలు ఆరిపోకుండా, గాలి వానకు కొండెక్కిపోకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రతి భారతీయుని పైనా ఉంది. ఆవేశంలో హింస మార్గాన్ని ఎంచుకోవడం అంటే మన చేతులతో మనమే ఆ వెలుగు దీపాన్ని ఆర్పివేయడమే అవుతుంది దానివల్ల చీకటి మరింత గాఢమవుతుంది తప్ప సమస్య పరిష్కారం కాదు. న్యాయం కోసం పోరాడాలి అది ప్రతి పౌరుడి హక్కు మరియు బాధ్యత. కానీ ఆ పోరాట క్రమంలో, ఆ క్రోధంలో మనమే మరో అన్యాయకారులుగా, హింసకులుగా మారిపోకుండా మనల్ని మనం నియంత్రించుకోవడమే నిజమైన మానవీయ ధైర్యం.చివరగా, రేపు సాయంత్రం మీరు ఆకాశంలో సంధ్య సింధూరం చూసినప్పుడు మీ కళ్లకు ఏం కనిపిస్తుంది ప్రకృతి అందించిన అద్భుత సౌందర్యమా లేక వినాశనాన్ని సూచించే రక్తమా? ఆ ఎంపికలోనే మీ అంతర్గత స్వభావం దాగి ఉంది. అందులోనే మీ దేశ భవిష్యత్తు ఉంది. అందులోనే మన అందరి రేపటి వెలుగు ఉంది.

డా .సూర్యదేవర రామకృష్ణ,
9490754169

# టాడి మ్యూజికల్ ఫెస్టివల్ వెంటనే నిలిపివేయాలి

- గీతా వృత్తి జోలికి వస్తే సహించబోం
- బాలగౌని బాలరాజ్ గౌడ్

**ముషీరాబాద్, మే 21 (జనం సాక్షి) :** టాడి మ్యూజికల్ ఫెస్టివల్ పేరుతో గీతా వృత్తిపై కుట్రలు జరుగుతున్నాయని తెలంగాణ గౌడ్ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటి చైర్మన్ బాలగౌని బాలరాజ్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే టాడి మ్యూజికల్ ఫెస్టివల్లు నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కల్లుగీత సంఘాల సమన్వయ కమిటి ఆధ్వర్యంలో సమన్వయ కమిటి కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బాలరాజ్ గౌడ్ మాట్లాడుతూ... కల్లుగీత వృత్తిపై కార్పొరేట్ శక్తులు కన్ను వేశాయని గీతా వృత్తిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గీతా వృత్తి పైన తరతరాలుగా కుట్రలు జరుగుతూనే ఉన్నాయని అన్నారు. కబాడ్గార్ వృత్తిని కబ్జా చేయాలని చూస్తే సహించేది లేదన్నారు.



కొంతమంది ముఖ్యమంత్రిని పక్కదోవ పట్టిస్తున్నారని అన్నారు. గౌడ కులానికి సంబంధించిన మంత్రులు, ఎంపిలు ఎమ్మెల్యేలు తదితర ప్రజాప్రతినిధులు స్పందించి గౌడ వృత్తిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అయిలి వెంకన్న గౌడ్ మాట్లాడుతూ... అనేక సంవత్సరాలుగా వృత్తిపరమైన దాడులు జరుగుతున్నాయని అన్నారు. గౌడ కుల వృత్తిని ధ్వంసం చేయాలని చూస్తే సహించేది లేదని అన్నారు. తెలంగాణ వచ్చి పన్నెండేళ్లు దాటిన సమాజిక తెలంగాణ రాలేదన్నారు. గౌడ ఐక్య సాధన సమితి అధ్యక్షులు అంబాల నారాయణ గౌడ్ మాట్లాడుతూ... మా కుల వృత్తిలో వేలు పెడితే తరమికొడతామన్నారు. టాడి మ్యూజికల్ ఫెస్టివల్ను అడ్డుకుంటామని హెచ్చరించారు. గీతా వృత్తిదారులకు దక్కాల్సిన ప్రయోజనం దక్కడం లేదన్నారు. జై గౌడ అధ్యక్షులు వట్టికూటి రామరావు గౌడ్ మాట్లాడుతూ... గౌడ అస్థిత్వానికి ప్రమాదం వస్తే పార్టీలకతీతంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సమన్వయకమిటి నాయకులు ఎస్. దుర్గయ్య గౌడ్, గడ్డమీది విజయకుమార్ గౌడ్, ముద్దగోని రాంమోహన్ గౌడ్, బైరు శేఖర్, ఆనంద్ గౌడ్, జంగంరావు గౌడ్, సత్యం గౌడ్, రేవతి గౌడ్, దేశగాని సాంబశివగౌడ్, ఐలన్ గౌడ్, బొమ్మగాని నాగభూషణం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులను ఇబ్బందికి గురిచేస్తే ఉద్యమిస్తాం



**వీపనగండ్ల, మే 22 (జనం సాక్షి) :** వీపనగండ్ల మండల కేంద్రంలోని గోదామును సిపిఎం నేతలు గురువారం సందర్శించారు. గోదాంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై రైతులతో మాట్లాడి ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, గ్రేడ్-1 వడ్లను మాత్రమే కొనుగోలు చేయాలని సివిల్ సప్లై అధికారులు ఆదేశించడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నామని తెలిపారు. రైతుల సమస్యపై స్పందించిన సిపిఎం నాయకులు మాట్లాడుతూ రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వరి ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బంది చేస్తే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. పెబ్బేరు, కొత్తకోట, చిన్నంబావి, పానగల్ తదితర ప్రాంతాల నుంచి వరి ధాన్యం లారీలను వీపనగండ్ల గోదాంలో నిల్వ ఉంచేందుకు తీసుకురావడంతో స్థానిక రైతులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇతర మండలాల నుంచి వచ్చిన లారీలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, మొదటి ప్రాధాన్యత వీపనగండ్ల రైతుల ధాన్యానికే ఇవ్వాలని పై అధికారులను కోరారు. అదేవిధంగా తరుగు, గ్రేడ్ పేరుతో రైతుల ధాన్యంలో ఎలాంటి కోతలు విధించకుండా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ప్రకారం వెంటనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు ఆశన్న, ఆది రామకృష్ణ, నవీన్, రైతులు నాగన్న, మద్దిలేటి, గోవిందు, ఈశ్వర్, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

## యాప్రాల్ చెరువు కట్ట వద్ద గంజాయి ముఠా గుట్టురట్టు

- ఐదుగురు నిందితుల అరెస్టు..
- ఇద్దరు పరారీ
- 2.5 కిలోల గంజాయి, 7 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



**ఆల్వాల్, మే 21 (జనంసాక్షి) :** యాప్రాల్ చెరువు కట్ట పరిసర ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న గంజాయి రవాణా, విక్రయాల ముఠా ఆటను ఆల్వాల్ అబ్కారీ పోలీసులు కట్టడి చేశారు. విశ్వసనీయ సమాచారంతో బుధవారం సాయంత్రం నిర్వహించిన మెరుపు దాడుల్లో ఐదుగురు నిందితులను అరెస్టు చేయగా, మరో ఇద్దరు పరారయ్యారు. వారి నుంచి 2.5 కిలోల ఎండు గంజాయి, 7 ద్విచక్ర వాహనాలు, 5 మొబైల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నారు. మల్కాజిగిరి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి నవీన్ కుమార్ ఆదేశాల మేరకు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ముకుంద రెడ్డి పర్యవేక్షణలో ఆల్వాల్ అబ్కారీ బృందం యాప్రాల్ చెరువు కట్ట వద్ద తనిఖీలు చేపట్టింది. ఈ దాడుల్లో మాదకద్రవ్యాల నిరోధక చట్టం కింద గంజాయి విక్రయిస్తున్న భోనాకల్లూరి గణేష్ (19, బాలాజినగర్), బల్లెపూళ్ల తరుణ్ (25, బాలాజినగర్), భిశ్వకర్మ విష్ణుకుమార్ (25, కాప్రా), పుప్పాల చంద్రకాంత్ (22, వరంగల్ జిల్లా మేకలగట్టు), సత్యరాం అరవింద్ (18, మెదక్ జిల్లా మొగదుంపల్లె)లను పోలీసులు పట్టుకున్నారు. కొత్తూరు విశాల్ (22, బాలాజినగర్), ఆనంద్ (బాలాజినగర్)లు పరారయ్యారు. వీరి కోసం పోలీసులు గాలిస్తున్నారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న వాహనాల్లో మూడు విద్యుత్ వాహనాలు, ఒక బైక్, మూడు స్కూటర్లు ఉన్నాయి. పట్టుబడిన ఐదుగురిని న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టి, రిమాండ్‌కు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో ఆల్వాల్ అబ్కారీ ఇన్‌స్పెక్టర్లు జి. చంద్రశేఖర్, ఎస్. కుమారస్వామి, సబ్ ఇన్‌స్పెక్టర్ సంధ్యారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటర్ జాబితా సవరణను పారదర్శకంగా నిర్వహించాలి



**సంగారెడ్డి ప్రతినిధి, మే 21 (జనం సాక్షి) :** జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు. ఎలాంటి తప్పులు లేని, అత్యంత పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పనే జిల్లా యంత్రాంగం, రాజకీయ పార్టీల ప్రధాన లక్ష్యంగా ఉండాలని ఆయన అన్నారు. గురువారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ కార్యక్రమంపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఓటర్ జాబితా సవరణకు సంబంధించిన వివిధ దశలను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఓటర్ల జాబితాను పరిశీలించడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని రాజకీయ పార్టీలు తక్షణమే అన్ని నియోజకవర్గాలలో బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం ద్వారా ప్రజాస్వామ్య బలోపేతంలో భాగస్వాములు కావాలని, అధికారులు మరియు రాజకీయ పార్టీల ప్రతినిధులు నిరంతరం సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. అలాగే ఎస్ఐఆర్ కార్యక్రమానికి సంబంధించిన వివిధ దశల షెడ్యూల్ వివరాలను సమావేశంలో వివరించారు. ఈ సమావేశంలో సంగారెడ్డి తహసిల్దార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగపు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఉద్యమకారుని గుర్తించి న్యాయం చేసేందుకే కేకే కమిటీ

**ముషీరాబాద్, మే 21 (జనం సాక్షి) :** తెలంగాణ తెలంగాణ తొలి మలిదశ ఉద్యమంలో రాష్ట్ర సాధన కోసం కీలక భూమి పోషించిన తెలంగాణ ఉద్యమకారులకు గత బిఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని, ఉద్యమకారుల ద్రోహి టిఆర్ఎస్ అధినేత మాజీ సీఎం కెసిఆర్ అని పలువురు ఉద్యమకారులు మండిపడ్డారు. ఈ మేరకు గురువారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేకే కమిటీతో తెలంగాణ ఉద్యమకారుల సమన్వయ కమిటీ రౌండ్ టేబుల్ సమావేశం ఉద్యమ నాయకుడు ప్రకాష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ ఉద్యమకారుల కేకే కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి, మలిదశ ఉద్యమకారులు కాచం సత్యనారాయణ గుప్త, పలు ఉద్యమకారులు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా తొలి మలిదశ ఉద్యమకారుడు కాచం సత్యనారాయణ గుప్తా మాట్లాడుతూ ఉద్యమకారులకు కేసిఆర్ కొంత మేరకు న్యాయం



చేసే దిశగా ప్రయత్నించారని అనడంతో ఒక్కసారిగా కెసిఆర్ హయంలోనే తెలంగాణ ఉద్యమకారులకు తీవ్ర అగ్రహావేశాలకు లోనయ్యారు. కెసిఆర్ ప్రభుత్వ హయాంలో ఉద్యమకారులను ఏనాడు పట్టించుకోలేదని, అంతేకాకుండా పలు కేసులు కూడా పెట్టించారని, ఉద్యమకారులు, కొమరయ్య, సాజిద సికిందర్‌తో పాటు పలువురు ఉద్యమకారులు వాగ్వాదానికి దిగడంతో రౌండ్ టేబుల్ సమావేశం రసాభాసగా మారింది. అనంతరం కేకే కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ మాట్లాడుతూ ఉద్యమకారులకు కేసీఆర్ చేసింది ద్రోహమేనని, ఉద్యమకారులు ఆవేశాలకు పోకుండా సంయమనం పాటించి సీఎం రేవంత్ రెడ్డి సూచన మేరకు ఉద్యమకారులకు న్యాయం జరిగే విధంగా ప్రతి జిల్లాకు పర్యటించి తమ తమ అభిప్రాయాలు అభిప్రాయాలను సేకరించి సమాచారంతో పూర్తి సమాచారంతో ఎలాంటి పక్షపాత వైఖరి లేకుండా నివేదిక అందజేస్తామన్నారు. మరో కేకే కమిటీ సభ్యులు మోతే శోభన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమంలో పాల్గొని పోరాటం చేసిన ప్రతి ఉద్యమకారుని గుర్తించి న్యాయం చేసేందుకే కేకే కమిటీని వేశారని అన్నారు. ఈ కమిటీ ద్వారా నిజమైన ఉద్యమకారులను గుర్తించి న్యాయం జరిగే విధంగా కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో తొలి మలిదశ ఉద్యమకారులు పి భరత్ రెడ్డి, నరసింహా, రాజు గౌడ్, గౌరీ గణేష్, మోత్కూరి మల్లేష్, బి మధు తదితరులు పాల్గొన్నారు.

## వివోఏ సమస్యలు పరిష్కరించాలి



**నవాబుపేట్, మే 21 (జనం సాక్షి) :** ఉద్యోగ భద్రత కల్పిస్తూ తమ సమస్యలు పరిష్కరించాలని నవాబుపేట్ మండల వివోఏలు డిమాండ్ చేశారు. గురువారం ఐకెపి కార్యాలయం ముందు నిరాస న దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పని భారం తగ్గిస్తూ గౌరవ వేతనం 26 వేల వరకు పెంచాలన్నారు బీమా సౌకర్యం కల్పించాలని కోరినారు. వివో ఏ లకు ట్యాబ్ లు పంపిణీ చేయడంతో పాటు ఉచిత డేటా అందించాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో వివో లకు 30 నుండి 40 వరకు సంఘాల గ్రూపులు ఉన్నాయి. ఒక్కొక్క గ్రామాలలో 60 నుండి 80 గ్రూప్ల వరకు సమావేశాలు నిర్వహిస్తున్నామని అన్నారు. వివో ఏ లకు ప్రభుత్వం ఇచ్చే వేతనం 5000 రూపాయలు వివో ఎలా కథలు జమ చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రతి నెలలో డ్వాక్రా మహిళా సంఘాలకు మూడుసార్లు సమావేశానికి హాజరు కావలసిన అవసరం ఉందని వారికి ప్రభుత్వం ఇచ్చే ఐదు వేల రూపాయలు చార్జీలకి సరిపోతున్నాయని వారు తెలిపారు. అందుకు వెంటనే ప్రభుత్వం 25వేల రూపాయలు గౌరవ వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. డ్వాక్రా గ్రూపు సంఘాల ఖాతాలో వివో ఏ గౌరవ వేతనాన్ని వేయకుండా వారి వారి సొంత అకౌంట్లో వేయాలన్నారు ప్రతి గ్రామంలో డ్వాక్రా సంఘాలతో వారంలో రెండుసార్లు సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. వివో ఎలా ధర్నా 18వ తేదీ నుండి కొనసాగుతుందని మా సమస్యలు ప్రభుత్వం తీర్చే వరకు కొనసాగిస్తామని మండల అధ్యక్షురాలు హరిజన జయమ్మ, మండలం ప్రధాన కార్యదర్శి మేకల జగన్, మండల కోశాధికారి వేషాల రమాదేవి,అందుకు వీవో ఎలా సమస్యలు తీర్చాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే 5 గౌరవ వేతనాన్ని వెంటనే పెంచాలన్నారు జీతాలు పెంచే వరకు రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు నిర్వహిస్తామన్నారు. ఈ క్రమంలో మండలంలోని వివిధ గ్రామాల వివో ఏలు రమేష్, నాగరాణి విమల, లక్ష్మి,లావణ్య,స్వప్న,సుజాత,రోజా, మహేందర్, ఎల్లారెడ్డి, సుమలత, సుగుణ, కవిత రాజ్యలక్ష్మి, రాజు, వివిధ గ్రామాల వివో లు డ్వాక్రా సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు నిబద్ధతతో పనిచేయాలి

- గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.




**గద్వాల నడిగడ్డ, మే 21 (జనం సాక్షి) :** గ్రామ పంచాయతీల అభివృద్ధికి సంబంధిత అధికారులు నిబద్ధతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. చేయూత పథకంకు సంబంధించి గురువారం ఐడిఓసి సమావేశ మందిరంలో జిల్లాలోని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయితీ కార్యదర్శులు, వార్డ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామ పంచాయితీ కార్యదర్శులు తమ గ్రామాలకు సరిగ్గా వెళ్లకుండా ఫేక్ హాజరు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి మంగళవారం అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించాలని, ప్రతి శుక్రవారం ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తనిఖీ చేయాలని ఆదేశించినప్పటికీ సరిగ్గా అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో నిరక్షరాస్యులైన ప్రజలకు వివిధ సంక్షేమ పథకాలు వర్తించేందుకు పంచాయతీ కార్యదర్శులు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డిఆర్డిఓ ముషాహిదా బేగం, ఇతర అధికారులు, శిక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా స్పార్క్ డెంటల్ క్లినిక్ ప్రారంభం

- రాష్ట్ర కిక్‌బాక్సింగ్ విజేత హరిప్రియకు అభినందనలు

**ఉప్పల్, మే 21 (జనం సాక్షి) :** ఉప్పల్ నియోజకవర్గంలో ప్రజా సేవా కార్యక్రమాలు, యువత ప్రతిభకు ప్రోత్సాహం కల్పిస్తూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మరోసారి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఒకవైపు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆధునిక డెంటల్ క్లినిక్ ప్రారంభిస్తే, మరోవైపు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన యువ క్రీడాకారిణిని అభినందించి ప్రోత్సహించారు. ఉప్పల్‌లోని స్వరూప్ నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన "స్పార్క్ డెంటల్ క్లినిక్"ను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లినిక్ నిర్వాహకులు డాక్టర్ పి. ప్రీతి, డాక్టర్ జె. సౌజన్య ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలిపారు. క్లినిక్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండడం సమాజ



అభివృద్ధికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఉప్పల్ ప్రాంతంలో ఆధునిక సౌకర్యాలతో డెంటల్ క్లినిక్ ప్రారంభం కావడం సంతోషకరమని తెలిపారు. ఆరోగ్యంపై ప్రజలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, సమయానికి వైద్య సేవలు పొందడం ద్వారా అనేక సమస్యలను నివారించవచ్చని సూచించారు. అదే రోజున తెలంగాణ రాష్ట్ర కిక్‌బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ 2026-27లో అద్భుత ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం సాధించిన ఉప్పల్‌కు చెందిన తెలగవాపు హరిప్రియను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. రంగారెడ్డి జిల్లా కాటేదాన్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు ప్రాతినిధ్యం వహించిన హరిప్రియ 60 కేజీల విభాగంలో పాల్గొని మొదటి స్థానం సాధించడం గర్వకారణమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. చిన్న వయసులోనే రాష్ట్ర స్థాయిలో విజయం సాధించడం ప్రశంసనీయమని, భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో కూడా మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. యువత క్రీడల వైపు ముందుకు రావాలని, క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందించడం ద్వారా వారి ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఉప్పల్ ప్రాంతం నుంచి మరింత మంది యువత రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

# హామీలను విస్మరించి ఫార్మా సిటీ కోసం రైతులను వేధిస్తున్న ప్రభుత్వం

- ఫార్మా సిటీ వ్యతిరేక పోరాట సమితి సమన్వయకర్త కవుల సరస్వతి

**యాచారం, మే 21 (జనం సాక్షి) :** ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల హామీలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, ఫార్మా సిటీని రద్దు చేయకుండా రైతులను వేధిస్తోందని ఫార్మా సిటీ వ్యతిరేక పోరాట సమితి సమన్వయకర్త కవుల సరస్వతి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మేడిపల్లి గ్రామంలో కమిటీ ఆధ్వర్యంలో గ్రామ రైతులు, రైతు కూలీలతో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కవుల సరస్వతి, రైతులు మాట్లాడుతూ.. కోర్టు స్టే ఉన్న పట్టా భూముల్లో కూడా ప్రభుత్వం అక్రమంగా మెషిన్లు తెచ్చి చదును చేస్తోందని ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన రైతు కుంరెడ్డి యాదవ్ రెడ్డి భూమిని అధికారులు చదును చేస్తుండగా, రైతులందరూ ఒకతాటిపైకి వచ్చి పనులను అడ్డుకున్నట్లు తెలిపారు. కోర్టు స్టే ఉత్తర్వులు ఉన్నప్పటికీ అధికారులు తమను మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

### ఉపాధి కోల్పోతున్న రైతు కూలీలు

భూములు కోల్పోతే తమ బతుకులు రోడ్డున పడతాయని రైతు కూలీలు వాపోయారు. ఫార్మా సిటీ భూసేకరణ వల్ల ఇప్పటికే స్థానికంగా ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయని, పూర్తి స్థాయిలో భూములు లాక్కుంటే తమ గతి ఏంటని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సమావేశంలో పాల్గొన్న వందలాది మంది రైతులు, కూలీలు "ప్రభుత్వ చట్టవ్యతిరేక పనులు నశించాలి", "ఫార్మా జీవోను తక్షణమే రద్దు చేయాలి', "మా భూములు మాకు కావాలి" అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

### ఇంటికో రైతు కదలాలి..

ఫార్మా సిటీకి వ్యతిరేకంగా చేపట్టబోయే తదుపరి కార్యాచరణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కమిటీ పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా ప్రతి ఇంటి నుండి ఎంతమంది వీలైతే అంతమంది రైతులు పోరాటంలోకి రావాలని సమావేశంలో



ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఫార్మా సిటీ వ్యతిరేక కమిటీ సభ్యులు కల్లు కొండల్ రెడ్డి, పాండురంగచారి, అచ్చి రెడ్డి, కనేమోని గణేష్, గడ్డం కుమార్, ఆరెపల్లి లింగం, వెంకటేశం గౌడ్, బొగ్గుల పాపి రెడ్డి, మహిపాల్ రెడ్డి, గడ్డం రవీందర్, జోగు సత్తయ్య మరియు గ్రామ రైతులు, కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలి



**గద్వాల నడిగడ్డ, మే 21 (జనం సాక్షి) :** జిల్లా అధికార యంత్రాంగం గ్రామపంచాయతీల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తే వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పురస్కారాలను పొందవచ్చని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అందజేసే పంచాయతీ విత్ గుడ్ గవర్నెన్స్ అవార్డుకు జిల్లాలోని ఆరు గ్రామపంచాయతీలు నామినేట్ అయిన నేపథ్యంలో సంబంధిత అధికారులతో కలెక్టర్ గురువారం తన ఛాంబర్‌లో సమావేశమై మాట్లాడారు. గ్రామపంచాయతీలో జనన,మరణ,తదితర ఆన్లైన్ సర్వీసెస్, ఇతర పనితీరుకు సంబంధించి 100కు 90 మార్కులు సాధించిన గ్రామపంచాయతీలు ఈ పురస్కారానికి నామినేట్ కావడం జరిగిందన్నారు. ఇందులో మల్దకల్ మండలం కుర్తి రావులచెరువు, ఇటిక్యాల మండలం చాగాపురం, ఎర్రవల్లి మండలం పుటాన్ దొడ్డి, మానవపాడు మండలం బోరవెల్లి, గద్వాల మండలం వీరాపూర్, చెనుగోనుపల్లి గ్రామపంచాయతీలు ఉన్నాయన్నారు. నిర్దేశించిన పారామీటర్స్ లో మార్పులు,చేర్పులు ఉంటే చేసి ఈనెల 24వ తేదీలోగా రాష్ట్ర ప్రభుత్వానికి పంపాలన్నారు. ఎంపికైన గ్రామపంచాయతీకి కేంద్ర ప్రభుత్వం అక్టోబర్ లో అవార్డును అందజేయడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డిఆర్డిఓ ముషాహిదా బేగం, డిపిఓ శ్రీకాంత్, సంబంధిత మండలాల ఎంపీడీవోలు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

### నా భర్త పిడుగు పడి చనిపోయాడు...

## నా కుటుంబాన్ని ఆదుకోండి!

- రూ. 6 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సత్య శారద ప్రభుత్వానికి నివేదిక...





**చెన్నారావుపేట, మే 21 ( జనం సాక్షి):** నా భర్త పిడుగు పడి చనిపోయాడని నా కుటుంబాన్ని ఆదుకోవాలని వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని కాల్ నాయక్ తండా గ్రామానికి చెందిన బాధితురాలు, మృతుడి భార్య కొర్ర విజయ, కుమారులు వివేక్, విరాజ్ లు కోరుతున్నారు. ఇదే కాల్ నాయక్ తండ గ్రామానికి చెందిన కొర్ర నాగరాజు అక్టోబర్ 10వ తేదీన 2024వ సంవత్సరంలో పత్తి ఏరడానికి కూలి పనులకు వెళ్ళాడు. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం ఒక్క సారిగా కురియడంతో తిరిగి తోటి కూలీలతో ఇంటికి వస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు పిడుగు పడి కొర్ర నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. తన కుటుంబాన్ని ఆదుకోవాలని మృతుడి భార్య విజయ పోస్టుమార్టం నివేదిక, పోలీసు ఎఫ్ఐఆర్ ఆధారంగా జిల్లా కలెక్టర్ సత్య శారదను కలిసి తన కుటుంబాన్ని ఆదుకోవాలని వేడుకుంది. ఆమె అభ్యర్థన మేరకు జిల్లా కలెక్టర్ సత్య శారద 02 ఫిబ్రవరి 2025 వ రోజున జీవో ఎంఎస్ నెంబర్ 2 రెవెన్యూ డిఎం 19- 7- 2018 ప్రకారం డిసాస్టర్ మేనేజ్మెంట్ కింద పిడుగు పాటు మరణా నికి కారణమైన కొర్ర నాగరాజు కుటుంబానికి రూ. 6 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని రెవెన్యూ కమిషనర్ ప్రిన్సిపల్ సెక్రటరీ హైదరాబాద్ కు నివేదికను పంపించారు. కానీ అప్పటినుండి ఇప్పటివరకు ప్రభుత్వం చిల్లి గవ్వ కూడా చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేస్తుంది. భర్త చనిపోయినప్పటి నుండి ఇద్దరు కుమారులను కూలీ నాలి పనులు చేసుకుంటూ పెంచి పోషిస్తున్నానని ఎక్స్ గ్రేషియా కింద వచ్చే డబ్బులను ప్రభుత్వం వెంటనే అందించాలని జిల్లా కలెక్టర్, సంబంధిత రెవెన్యూ అధికారులు చొరవ చూపాలని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని బాధితురాలు కొర్ర విజయ, కుమారులు వివేక్, విరాజ్ లు వేడుకుంటున్నారు.

# ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ఎండలు

- బోసిపోతున్న రహదారులు
- చెట్ల కింద ఆగి సేద తీరుతున్న వాహనదారులు
- చల్లని పానీయాలు తాగేందుకు ఆరాటం
- జాగ్రత్తగా ఉండాలంటున్న ప్రభుత్వం






**వరంగల్ బ్యూరో, మే 21 (జనం సాక్షి) :** భగభగ మండే నిప్పుల కొలిమిలా మారింది ఓరుగల్లు నగరం. వేడి గాలుల తాకిడికి జనం అల్లాడిపో తున్నారు. ఉక్కిరి బిక్కిరి అవుతున్న పరిస్థితి. ఎండ వేడిని తట్టుకోలేక అయోమయానికి గురవుతున్న జనం బాధలు వర్ణనాతీతం. వేసవి తాపంతో ఇటు మనుషులే కాకుండా అటు పశువులు కూడా అల్లాడిపోతున్న పరిస్థితి కనిపిస్తుంది. 45 డిగ్రీలు దాటిపోయి ఎండలు కొడుతుండడంతో ఇంట్లో నుంచి బయటికి రావాలంటే భయపడుతున్న ప్రజలు. ఉదయం 8 గంటల నుండి ఎండ తీవ్రత పెరుగుతూ మధ్యాహ్నం వరకు తట్టుకోలేని విధంగా ఎండలు కొట్టడమే కాకుండా వేడిగాలులు వీస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. మధ్యాహ్నం వేళలో రహదారులపై జనసంచారం లేకపోవడంతో బోసిపోయి కనిపిస్తున్నాయి. సాయంత్రం 6 గంటల తర్వాతనే జనం బయటికి రావడం కనిపిస్తుంది. అత్యవసరమైతేనే తప్ప బయటకి రావద్దు అని ప్రభుత్వం వైద్య అధికారులు చెబుతున్నారు. ఇంట్లో ఉన్నా కూడా ఏసీలు గానీ కూలర్లు గాని ఆ ఎండ వేడిని మార్చి చల్లని గాలిని వీచే పరిస్థితి కూడా లేకుండా పోతుంది. వాహనదారులు తలకు రుమాలు గాని హెల్మెట్ గాని ధరించి వాహనాలపై వెళ్లడం కనిపించింది. మహిళలు పిల్లలు తమ చీర కొంగులతో తలకు చుట్టుకుని వెళ్లడం జరుగుతుంది. వాహనదారులు ఎండ తీవ్రతం తట్టుకునేందుకు మధ్య మధ్యలో ఉన్నటువంటి చెట్ల కింద కాసేపు ఆగి సేదతీరి చల్లని పానీయాలు అక్కడ ఉంటే తాగి వెళ్లడం కనిపిస్తుంది. ప్రధానంగా వేసవి తాపాన్ని తీర్చుకునేందుకు గ్రీన్ మ్యాట్ తో వేసినటు వంటి ప్రాంతాలలో ఆగి అక్కడ చల్లటి పానీయాలను తీసుకోవడం జరుగుతుంది. ఇక వివిధ కార్యాలయాలకు వెళ్లే ప్రభుత్వ ఉద్యోగులుగానీ ప్రైవేటు ఉద్యోగులు కానీ తగినంత జాగ్రత్తలు తీసుకోవడం కనిపిస్తుంది. కార్యాలయాల్లో ఏర్పాటు చేసినటువంటి మట్టి కుండలో ఉన్న నీళ్లను తాగడం జరుగుతుంది. కొబ్బరి బోండాలు, మజ్జిగ, నిమ్మరసం లాంటి ద్రవపదార్థాలను తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఏదైనా పని ఉంటే ఉదయం 8 గంటల నుండి 11 గంటల లోపు పని చూసుకొని ఇంటికి రావాలని చెబుతున్నారు. కొంతమంది స్వచ్ఛంద సేవా సంస్థల వారు రహదారుల వెంట చలివేంద్రాలని ఏర్పాటు చేసి మజ్జిగ తో పాటు నిమ్మరసం ఇతర పానీయాలను అందిస్తు న్నారు. ఎండ తీవ్రతను బట్టి ప్రభుత్వం వరంగల్ జిల్లాను రెడ్ అలర్ట్ కింద ప్రకటించారు. ఎండల తీవ్రత కారణంగా రోజువారి కూలీ పని చేసుకొని బతికేవాళ్లు తమకు ఉపాధి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మరో పది పదిహేను రోజులు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉంది. ఏది ఏమైనా ఎండ తీవ్రత బారిన పడకుండా, వడదెబ్బ తగిలి ప్రాణాలకు హాని కలగకుండా ఉండే విధంగా ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని అటు ప్రభుత్వం ఇటు వైద్య అధికారులు జిల్లా యంత్రాంగం సూచిస్తుంది.

## మిస్ట్ బస్టాప్‌ల ఏర్పాటు



**హనుమకొండ ప్రతినిధి మే 21 (జనం సాక్షి) :** ప్రజలకు మండు వేసవి బారీ నుండి ఉపశమనం కల్పించే విధంగా హనుమకొండ నగరంలో రెండు మిస్ట్ బస్టాప్ లను ఏర్పాటు చేయగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి గురువారం ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రంలో మరెక్కడా లేనివిధంగా ప్రప్రథమంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో హనుమకొండ లోని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ప్రధాన గేట్ పక్కన, పెట్రోల్ పంప్ పబ్లిక్ గార్డెన్ దగ్గర మిస్ట్ బస్టాప్ లను ఎమ్మెల్యే, కలెక్టర్ లు లాంఛనంగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ప్రారంభించిన అనంతరం బస్టాప్ లలో ఎమ్మెల్యే, కలెక్టర్, ప్రజలతో కలిసి కూర్చున్నారు. మిస్ట్ బస్టాప్ లలో మండు వేసవిలోనూ ప్రజల సౌకర్యార్థం చల్లగా ఉండేలా తీర్చిదిద్దారు. అందంగా తయారు చేసిన మిస్ట్ బస్టాప్ లలో ప్రజలు ఎండ వేడిమి నుండి ఉపశమనం పొందేలా పై కప్పు నుండి సన్నటి నీటి తుంపరలు చల్లగా ఉంచుతాయి. మిస్ట్ బస్టాప్ లలో పైన ఉన్న వెదురు తడకలపై నుండి ప్రత్యేకంగా మోటార్ల ద్వారా పైపుల ద్వారా చిన్నచిన్న నీటి తుంపరలు పడుతుంటాయి. దీంతో బస్టాప్ లో ఉన్న ప్రజలకు శీతల వాతావరణం ఏర్పడుతుంది. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ నగరానికి వివిధ అవసరాల నిమిత్తం ప్రజలు ఎక్కువ సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారని, బస్సులలో వెళ్లేందుకు వేచి చూస్తుంటారని ప్రజల ఆరోగ్యం, భద్రత, ప్రయాణ సౌకర్యం దృష్టిలో ఉంచుకుని మిస్ట్ బస్టాప్ లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ మున్సిపల్ కమిషనర్, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ఎండవేడిమి నుండి ప్రజలకు ఉపశమనం కోసం మిస్ట్ బస్టాప్ లను జీడబ్ల్యూఎంసీ నిధులతో రెండింటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎండీ. అజీజ్ ఖాన్, జీడబ్ల్యూఎంసీ ఈఈ రవికుమార్, హార్టికల్చర్ ఆఫీసర్ రమేష్ పాల్గొన్నారు.

## రీల్స్‌తో ములుగు పర్యాటక అందాలను విశ్వవ్యాప్తం చేయాలి

- లోకల్ టు గ్లోబల్‌గా ములుగు జిల్లా ఘన కీర్తిని ప్రపంచానికి తెలియజేయాలి
- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి, మే 21(జనంసాక్షి) :** ఇన్‌ఫ్లుయెన్సర్లు రీల్స్‌తో ములుగు జిల్లా పర్యాటక అందాలను విశ్వవ్యాప్తం చేయాలని, లోకల్ టు గ్లోబల్‌గా ములుగు జిల్లా ఘన కీర్తిని ప్రపంచానికి పరిచయం చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు పిలుపునిచ్చారు. గురువారం ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు గారు కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో 'ఇన్‌ఫ్లుయెన్సర్ రీల్స్ కాంపిటీషన్'పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ములుగు జిల్లా టూరిజంను ప్రపంచానికి పరిచయం చేసేందుకు నిర్వహిస్తున్న ఈ కాంపిటీషన్‌పై ఇన్‌ఫ్లుయెన్సర్లు, మీడియా ప్రతినిధులు, సోషల్ మీడియా హ్యాండ్లర్లతో జిల్లా కలెక్టర్ ముఖాముఖి చర్చించారు. రీల్స్ కాంపిటీషన్ విధివిధానాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ, బహుమతుల వివరాలు తదితర అంశాలను వారికి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పర్యాటక వారోత్సవాలలో భాగంగా మొదటిసారిగా వినూత్న పద్ధతిలో ములుగు జిల్లాలోని అనేక పర్యాటక ప్రాంతాలకు బ్రాండింగ్ కలిగించే విధంగా 'ఇన్‌ఫ్లుయెన్సర్ రీల్స్ కాంపిటీషన్' నిర్వహించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ములుగు జిల్లా పర్యాటక ప్రాంతాలపై 4కె వీడియో క్వాలిటీతో రీల్స్ సమర్పించాల్సి ఉంటుందని, ఆసక్తి కలవారు తమ వీడియోలను మే 21వ తేదీ నుంచి మే 30వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో సమర్పించవచ్చని, ఆన్‌లైన్ విధానంలో డీపీఆర్‌ఓ రఫీక్ 99483 92976, ఏపీఆర్‌ఓ వేణు 9494970535 నంబర్లకు వాట్సాప్ ద్వారా పంపించవచ్చని పేర్కొన్నారు. పోటీలలో గెలుపొందిన వారికి జూన్ 2వ తేదీన ప్రథమ బహుమతి రూ 21,000, ద్వితీయ బహుమతి రూ 15,000, తృతీయ బహుమతి రూ 10,000 అందించబడుతుందన్నారు. ములుగు జిల్లాలో ఆధ్యాత్మిక దేవాలయాలు, ప్రకృతి పర్యాటక కేంద్రాలు, జలపాతాలు, అభయారణ్య అందాలు, గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు కలగలిసి అనేక పర్యాటక ప్రాంతాలు ప్రకృతి వైవిధ్యభరితంగా నెలవై ఉన్నాయని పేర్కొన్నారు. జూన్ మాసం నుంచి పర్యాటక ప్రాంతాలకు ఎక్కువ సంఖ్యలో పర్యాటకులు వచ్చే అవకాశం ఉంటుందని, వారందరికీ ములుగు జిల్లా సాదర ఆహ్వానం పలుకుతుందన్నారు. రీల్స్ కాంపిటీషన్ ద్వారా ములుగు జిల్లా పర్యాటక ప్రాంతాలకు మంచి బ్రాండింగ్ వచ్చే విధంగా పూర్తి వివరాలతో, పర్యాటకులను ఆకట్టుకునే విధంగా రీల్స్‌ను రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి ఎండి రఫీక్, ఈడీఎం దేవేందర్, మీడియా ప్రతినిధులు, సోషల్ మీడియా హ్యాండ్లర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లు తదితరులు పాల్గొన్నారు.



## మిర్చి పంట దగ్ధం

**చిట్యాల, మే 21 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లి( సి) గ్రామానికి చెందిన బాలవేణి వేణు కు చెందిన జూకల్ శివారులోనీ 1. 10 గుంటలు భూమిలో వేసిన మిర్చి తోట ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని కాలీ బూడిదయింది. సుమారు రూ. 10 నుండి 15 లక్షల విలువ చేసే మిర్చి పంట ఏరడానికి సిద్ధంగా ఉందని, ఇంతలోనే ఈ ప్రమాదం జరగడంతో రైతు విలవిలలాడుతున్నాడు. పంటతోపాటు డ్రిప్, 25 పైపులు, మోటారు కాలిపోయాయి. మూడు లక్షల అప్పు చేసి పంటను సేద్యం చేశానని, ఇలా జరగడంతో రైతు బోరున విలపిస్తున్నాడు. ప్రభుత్వమే తనకు న్యాయం చేయాలని తెలిపాడు. ప్రక్కన ఉన్న గుండా హరీష్ కి చెందిన పైపులు కూడా కాలిపోవడం జరిగింది.

## కోతుల పట్టివేత



**నిర్మల్, మే 21 (జనంసాక్షి):** నిర్మల్ పట్టణంలోని గాజులపేట్ ప్రాంతంలో 50 కోతులను పట్టుకొని కవ్వాల్ అటవీ ప్రాంతంలో విడిచిపెట్టనున్నట్లు నిర్మల్ మున్సిపల్ వైస్ ఛైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి తెలిపారు. కోతుల పట్టివేత ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని పట్టణ ప్రజలకు కొంత మేరకు కోతుల బెడద నుండి విముక్తి పొందుతారని మున్సిపల్ వైస్ ఛైర్మన్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ ఇర్ఫాన్, నాయకులు ఖీజర్, సానిటరీ ఇన్స్పెక్టర్ ప్రవీణ్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అనుమానస్పదంగా మహిళ మృతి



**వరంగల్ ప్రతినిధి, మే 21 (జనం సాక్షి) :** మహిళ దారుణ హత్యకు గురైన సంఘటన వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం లక్ష్మీపురం గ్రామంలోని తెనాలి కాలువలో వివాహిత మహిళ అనుమానాస్పద స్థితిలో హత్యకు గురైంది. స్థానికుల కథనం ప్రకారం లక్ష్మీపురం గ్రామానికి చెందిను తాళ్లపెల్లి సుమలత(35) బుధవారం ఇంటిలో నుంచి వెళ్లి గురువారం తెల్లవారుజామున ఎస్సారెస్పీ కాలువలో శవమయి కనిపించారు. మృతురాలు గొంతు పై కత్తి ఘాట్లు ఉండడంతో మహిళ మృతికి దుండగులు దారుణానికి ఒడిగట్టినట్లు తెలుస్తుంది. మృతురాలికి ఇద్దరు పిల్లలు జశ్వంత్, తేజస్విని ఉన్నారు. ఆమె భర్త మహేందర్ అనారోగ్యంతో నాలుగు ఏండ్ల కిందట చనిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతురాలు సుమలత ఇంట్లో నుంచి వరంగల్ కి షాపింగ్ కోసం వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. సాయంత్రం వరకు ఇంటికి చేరుకోలేదు. ఏలుకుర్తి గ్రామస్తులు ఉపాధి హామీ పనుల నిమిత్తం వెళ్తుండగా మహిళ మృతదేహం కనపడినట్లు గ్రామస్థులకు తెలిపారు...సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. గ్రామ సమీపంలో సుమలత అచేతన స్థితిలో కెనాల్ కాలువలో లభ్యమైంది. దగ్గరలో ఒక కత్తి సైతం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రక్తపు మరకలు కాల్వ దగ్గరలో ఉన్నాయి. పెనుగులాట జరిగినట్లు కాల్వ దగ్గర ఆమె మెడలో ఉండే ముత్యాల దండ పడి ఉంది. చెప్పులు, బ్యాగ్ చిందరవందరగా పడి ఉన్నాయి. దుగ్గొండి ఎస్సై రావుల రణధీర్ రెడ్డి ఆధ్వర్యంలో సంఘటన స్థలానికి విచ్చేసి హత్య గల కారణాలను ప్రత్యేక బృందం ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. సంఘటన స్థలంలో దొరికిన కత్తి చెప్పులు లభించడంతో దుండగులు ఆమెను హత్య చేసినట్లుగా అనుమానిస్తున్నారు. మరోవైపు మృతురాలు హత్యకు వివాహేతర సంబంధమే కారణమై ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దుగ్గొండి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మహబూబాబాద్ పట్టణంలో ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్లు

- ప్రారంభించిన జిల్లా ఎస్పీ డా.శబరీష్



**మహబూబాబాద్ బ్యూరో, మే 21(జనం సాక్షి):** మహబూబాబాద్ పట్టణంలోని నెహ్రూ సెంటర్, మదర్ థెరిస్సా సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన నూతన ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్లను జిల్లా ఎస్పీ డా. శబరీష్ ప్రారంభించారు. పట్టణంలో పెరుగుతున్న వాహన రద్దీ, రోడ్డు ప్రమాదాల నివారణ మరియు ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ఈ సిగ్నల్ వ్యవస్థను అమలు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు తప్పనిసరిగా ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పాటించాలని సూచించారు. రెడ్ సిగ్నల్ వద్ద వాహనాలను ఆపడం, హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ వినియోగించడం, ట్రాఫిక్ నియమాలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించడంతో పాటు సురక్షితమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని జిల్లా ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ తిరుపతి రావు, టౌన్ సీఐ రఘుపతి రెడ్డి, ట్రాఫిక్ ఎస్.ఐ అరుణ్ కుమార్ ట్రాఫిక్ పోలీసులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తాం

- మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి



**నిర్మల్ బ్యూరో, మే21 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లాలోని ప్రతి కొనుగోలు కేంద్రంలో నిలిచిపోయిన ధాన్యాన్ని ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేస్తుందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఆయన సారంగాపూర్ మండలంలోని కౌట్ల, సారంగాపూర్, జామ్ గ్రామాలతో పాటు నిర్మల్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన మొక్కజొన్న, వరి కొనుగోలు కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో నిల్వ ఉన్న పంట ఉత్పత్తులను పరిశీలించి, అక్కడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకోవడంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కొనుగోలు కేంద్రాల్లో తూకాలు సక్రమంగా జరిగేలా చూడాలని, సేకరించిన ధాన్యానికి సంబంధించిన చెల్లింపులు త్వరగా జరిగేలా అధికారులు చొరవ చూపాలని సూచించారు. "రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడటమే మా ప్రాధాన్యత. ప్రతి కొనుగోలు కేంద్రంలో నిలిచిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటాం" అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ మున్సిపల్ వైస్ ఛైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ సోమ భీమ్ రెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ ఛైర్మన్ ధర్మాజీ రాజేందర్, మాజీ జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, నాయకులు ముడుసు సత్యనారాయణ, కౌన్సిలర్లు ఎస్పి రాజు, శెనిగారపు నరేష్, లక్కాకుల హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# వడదెబ్బతో ఇద్దరు మృతి





**దస్తూరాబాద్/రేగొండ, మే 21 (జనంసాక్షి):** వడదెబ్బతో ఇద్దరు మృతి చెందారు. నిర్మల్ జిల్లాలోని దస్తూరాబాద్ మండల కేంద్రంలోని రేవోజీపేటలో, జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండలో ఓ వ్యక్తి ఇద్దరు వడదెబ్బకు గురై మృతి చెందారు. దస్తూరాబాద్ మండల కేంద్రంలోని రేవోజీపేట గ్రామానికి చెందిన వ్యక్తి వడ దెబ్బ తగిలి చనిపోవడం జరిగిందని ఎస్ ఐ సాయి కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రేవోజీపేట గ్రామానికి చెందిన కట్ల వెంకన్న తండ్రి రాజలింగం వయస్సు సుమారు 63 సంవత్సరాలు సాయంత్రం 5:00 గంటల సమయంలో ధాన్యం కొనుగోలు కేంద్రానికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా సాయంత్రం సుమారు 5:45 గంటల సమయంలో గ్రామ సమీపంలో అకస్మాత్తుగా కుప్పకూలిపోయాడని తెలిపారు. వెంటనే స్థానికురాలు చింతపండు సుమలత గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినదని ఆయన అన్నారు, వెంటనే కుటుంబ సభ్యులు స్పందించి దవాఖానకు తీసుకెళ్లగా తీవ్ర ఎండల కారణంగా వడదెబ్బ తగిలి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని ఆయన తెలిపారు. మృతుని కుమారుడు కట్ల అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని తెలిపారు.

రేగొండ మండలంలోని భాగీర్తిపేటలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మహమ్మద్ యాకుపాష(45) రోజువారీ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. గురువారం మేస్త్రి పనికి వెళ్లిన ఆయన ఎండ తీవ్రత తాళలేక అస్వస్థతకు గురై మృత్యువాత పడ్డాడు. కుటుంబానికి పెద్దదిక్కు మరణించడంతో కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి. ప్రభుత్వ స్పందించి బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలని పలువురు కోరుతున్నారు. కాగా మృతునికి భార్య షాజన్, కుమారులు ముస్తఫా, సీరజ్ ఉన్నారు.



## వడ్ల తూకం, రవాణాపై ఎస్పీ ఆరా

**ఏటూరునాగారం, మే 21(జనంసాక్షి) :** ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ ఐపీఎస్ ఏటూరునాగారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ రైతులను వారు యొక్క సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. వడ్ల తూకం గురించి, వాటి రవాణా కోసం అందుబాటులో ఉన్న వాహనాల గురించి విచారిస్తూ, వడ్ల తూకంలో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే వెంటనే తమకు తెలియజేయాలని అట్టి వారి పైన కఠినమైన చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. పండించిన వడ్లను రవాణా చేయుటకు తగినన్ని వాహనాలను ఏర్పాటు చేయాలని స్థానిక అధికారులను ఆదేశించారు. రైతులు వారు పండించిన ప్రతి గింజను అమ్ముకు నే వరకు జిల్లా పోలీస్ శాఖ అండగా ఉంటుందని వారికి కావలసిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తుందని రైతులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భనలో ఏటూరు నాగారం ఏఎస్పీ మనన్ భట్, ములుగు డిఎస్పీ రవీందర్, ఎస్పీ ఇన్స్పెక్టర్ శంకర్, ఏటూరు నాగారం సిఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
22 మే 2026

## వీఓఏల పెండింగ్ వున్నా సమస్యలు పరిష్కారించాలి

- కలెక్టరేట్‌లో నిరసన
- అదనపు కలెక్టర్‌కు వినతి



**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, మే 21 (జనం సాక్షి) :** జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో కృషి చేస్తున్న తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఐకేపీ వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు కలాలీ రాజేశ్వరీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్‌లో నిరసన తెలిపారు. వీఓఏలు అదనపు కలెక్టర్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం రాజేశ్వరీ మాట్లాడుతూ వీఓఏల కనీస వేతనం రూ.20వేలు ఇవ్వాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్‌ఆర్ పాలసీ వర్తింపజేయాలన్నారు. అలాగే అర్హులైన వీఓఏలకు సీసీలుఆ పదోన్నతులుగా కల్పించాలని, వీఓఏలకు స్యాధారణ, ఆరోగ్య భీమా కల్పించాలన్నారు. అలాగే ట్యాబ్ సౌకర్యం కల్పిస్తూ జీఓ నెం.58ను సవరించాలన్నారు. డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈనెల 18 నుండి సమ్మె కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు అదనపు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి అశోక్ యాదవ్, కోశాధికారి అనిత, ఉపాధ్యక్షుడు సురేష్, సహకార్యదర్శి లక్ష్మి తోపాటు పెద్ద ఎత్తున వీఓఏలు పాల్గొన్నారు.

## మెదక్ కోట పరిరక్షణపై పురావస్తు శాఖ సమన్వయంతో పటిష్టచర్యలు

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, మే 21 (జనం సాక్షి) :** మెదక్ కోట పునరుద్ధరణ మరియు పరిరక్షణపై పురావస్తు శాఖ సమన్వయంతో పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ తెలిపారు. గురువారం కలెక్టర్ ఛాంబర్ లో మెదక్ కోట పునరుద్ధరణ, పరిరక్షణపై చర్చించేందుకు పురావస్తు శాఖ డైరెక్టర్ సంబంధిత అధికారులతో గురువారం కలెక్టర్ సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ అర్జున్ రావు, డాక్టర్ నాగరాజు, డిప్యూటీ డైరెక్టర్, శ్రీ ఎన్. నరసింగ్, డిప్యూటీ డైరెక్టర్ (ఇంజనీరింగ్), డిపిఆర్ఓ రామచంద్ర రాజు, యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, ఈడియం సందీప్ పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కోట వద్ద పరిరక్షణ, పర్యాటక అభివృద్ధి మరియు మౌలిక సదుపాయాల మెరుగుదల పనులకు సంబంధించిన వివిధ అంశాలపై పురావస్తు శాఖ అధికారులతో చర్చించడం జరిగిందని తెలిపారు. మెదక్ కోట చారిత్రాత్మకంగా ప్రాముఖ్యత కలిగిన ఒక కొండ కోట. దీనిని మొదట 12-13వ శతాబ్దాలలో కాకతీయ కాలంలో నిర్మించగా, తదనంతరం కుతుబ్ షాహీ పాలకులు దీనిని మరింత పటిష్టం చేశారు. ఈ కోట దాని వ్యూహాత్మక ప్రదేశం, ప్రాచీన ద్వారాలు, ఫిరంగి స్థావరాలు, వాస్తు నిర్మాణ అవశేషాలు మరియు మెదక్ పట్టణం




యొక్క విశాల దృశ్యానికి ప్రసిద్ధి చెందింది. ఇది తెలంగాణ యొక్క గొప్ప సాంస్కృతిక మరియు సైనిక చరిత్రను ప్రతిబింబించే ముఖ్యమైన వారసత్వ కట్టడాలలో ఒకటి. సమగ్ర అభివృద్ధి పనుల కోసం గతంలో ప్రతిపాదించిన ?6.20 కోట్ల అంచనాను ఇప్పుడు సుమారు ?10 కోట్లకు సవరించినట్లు తెలిపారు. మెదక్ కోట సమగ్ర అభివృద్ధి కోసం మాస్టర్ ప్లాన్ తయారీకి ఒక కన్సల్టెంట్‌ను నియమించాల్సిన ఆవశ్యకతను సమావేశం నిర్ణయించిందన్నారు. మెదక్ కోట యొక్క మొత్తం అభివృద్ధి కార్యక్రమాన్ని ఈ క్రింది మూడు వర్గాలుగా విభజించాలని పరిరక్షణ పనులు, ఆదాయ సృష్టి అంశాలు, భూదృశ్య అభివృద్ధి పనులు. సవరించిన అంచనాల తయారీ మరియు కోట వద్ద మార్గాలు, లైటింగ్, తాగునీటి సౌకర్యాలు, కూర్చునే ఏర్పాట్లు, సూచికలు మరియు పారిశుద్ధ్య సౌకర్యాలతో సహా సందర్శకుల సౌకర్యాల కల్పనపై చర్చించడం జరిగిందని తెలిపారు. మెరుగైన సందర్శకుల నిర్వహణ, వారసత్వ వివరణ, భద్రత మరియు పర్యాటక ప్రోత్సాహం కోసం టూరిస్ట్ గైడ్‌లు మరియు టూరిస్ట్ పోలీసులను నియమించాల్సిన సంవత్సరానికి అనుగుణంగా చర్యలు చేపడతామన్నారు. పురావస్తు శాఖ సైంటిస్ట్ అర్జున్ రావు మెదక్‌ను ఒక ప్రధాన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి, దాని అభివృద్ధిని గుర్తించి, ప్రణాళిక రూపొందించేందుకు గాను, పురావస్తు శాఖ డైరెక్టర్‌ను మరియు పర్యాటక శాఖ డైరెక్టర్‌ను మెదక్ జిల్లాను సందర్శించవలసిందిగా మెదక్ కలెక్టర్ను అభ్యర్థించారు. మెదక్ కోట అభివృద్ధి, పరిరక్షణ కోసం వీలైనంత త్వరగా వివరణాత్మక అంచనాను సమర్పించాల్సిందిగా కలెక్టర్ పురావస్తు శాఖ డైరెక్టర్‌ను కోరారు. మెదక్ కోటను ఒక ప్రముఖ వారసత్వ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి, పరిరక్షించడానికి మరియు ప్రోత్సహించడానికి కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులను సమీకరించడంలో మద్దతు ఇస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రహదారులపై బైక్ స్టంట్లు చేస్తున్న యువకుల అరెస్ట్

**ఖమ్మం కార్పొరేషన్, మే 21 (జనం సాక్షి) :** సోషల్ మీడియాలో లైకులు, రీల్స్ కోసం అత్యుత్సాహం ప్రదర్శిస్తూ...బహిరంగ రహదారులపై ప్రాణాపాయం కలిగించే విధంగా బైక్ స్టంట్లు చేస్తూ..., మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్న ఇద్దరు యువకులను ఖమ్మం టాస్క్ ఫోర్స్, కూసుమంచి ఎస్సై నాగరాజు అదుపులోకి తీసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ ఏసీపీ సత్యనారాయణ తెలిపారు. ఇటీవల కాలంలో ఖమ్మం నగరంతో పాటు, పరిసర ప్రాంతాల్లోని జాతీయ రహదారులపై ప్రమాదకర విన్యాసాలు చేసి ఇతరుల ప్రాణాలకు ముప్పు తెస్తున్న కుసుమంచి మండలం, పరికసింగారం గ్రామానికి చెందిన మాదవరుపు శివ రామకృష్ణ, (20 సం) కోక్య తండా కు చెందిన బానోత్ జశ్వంత్ (18సం)ను గురువారం కూసుమంచి పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సోషల్ మీడియా పోస్టులపై పోలీస్ సోషల్ మీడియా బృందం నిశితంగా పరిశీలిస్తుందని, ఈ తరహా చర్యలకు పాల్పడే వారిపై పోలీసులు మోటారు వాహన చట్టం, పబ్లిక్ న్యూసెన్స్ కింద కఠిన సెక్షన్లతో కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. బహిరంగ రోడ్లపై బైక్ విన్యాసాలు చేయడం చట్టరీత్యా నేరమని, విన్యాసాలు స్టంట్లు చేసే యువకుల ప్రాణాల మీదికి తేవడమే కాకుండా, రోడ్డుపై వెళ్లే పాదచారులకు, ఇతర వాహనదారులకు తీవ్ర ప్రమాదకరంగా మారుతున్నరాని అన్నారు. ప్రదానంగా తల్లిదండ్రులు తమ మైనర్



పిల్లలకు బైక్‌లు ఇవ్వకూడదని, అదేవిధంగా పిల్లల రోజువారి కార్యకలాపాలను నిశితంగా గమనిస్తూ ఉండాలని, చట్టవరుద్ధమైన ప్రాణాపాయం కలిగించే ఇలాంటి పనులకు దూరం ఉండేలా కౌన్సిలింగ్ ఇవ్వాలని అన్నారు. అలాగే యువత ఇలాంటి సాహసాలకు పోయి ప్రాణాలను పోగొట్టుకోవద్దని సూచించారు. ప్రజల భద్రతకు భంగం కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే, స్థానిక పోలీసులకు లేదా డయల్ 100 కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. మోటారు వాహన చట్టం ప్రకారం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, రేసింగ్ చేస్తే జైలు శిక్ష, భారీ జరిమానాలు పడే అవకాశం ఉందన్నారు.

## ఉపాధిహామీ పనుల ఆకస్మిక తనిఖీ

**నూతనకల్/ మద్దిరాల, మే 21 (జనంసాక్షి) :** ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రజలకు ఉపాధి, ఆదాయ భద్రతను కల్పిస్తుందని, గ్రామీణ ప్రాంత కూలీలు ఎక్కువ సంఖ్యలో హాజరై ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం పనులు ప్రభుత్వం నిర్దేశించిన సాంకేతిక, నాణ్యత ప్రమాణాల ప్రకారం జరుగుతున్నాయా లేదా అని స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు.గురువారం ఆయన ఆత్మకూర్(ఎస్) మండలంలోని నెమ్మికల్, మద్దిరాల మండలం, నూతనకల్, పోలుమల్ల గ్రామాల్లో సాగుతున్న ఉపాధి హామీ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు.తీవ్రమైన ఎండల నేపథ్యంలో పని స్థలాల్లో కూలీలకు కల్పిస్తున్న ప్రాథమిక సౌకర్యాలపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఎండ నుండి ఉపశమనం కోసం ఏర్పాటు చేసిన షెడ్, తాగునీరు, అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించేందుకు సిద్ధంగా ఉంచిన ఓఆర్ఎస్ ప్యాకెట్లను తనిఖీ చేశారు.ఎండల తీవ్రత దృష్ట్యా కూలీలు ఉదయమే పనులు ముగించుకునేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ సాదాసీదాగా, స్నేహపూర్వకంగా కూలీల వద్దకు వెళ్లి వారితో ముచ్చటించారు.వేతనాలు సమయానికి జమవుతున్నాయా, ప్రభుత్వం ప్రకటించిన సగటు వేతనం అందుతుందా, పనుల్లో ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.కూలీలు తమ సమస్యలను కలెక్టర్‌కు వివరించగా, ఆయన వాటిని విని, తక్షణ పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని



సంబంధిత అధికారులను ఆదేశించారు.కలెక్టర్ తమతో అంతలా కలిసిపోవడంతో కూలీలు హర్షం వ్యక్తం చేశారు.జిల్లాలో వడదెబ్బ తగిలిన వారికి తక్షణ వైద్యం అందించేందుకు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన అత్యవసర మందులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే ప్రజలు ఆలస్యం చేయకుండా వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించి, వైద్యుల సలహాలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ పిడి సన్యాసయ్య, అడిషనల్ పిడి చంద్రశేఖర్, ఆత్మకూర్ (ఎస్) ఎంపీడీవో హసిమ్, నూతనకల్ ఎంపీడీవో సునీత, మద్దిరాల ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, ఏపీడి పవన్ కుమార్, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలపై పర్యవేక్షణ అవసరం

- ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వేగవంతం చేయాలి
- 22న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి కార్యక్రమం
- గూగుల్ మీట్ లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్




**గద్వాల నడిగడ్డ, మే 21 (జనం సాక్షి) :** మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ప్రత్యేక అధికారులుగా నియమింపబడ్డ వారందరూ నిరంతరం పర్యవేక్షణ చేస్తూ కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి మొక్కజొన్న కొనుగోలు, ఇతర అంశాలపై సంబంధిత అధికారులతో గూగుల్ మీట్ లో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. గద్వాల, ఐజ, క్యాతురు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద పెద్ద మొత్తంలో నిల్వలు ఉండడంతో అదనపు లారీలను ఏర్పాటు చేసి ఈనెల 26వ తేదీ లోగా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఆయా కొనుగోలు కేంద్రాలకు సంబంధించి గోదాముల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. వరి ధాన్యం కొనుగోలు విషయంలోనూ సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని ఈనెల 26వ తేదీలోగా కొనుగోలు ప్రక్రియ పూర్తి అయ్యేలా వేగవంతం చేయాలన్నారు. తహసిల్దారులు పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించుకొని జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ కూడా వేగవంతం అయ్యేలా చూడాలన్నారు. ఈనెల 22న నిర్వహించే ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి కార్యక్రమంను విజయవంతం చేసేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, ఆర్డిఓ శ్రీనివాసరావు, మార్క్ఫెడ్ డిఎం చంద్రమౌళి, డిటీఓ టీవీ రావు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలులో జాప్యం వహిస్తే సహించేది లేదు

**పి.ఏ.పల్లి, మే 21 (జనంసాక్షి) :** నల్లగొండ జిల్లా పి.ఏ.పల్లి మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం నాడు నల్గొండ జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్,జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ధాన్యం రికార్డులను తనిఖీ చేసి రైతుల వివరాలు సీరియల్‌గా ఉన్నాయా.? లేవా.? అని,ధాన్యం మ్యాచర్ ఎంతమంది రైతులవి వచ్చావని.? సెంటర్ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.ఈ నెలాఖరులోపు ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి చేయాలని ఆయన అన్నారు.గన్ని బ్యాగుల కొరత,లారీల కొరత ఉందని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో స్థానిక తహసిల్దార్ తో మాట్లాడి సమస్యను త్వరగా పరిష్కరించాలని ఆమెకు సూచించారు.అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉన్న రైతు వస్రం ధాన్యం కుప్పను జిల్లా కలెక్టర్ చంద్ర శేఖర్ స్వయంగా మాయిచర్న్ పరిశీలించారు.స్థానిక తహసిల్దార్ జయశ్రీ చిలకమర్రి గేటు వద్ద ఉన్న గోదాములు పూర్తిగా నిండాయని తెలపడంతో తక్షణమే కలెక్టర్ స్పందిస్తూ వెంకట సాయి మిల్లుకు తక్షణమే ట్యాగింగ్ ఇవ్వాలని అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశించారు.మార్కెట్ యార్డ్ నందు ఉన్న రైతులు తమ ధాన్యాన్ని క్వింటాలకు



రెండు నుండి మూడు కిలోలు మిల్లర్లు కోత విధిస్తున్నారని కలెక్టర్,ఎస్పీ దృష్టికి తీసుకురావడంతో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ స్పందిస్తూ ఎవరైనా మిల్లర్లు ధాన్యాన్ని కోత విధిస్తే ట్రక్ షీట్ తీసుకొని స్థానిక ఎస్సై లేదా తహసిల్దార్ కు పేపర్ ద్వారా కచ్చితంగా కంప్లైంట్ ఇవ్వాలని ఆయన రైతులకు సూచించారు.వారి వెంట సివిల్ సప్లై డిఎం,దేవరకొండ డిఎస్పి శ్రీనివాసరావు,దేవరకొండ ఆర్డీవో పద్మప్రియ,తహసిల్దార్ జయశ్రీ,ఎంపీడీవో చంద్రమౌళి, కొండమల్లేపల్లి సిఐ నవీన్ కుమార్,ఎస్ ఐ వెంకన్న,ఐకేపీ సెంటర్ ఇన్చార్జి కొండమీది బిక్షం,అనిల్,భీమా స్థానిక నాయకులు కొండల్, ముత్తయ్య, శ్రీనివాస్, రైతులు, తదితరులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**కోహిర్, మే 21 (జనం సాక్షి) :** రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనీ వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం కోహిర్ శివారులో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై నరేష్ వివరాల ప్రకారం కోహిర్ మండలం కొత్తూరు గ్రామానికి చెందిన గొల్ల రాజు తన యొక్క వ్యవసాయ పొలానికి వెళ్లడానికి పొలం పక్కన ఉన్న జావేద్ బైక్ తీసుకొని వెళ్తుండగా ఖిలాల్ పూర్ నుండి రాయల్ ఎన్ఫీల్డ్ బండి నిర్లక్ష్యంగా నడుపుతూ గొల్ల రాజు నడుపుతున్న వాహనాన్ని ఢీకొట్టగా రాజుకు తలకు, చేతికి తీవ్రంగా గాయం కావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాజు మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.



## ఆరుగాలం కష్టం చేసిన పంటకు అర్వకష్టం



**పి.ఏ.పల్లి, మే 21 (జనంసాక్షి) :** గుడిపల్లి మండలంలోని కోదండపురం గ్రామంలో ఎన్డీఎంఎస్ ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.ధాన్యం కొనుగోలు కేంద్రానికి వచ్చే గ్రామాలు కోదండపురం,భీమనపల్లి, గణపురం పూర్తిగా ఆయకట్టు ప్రాంతం కావడంతో ఇక్కడ రైతులు వరి ధాన్యం ఎక్కువగా పండిస్తుంటారు.ఇక్కడే వచ్చింది రైతులకు అసలు సమస్య,ఈ ధాన్యం కేంద్రానికి గత నెల రోజుల నుండి పెద్ద ఎత్తున వరి ధాన్యాన్ని రైతులు కేంద్రానికి తీసుకు వస్తున్నారు.కానీ దానికి తగ్గట్టుగా ధాన్యం కేంద్రంలో సరైన వసతులు లేక మరియు కొనుగోళ్ల యందు జాప్యం జరగడంతో లారీలు వస్తలేనందున మేము ధాన్యాన్ని కొనలేమని అక్కడ యాజమాన్యం చెప్పడంతో ఆగ్రహించిన అన్నదాతలు గురువారం నాడు ఉదయం 9 గంటలకు జడ్చర్ల - కోదాడ జాతీయ రహదారి పై రంగారెడ్డిగూడెం స్టేజీ వద్ద పెద్ద ఎత్తున రైతులు నిరసన కార్యక్రమం చేపట్టారు. రైతన్నల నిరసన కార్యక్రమానికి మద్దతుగా బిఆర్ఎస్ పార్టీ అండగా మద్దతు తెలిపి సుమారు రెండు గంటల పాటు ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు. ధర్నా కార్యక్రమానికి చేరుకున్న పోలీసు, అధికార యంత్రాంగం అక్కడ రైతులతో మరియు బిఆర్ఎస్ పార్టీ నాయకులతో మాట్లాడగా వారు స్థానిక అధికారులు వచ్చి హామీ ఇచ్చేవరకు ధర్నా కార్యక్రమం విరమించే ప్రసక్తి లేదని వాళ్ళు చెప్పడంతో చివరికి స్థానిక గుడిపల్లి ఎస్సై నరసింహులు గౌడ్ కల్పించుకొని ఎన్డీఎంఎస్ యాజమాన్యాన్ని మరియు స్థానిక గుడిపల్లి తహసిల్దార్ దీవన మధు హాసిని అక్కడికి చేరుకొని వారు రైతులు మరియు బిఆర్ఎస్ పార్టీ నాయకులతో మాట్లాడి ప్రతి రోజు ఐదు లారీల చొప్పున వరి ధాన్యం కేంద్రాలకు పంపిస్తామని వారు హామీ ఇవ్వడంతో రైతులు, బిఆర్ఎస్ నాయకులు ధర్నా కార్యక్రమాన్ని విరమించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు యెల్గురి వల్లపు రెడ్డి, బిఆర్ఎస్ మండల నాయకులు తోటకూరి పరమేష్, అర్వపల్లి నరసింహ,ఎర్ర యాదగిరి, గన్నెబోయిన వెంకటయ్య, జగన్,రమావత్ శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి కార్యక్రమం

- హాజరుకానున్న మంత్రులు, ప్రజాప్రతినిధులు



**సూర్యాపేట ప్రతినిధి, మే 21 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజులు ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నేడు జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని రవిమహల్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటల నుండి ఈ కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్, ఎస్సీ ,ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఇరిగేషన్, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొననున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ముఖ్యంగా కొత్త పథకాలపై సమగ్ర విశ్లేషణ, వివిధ శాఖల అధికారులు తమ పరిధిలోని సాధించిన విజయాలు, రాబోయే కొత్త పథకాలపై వివరాలను వెల్లడిస్తారన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ, గృహ నిర్మాణ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, రెవెన్యూ , విద్యా, విద్యుత్, పౌరసరఫరాల శాఖలపై సమీక్ష సమావేశంలో అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని ఆదేశించారు.

## నాలుగు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేస్తాం

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్
- ఇప్పటివరకు రూ.437 కోట్లు రైతుల ఖాతాల్లో జమ
- మిల్లులలో అన్‌లోడింగ్ పర్యవేక్షణకు సీనియర్, పోలీస్ అధికారులు
- మద్దిరాల, నూతనకల్ మండలాల్లోని మిల్లులలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**నూతనకల్ / మద్దిరాల, మే 21 (జనంసాక్షి) :** జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసి, వచ్చే నాలుగు రోజుల్లో పూర్తి స్థాయిలో కొనుగోళ్లను పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్పష్టం చేశారు. గురువారం మద్దిరాల, నూతనకల్ మండలాల్లోని పలు రైస్ మిల్లులను ఆకస్మికంగా సందర్శించి, ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 2.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని తెలిపారు.ఇందుకు సంబంధించి రూ.437 కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగిందని తెలిపారు.మిగిలిన ధాన్యాన్ని కూడా వెంటనే కొనుగోలు చేసేందుకు వీలుగా ప్రతిరోజు ట్యాబ్ ఎంట్రీలు, టాక్ షీట్లను నిరంతరం పరిశీలిస్తూ మానిటరింగ్ చేస్తున్నామని చెప్పారు. రోజుకు 10 వేల టన్నుల కొనుగోలు ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసేందుకు, మిల్లుల వద్ద లారీల అన్‌లోడింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వివరించారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రానికి ఒక ఇన్‌ఛార్జ్ అధికారిని నియమించామని, మిల్లులలో ధాన్యం అన్‌లోడింగ్ వేగంగా జరిగేలా చూసేందుకు ఒక సీనియర్ అధికారితో పాటు, ఒక పోలీస్ అధికారిని నియమించి ప్రతిరోజు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.ప్రస్తుతం జిల్లాలో ప్రతిరోజూ 9 వేల నుండి 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి, వెంటనే మిల్లులకు తరలిస్తున్నామని చెప్పారు. ధాన్యం రవాణాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారని తెలిపారు. ట్రాన్స్‌పోర్ట్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ కొనుగోలు ప్రక్రియకు ఆటంకం



కలగకుండా చూస్తున్నామన్నారు. వచ్చే నాలుగు రోజులు ధాన్యం కొనుగోళ్లకే అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, జిల్లాలోని పూర్తి స్థాయి ధాన్యాన్ని సేకరిస్తామని పేర్కొన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ పిడి సన్యాసయ్య, అడిషనల్ పిడి చంద్రశేఖర్, మద్దిరాల ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, నూతనకల్ ఎంపీడీవో సునీత తదితరులు పాల్గొన్నారు.

## విపణి

# లాభాల్లో ప్రారంభమై నష్టాల్లోకి

### సెన్సెక్స్ 135 పాయింట్లు డౌన్..

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఐటీ, ఎఫ్ఎంసీజీ స్టాక్స్‌పై ఒత్తిడి కారణంగా సూచీలు ప్రభావితమయ్యాయి. ఉదయం లాభాల్లో ట్రేడయిన సూచీలు.. చివరికి నష్టాల్లోకి జారుకున్నాయి. సెన్సెక్స్ 135.03 పాయింట్లు నష్టపోయి 75,183.36 పాయింట్ల వద్ద ముగియగా.. నిఫ్టీ 4.30 పాయింట్ల నష్టంతో 23,654.70 వద్ద స్థిర పడింది. ఆర్‌బీఐ రంగ ప్రవేశంతో డాలరుతో రూపాయి విలువ 63 పైసలు బలపడి 96.23కు చేరుకుంది. ఉదయం 75,732.42 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 75,318.39) లాభాల్లో ప్రారంభమైన సూచీ.. ఇంట్రాడేలో 74,996.78 – 75,945.79 మధ్య కదలాడింది. సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా, హిందుస్థాన్ యూనిలీవర్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ఇండిగో, బీఈఎల్, ట్రెంట్, అదానీ పోర్ట్స్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ 104 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4518 డాలర్ల వద్ద కొనసాగుతోంది.



### 'పేరు' తెచ్చిన సంపద..

#### ఈ కంపెనీలు 'పొరపాటు'న లాభపడ్డాయ్..!

భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ వైరల్ 'మెలోడీ' మూమెంట్ పుణ్యమా అని ఈ చాక్లెట్ తయారు చేసిన 'పార్లే' పేరు నెట్టింట మార్మోగింది. అది కాస్తా 'పార్లే ఇండస్ట్రీస్'కు కలిసొచ్చింది. మెలోడీతో దీనికి ఏం సంబంధం లేనప్పటికీ.. స్టాక్ మార్కెట్లలో ఈ కంపెనీ షేర్లు రాణిస్తున్నాయి. అయితే, ఇప్పుడే కాదు.. గతంలోనూ ఇలా పేర్ల గందరగోళంతో వేరే కంపెనీలు కారణం లేకపోయినా భారీగా లాభపడిన సందర్భాలున్నాయి. అవేంటో ఓసారి చూద్దాం..!

**పార్లే..:** మెలోడీ చాక్లెట్లను పార్లే ప్రొడక్ట్స్ (ఖజీతీశ్రీవ ఖతీనీటబీఇబిబ) సంస్థ తయారుచేస్తోంది. ఈ కంపెనీ స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ కాలేదు. ఇప్పుడు మెలోడీ మూమెంట్‌తో పార్లే పేరు వైరల్ అవడంతో అదే పేరుతో స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ఉన్న పార్లే ఇండస్ట్రీస్ షేర్లలో ర్యాలీ కొనసాగుతోంది. వరుసగా రెండో రోజు ఈ కంపెనీ షేర్లు గురువారం అప్పర్ సర్క్యూట్‌ను తాకాయి.

**బాంబే ఆక్సిజన్..:** 2021లో కొవిడ్ మహమ్మారి భారత్ సహా యావత్ ప్రపంచాన్ని వణికించింది. ఆ సమయంలో మెడికల్ ఆక్సిజన్, ఆక్సిజన్ సిలిండర్ల పేర్లు వార్తల్లో మార్మోగాయి. దీంతో ఆక్సిజన్ పేరుతో ఉన్న కంపెనీల షేర్లు రాణించాయి. అలా 'బాంబే ఆక్సిజన్' కంపెనీ షేర్లు కూడా పెరిగాయి. వాస్తవానికి ఈ కంపెనీ ఆక్సిజన్ తయారీ వ్యాపారం నుంచి 2019లోనే బయటికొచ్చి నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీగా మారింది. కానీ, పేరు అదే ఉండటంతో కొవిడ్ సమయంలో షేరు విలువ భారీగా పెరిగింది. 2021 మార్చి 31న దాదాపు రూ.11వేలు ఉన్న షేరు విలువ.. ఆ ఏడాది ఏప్రిల్ 20 నాటికి ఏకంగా రూ.25,500కు పెరగడం గమనార్హం. ఒకానొక దశలో ఈ అసాధారణ ధరపై కంపెనీ నుంచి బీఎస్ఈ వివరణ కూడా కోరాల్సి వచ్చింది.

**సిగ్నల్..:** 2021 జనవరిలో టెస్లా అధినేత ఎలాన్ మస్క్ 'యూస్ సిగ్నల్' అంటూ కేవలం రెండు పదాల పోస్ట్ చేశారు. నాడు మెసేజింగ్ యాప్ 'వాట్సప్'లో గోప్యతపై ఆందోళనలు వ్యక్తమైన సమయంలో 'సిగ్నల్' మెసేజింగ్ యాప్‌ను వినియోగించాలనే ఉద్దేశంతో మస్క్ ఆ పోస్ట్ పెట్టారు. అది కాస్తా మైక్రోక్యాప్ సంస్థ 'సిగ్నల్ అడ్వాన్స్'కు కలిసొచ్చింది. కేవలం రోజుల వ్యవధిలోనే ఈ కంపెనీ షేర్లు ఏకంగా 5వేల శాతం పెరగడం గమనార్హం.

**జూమ్..:** లాక్‌డౌన్ సమయంలో 'వర్క్ ఫ్రమ్ హోమ్' తప్పనిసరిగా మారింది. దీంతో 'జూమ్' వీడియో కాన్ఫరెన్స్‌లకు ఆదరణ పెరిగింది. ఆ సమయంలో ప్రముఖ జూమ్ వీడియో కమ్యూనికేషన్స్, చైనాకు చెందిన జూమ్ టెక్నాలజీస్ సంస్థల మధ్య మదుపర్లు గందరగోళానికి గురయ్యారు. దీంతో జూమ్ టెక్నాలజీస్ కంపెనీ షేర్లు రాణించాయి. చాలాసార్లు చైనా రెగ్యులేటర్లు ఈ కంపెనీ ట్రేడింగ్‌ను నిలిపివేయాల్సి వచ్చింది. అనంతరం చైనా కంపెనీ తన సింబల్‌ను మార్చుకుంది.

**మెటా మెటీరియల్స్..:** 2021లో మెటావర్స్‌పై దృష్టిపెట్టిన ఫేస్‌బుక్ తన మాతృసంస్థ పేరు మెటాగా మార్చిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాలకు ఏమాత్రం సంబంధం లేనప్పటికీ.. ఆ సమయంలో కెనడా మెటీరియల్స్ కంపెనీ 'మెటా మెటీరియల్స్' లాభపడింది. ఈ కంపెనీ షేర్లు అమాంతం పెరిగాయి.

**లాంగ్ బ్లాక్‌చెయిన్..:** 2017లో క్రిప్టోకరెన్సీ పేరు మార్మోగిన సమయంలో 'లాంగ్ ఐలాండ్ ఐస్డ్ టీ కార్పొరేషన్' అనే కంపెనీ తన పేరులో 'బ్లాక్‌చెయిన్' అనే పదాన్ని చేర్చుకుంది. దీంతో 'లాంగ్ బ్లాక్‌చెయిన్ కార్పొరేషన్' కంపెనీ షేర్లు రాణించాయి. ఒకానొక దశలో 200శాతం వరకు పెరిగాయి.

**ఎల్‌జీ..:** గతేడాది అక్టోబరులో దక్షిణకొరియా సంస్థ ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ స్టాక్ మార్కెట్లలోకి అడుగుపెట్టింది. అది తమిళనాడుకు చెందిన ఎల్‌జీ బాలకృష్ణన్ అండ్ బ్రోస్ కంపెనీకి అనూహ్య లాభాలను తెచ్చిపెట్టింది. 'ఎల్‌జీ' పేరు విషయంలో మదుపర్లు గందరగోళానికి గురవడంతో ఈ తమిళనాడు కంపెనీ షేర్లను భారీగా కొన్నారు. ఎల్‌జీ బాలకృష్ణన్ అండ్ బ్రోస్ కంపెనీలో ఏకంగా రూ.4300 కోట్ల మేర పెట్టుబడులు పెరిగాయి. ఆ తర్వాత పొరపాటును గుర్తించిన కొందరు మదుపర్లు.. తమ సొమ్మును వెనక్కి తీసుకున్నారు.

## లోన్ల రికవరీ పేరుతో వేధించే బ్యాంకులకు అడ్డుకట్ట

### కఠిన నిబంధనలను ప్రతిపాదించిన ఆర్‌బీఐ

**దిల్లీ:** రుణాలు తిరిగి చెల్లించని సందర్భంలో వాటిని వసూలు చేసే విషయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త ప్రతిపాదనలతో ముందుకొచ్చింది. లోన్ల రికవరీ పేరుతో కస్టమర్లను వేధించే బ్యాంకులకు అడ్డుకట్ట వేసేందుకు కఠిన నిబంధనలను ప్రతిపాదించింది. ఈమేరకు 'కండక్ట్ ఆఫ్ రెగ్యులేటెడ్ ఎంటిటీస్ ఇన్ రికవరీ ఆఫ్ లోన్స్ అండ్ ఎంగేజ్‌మెంట్ ఆఫ్ రికవరీ ఏజెంట్స్' పేరిట ముసాయిదా నిబంధనలను ప్రతిపాదించింది. దీనిపై మే 31 వరకు వాటాదారులు, ప్రజల అభిప్రాయాలను సేకరించనుంది. అక్టోబర్ 1 నుంచి ఈ నిబంధనలు అమలు చేయనుంది.

**ఫోన్‌పై నియంత్రణకు నో**

వ్యక్తిగత, కారు, హోమ్‌లోన్ విషయంలో రుణగ్రహీత సకాలంలో తిరిగి చెల్లింపులు చేయనప్పుడు మొబైల్‌ఫోన్‌ను లాక్ చేయడం, దాని ఫీచర్లను నిలిపివేయడం వంటివి బ్యాంకులు చేయకూడదని పేర్కొంది. ఒకవేళ ఆ మొబైల్ ఫోన్ లేదా టాబ్లెట్‌ను కొనుగోలు చేయడానికి సదరు బ్యాంకే లోన్ ఇచ్చి ఉంటే, అప్పుడు మాత్రమే ఫోన్ ఫీచర్లను నిలిపివేసే హక్కు బ్యాంకుకు ఉంటుందని ఆర్‌బీఐ స్పష్టంచేసింది. అది కూడా సదరు లోన్ బకాయి పడి 90 రోజుల గడువు దాటి ఉండాలి. కస్టమర్‌లకు నోటీసులు ఇచ్చినా స్పందించని సందర్భాల్లోనే చర్యలు తీసుకోవాలని స్పష్టంచేసింది. ఫోన్ బ్లాక్ చేసినప్పటికీ.. ఇంటర్నెట్, ఇన్‌కమింగ్ కాల్స్, అత్యవసర సేవలు, ప్రభుత్వ ఎమర్జెన్సీ అలర్టులు నిలిపివేయకూడదని పేర్కొంది. ఒకవేళ కస్టమర్ తన బకాయిని చెల్లిస్తే గంటలోనే ఫోన్‌పై ఉన్న ఆంక్షలు తొలగించాలి. ఆలస్యమైతే గంటకు రూ.250 చొప్పున బ్యాంకే తిరిగి రుణగ్రహీతకు పరిహారంగా చెల్లించాలి.

## రూ.11 వేల కోట్లతో జెప్టో ఐపీఓ..

ప్రముఖ క్విక్ కామర్స్ సంస్థ జెప్టో తొలి పబ్లిక్ ఆఫర్‌కు వచ్చేందుకు సిద్ధమవుతోంది. జులైలో రూ.11 వేల కోట్లను మార్కెట్ నుంచి సమీకరించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. జులై 31లోపు పబ్లిక్ ఇష్యూకు రావాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఇందుకు అవసరమైన అప్‌డేటెడ్ ముసాయిదా పత్రాలను సెబీకి సమర్పించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఐపీఓకు వచ్చేందుకు కాన్ఫిడెన్షియల్ రూట్‌లో గతేడాది డిసెంబర్‌లో సెబీకి ముసాయిదా పత్రాలను జెప్టో సమర్పించింది. దీనివల్ల పోటీదారులకు మేలు చేకూర్చే సున్నిత సమాచారమేది బయటకు రాదు. ఐపీఓ దరఖాస్తు చేసుకున్నా తర్వాత ఏమైనా అభ్యంతరాలుంటే సెబీ తెలియజేస్తుంది. అందుకు అవసరమైన పత్రాలను మరోసారి కంపెనీ సమర్పించాల్సి ఉంటుంది. కాగా ఇప్పటికే జెప్టోకు ప్రత్యర్థులైన బ్లింకిట్ మాతృ సంస్థ ఎటర్నల్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ పేరెంట్ కంపెనీ స్విగ్గీ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టయ్యాయి. 2020లో అదిత్‌పలిచా, కైవల్య వోహ్రా తొలుత కిరాణాకార్ట్ పేరుతో జెప్టోను స్థాపించారు.

## ఈ ఏడాది లేఆఫ్‌లు లేనట్లే..


కృత్రిమ మేధను విస్తృతంగా వినియోగంలోకి తెస్తున్న టెక్ కంపెనీలు వేలాదిమంది ఉద్యోగులకు లేఆఫ్‌లు ప్రకటిస్తున్నాయి. ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా తన వర్క్‌ఫోర్స్‌లో 10 శాతం మందిని తొలగించే ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించింది. ఈ ఏడాదిలో మరికొంతమందిని తొలగించే అవకాశాలున్నాయని వార్తలు వచ్చాయి. అయితే ఈ ఏడాది మరిన్ని లేఆఫ్‌లు ఉండకపోవచ్చని ఉద్యోగులకు పంపిన మెయిల్‌లో సీఈఓ జుకర్‌బర్గ్ వెల్లడించారు. "విజయం దానంతట అది వచ్చేది కాదు. ఏఐ మన జీవితంలో అత్యంత ప్రభావాన్ని చూపించే సాంకేతికత. ఆ టెక్నాలజీని వేగంగా అందిపుచ్చుకునే సంస్థలే తర్వాత తరానికి ఒక మార్గం చూపిస్తాయి. ఈ కంపెనీ అభివృద్ధిలో భాగమైన వారికి గుడ్‌బై చెప్పడం ఎప్పుడూ బాధించే విషయమే. అది నేను అనుభవిస్తున్నాను" అని పేర్కొన్నారు.

## మారుతీ సుజుకీ ధరల షాక్..

### రూ.30వేల వరకు పెంపు

**దిల్లీ:** ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ వినియోగదారులకు షాక్ ఇచ్చింది. అన్ని మోడళ్లపై రూ.30వేల వరకు ధరలు పెంచుతున్నట్లు గురువారం ప్రకటించింది. జూన్ నుంచి ఈ పెంపు చేపట్టనున్నట్లు వెల్లడించింది. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని వెల్లడించింది. గడిచిన కొన్ని నెలలుగా ఖర్చుల ప్రభావాన్ని తగ్గించడానికి కంపెనీ ప్రయత్నాలు చేస్తూనే ఉందని, అనివార్య పరిస్థితుల్లో వినియోగదారులపై అధిక ప్రభావం పడకుండా ఆ భారాన్ని బదిలీ చేయాల్సి వస్తోందని ఓ ప్రకటనలో వెల్లడించింది. మారుతీ సుజుకీ ప్రస్తుతం ఎస్-ప్రెస్సో వంటి ఎంట్రీలెవల్ మోడళ్ల నుంచి ప్రీమియం యుటిలిటీ వెహికల్ అయిన ఇన్విక్టో వరకు వివిధ మోడళ్లను విక్రయిస్తోంది. వీటి ధరలు రూ.3.49 లక్షల నుంచి ప్రారంభమై రూ.28.7 లక్షల వరకు ఉన్నాయి. గతేడాది సెప్టెంబర్‌లో జీఎస్టీ 2.0 నిర్ణయం కారణంగా ఆయా కార్ల ధరలు భారీగా తగ్గాయి. ఎస్-ప్రెస్సో రూ.1.29 లక్షలు, ఆల్టో కే10పై రూ.1.07 లక్షలు, సెలిరియో రూ.94వేలు, వ్యాగనార్‌పై రూ.79 వేల చొప్పున తగ్గాయి. తాజా పెంపు నిర్ణయంతో వాటి ధరలు గరిష్ఠంగా రూ.30వేల వరకు పెరగనున్నాయి.




# ట్రంప్-కిమ్ మధ్య మళ్లీ చర్చలు ?

### మధ్యవర్తిత్వం వహించనున్న జిన్‌పింగ్





**వాషింగ్టన్:** ఇప్పటికే చైనా సెక్యూరిటీ, ప్రొటోకాల్ బృందాలు ఆ దేశంలో పర్యటించాయి. ఇరుదేశాల సంబంధాలు బలోపేతం చేసుకునే దిశగా ఈ పర్యటన జరగనుందనే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. ఉత్తరకొరియా ప్రస్తుతం అణునిరాయుధీకరణ చర్చలకు ఆసక్తి చూపడం లేదు. ఒకవేళ ఏదైనా దాడుల్లో కిమ్ మరణిస్తే.. తక్షణమే అణుదాడులు చేసేలా ఉ.కొరియా తన విధానాలను సవరించినట్లు తెలుస్తోంది. అమెరికా- ఇజ్రాయెల్ తొలిరోజు జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీంనేత అయతుల్లా అలీ ఖమేనీ సహా అనేకమంది సీనియర్ నాయకులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఉత్తర కొరియా ఈ మార్పులు చేసినట్లు తెలుస్తోంది. ఈ కొత్త విధానాలపై ఆందోళన వ్యక్తమవుతోంది.

**అమెరికాది ఆటవిక న్యాయం:** ఈ నేపథ్యంలోనే జిన్‌పింగ్ పర్యటన జరుగుతోంది. ఆంక్షలతో సతమవుతోన్న కిమ్ రాజ్యానికి చైనా నుంచి ఆర్థికసహాయం అందుతోంది. తమ మధ్య సంబంధాలు బలోపేతం చేసుకునేందుకు రెండూ చర్యలు తీసుకుంటున్నాయి. ఈ క్రమంలో ప్రాంతీయ అస్థిరతలకు చెక్ పెట్టే దిశగా.. ట్రంప్, కిమ్‌ల మధ్య మధ్యవర్తిత్వం వహించేందుకు జిన్‌పింగ్ ప్రయత్నించవచ్చని తెలుస్తోంది. ఇదిలా ఉంటే.. గతంలో ట్రంప్ అధికారంలో ఉన్న సమయంలో ఉత్తరకొరియా విషయంలో పట్టువిడుపులతో వ్యవహరించారు. 2019లో వియత్నాంలో ట్రంప్-కిమ్‌జోంగ్ ఉన్ భేటీ అయ్యారు కానీ, అణ్వాయుధాలు వదిలేసే విషయంలో ఉ.కొరియా వెనక్కి తగ్గకపోవడంతో ఆ చర్చలు విఫలమైన సంగతి తెలిసిందే.

> అమెరికా-ఉత్తరకొరియా మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. అగ్రరాజ్యంపై దాడికి వీలుగా కిమ్ ప్రభుత్వం క్షిపణి ఇంజిన్లు, అణు ఆయుధాలను పరీక్షించడంతో అవి మరింత తీవ్రస్థాయికి చేరాయి. ఈ నేపథ్యంలో ఇరుదేశాల మధ్య చైనా అధ్యక్షుడు షీజిన్‌పింగ్ మధ్యవర్తిత్వం వహించే అవకాశం ఉందని దక్షిణకొరియా మీడియాలో వార్తలు వచ్చాయి. వచ్చే వారంలో జిన్‌పింగ్ ఉత్తరకొరియా పర్యటనకు వెళ్లనున్నారని తెలుస్తోంది. అందుకోసం సన్నాహాలు జరుగుతున్నాయి.

## అమెరికాలో వృద్ధులను మోసం చేస్తున్న భారత్ కాల్‌సెంటర్ మూసివేత

భారత్ కేంద్రంగా పనిచేస్తూ.. వృద్ధులను మోసం చేస్తున్న ఓ కాల్‌సెంటర్ కార్యకలాపాలను అమెరికాలో మూసివేయించారు. వందల మంది వృద్ధుల నుంచి మిలియన్ల కొద్దీ డాలర్లలో ఈ సంస్థ దోచుకొన్నట్లు ఆరోపణలున్నాయి. దీనిపై ఏళ్లతరబడి దర్యాప్తు నిర్వహించిన ఎఫ్‌బీఐ ఐదుగురు టెలీమార్కెటింగ్ మోసగాళ్ల నేరాలను నిరూపించింది. ఈ మేరకు బుధవారం సోషల్ మీడియాలో బోస్టన్‌లోని ఎఫ్‌బీఐ దీనిని ప్రకటించింది. మియామీకి చెందిన ఆడమ్ యంగ్, లాస్ వేగాస్‌కు చెందిన హారిసన్ గెవిర్ట్జ టెలీకమ్యూనికేషన్ సంబంధిత సేవలను అందించే ఓ కంపెనీని నడుపుతున్నారు. ఆ కంపెనీ కాల్ రూటింగ్, టెలిఫోన్ నంబర్స్, కాల్ ట్రాకింగ్, కాల్ ఫార్వర్డ్ సర్వీసులు అందించేది. తమ సంస్థలో మోసాలు జరుగుతున్నట్లు యంగ్, హారిసన్‌లకు తెలుసు. 2020లో దర్యాప్తు ప్రారంభమవడంతో మరో ఐదుగురు భారతీయుల పేర్లు బయటకు వచ్చాయి. వీరిలో సాహిల్ నారంగ్, చిరాగ్ సచిదేవ్, అబ్రార్ అన్జుమ్, మనీష్‌కుమార్ ఉన్నారు. వీరంతా అమెరికన్లే లక్ష్యంగా భారత్ కేంద్రంగా చేసుకొని టెలీమార్కెటింగ్ మోసాలకు పాల్పడుతున్నారు. వీరితోపాటు జగ్మీత్ సింగ్ విర్క్ అనే వ్యక్తిపైనా నేరం నిరూపణ అయినట్లు ఎఫ్‌బీఐ పేర్కొంది.



## ఎట్టకేలకు చైనాలోనూ టెస్లా సెల్ఫ్ డ్రైవింగ్ కార్లు

**బీజింగ్:** అమెరికాకు చెందిన ప్రముఖ కార్ల తయారీ కంపెనీ టెస్లాకు చైనాలో ఎట్టకేలకు లైన్‌క్లియర్ అయ్యింది. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత తన పూర్తి స్థాయి సెల్ఫ్ డ్రైవింగ్ టెక్నాలజీనిని చైనాలో ప్రారంభిస్తున్నట్లు టెస్లా వెల్లడించింది. చైనా నియంత్రణ సంస్థల నుంచి ఆమోదం లభించిన నేపథ్యంలో ఈ ప్రకటన చేసింది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమావేశమైన సంగతి తెలిసిందే. ఈ శిఖరాగ్ర సదస్సులో చైనా వెళ్లిన వ్యాపార బృందంలో ఎలాన్ మస్క్ కూడా ఉన్నారు. ఈ భేటీ అనంతరం టెస్లాకు అనుమతులు రావడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఫుల్లీ సెల్ఫ్ డ్రైవింగ్ సిస్టమ్ చైనా సహా పలు దేశాల్లో అందుబాటులోకి వచ్చినట్లు టెస్లా ప్రకటించింది. ప్రీప్రోగ్రామ్డ్ రూల్స్, సెన్సార్లతో కాకుండా.. ఏఐ ఆధారిత వ్యవస్థ ద్వారా టెస్లా సెల్ఫ్ డ్రైవింగ్ కార్లు పనిచేస్తాయి. సెల్ఫ్ డ్రైవింగ్ కార్లకు అనుమతి లభించిన నేపథ్యంలో చైనాలో టెస్లా కార్ల అమ్మకాలు పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. చైనాకు చెందిన పలు కార్ల తయారీ కంపెనీలూ ఇదే తరహా టెక్నాలజీని అందిపుచ్చుకున్నాయి. కానీ, మాత్రమే టెస్లా తరహాలో ప్రదర్శన చేస్తుండడం గమనార్హం. దీంతో అమెరికా, చైనా కంపెనీల మధ్య టెక్నాలజీ విషయంలో పోటీ మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. అమెరికా, కెనడా, మెక్సికో సహా 10 దేశాల్లో టెస్లా సెల్ఫ్ డ్రైవింగ్ వ్యవస్థ అమలవుతోంది.

## అంతర్జాతీయ వేదికపై పాకిస్థాన్‌కు మళ్లీ భంగపాటు

### దయాది నరమేధ చర్యలను ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో ఎండగట్టిన భారత్

న్యూయార్క్(జనంసాక్షి): అంతర్జాతీయ వేదికపై పాకిస్థాన్ మళ్లీ భంగపాటు తప్పలేదు. ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో భారత్‌పై నిందలు మోపేందుకు పాక్ ప్రయత్నించింది. అయితే, భారత్ వీటిని గట్టిగా తిప్పికొట్టింది. అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోవడంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. సాయుధ ఘర్షణల్లో పౌరులకు రక్షణ కల్పించే అంశంపై ఐరాసలో బహిరంగ చర్చ జరిగింది. ఈ సందర్భంగా పాక్ ప్రతినిధి జమ్మూకశ్మీర్ అంశాన్ని ప్రస్తావించారు. దీన్ని ఐరాసలోని భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీష్ గట్టిగా తిప్పికొట్టారు. నరమేధ చర్యలకు పాల్పడే దేశం.. భారత అంతర్గత విషయాల గురించి ప్రస్తావించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ ఏడాది ఆరంభంలో అఫ్గానిస్థాన్‌పై పాక్ జరిపిన దాడుల గురించి హరీష్ ప్రస్తావించారు. పవిత్ర రంజాన్ మాసంలో కాబుల్‌లోని ఓ ఆస్పత్రిపై జరిగిన దాడిని ప్రపంచం ఇంకా మరిచిపోలేదన్నారు. ఈ అమానుషమైన హింసాకాండలో 269 మంది ప్రాణాలు కోల్పోగా.. మరో 122 మంది గాయపడినట్లు తెలిపారు. 'చీకట్లో అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకుంటూ.. అంతర్జాతీయ చట్టాల గురించి మాట్లాడటం పాక్ కపటత్వానికి నిదర్శనం' అని విమర్శించారు.

## 'అక్టోబర్ 7' హంతకులపై ఇజ్రాయెల్ 'నీలీ' నీడ..



ఇప్పుడు ఇజ్రాయెల్ మరో రాత్ ఆఫ్ గాడ్ ఆపరేషన్‌ను చేపట్టినట్లు తెలుస్తోంది. 'అక్టోబర్ 7' నర మేధంలో పాల్గొని ఇజ్రాయెలీల ప్రాణాలు తీసి.. మహిళలపై అత్యాచారాలకు పాల్పడిన వారిని వెతికి.. వేటాడి మరీ మట్టుబెడుతోంది. ఇజ్రాయెల్ టార్గెట్ లిస్ట్ వేలల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇందు కోసం ఏకంగా టాస్క్‌ఫోర్స్‌నే ఏర్పాటుచేసి.. అత్యాధునిక టెక్నాలజీని ఇజ్రాయెల్ వాడుతోంది. 1972 మ్యూనిచ్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న 11 మంది ఇజ్రాయెల్ అథ్లెట్లను పాలస్తీనా 'బ్లాక్ సెప్టెంబర్' గ్రూప్ హత్య చేసింది. ఈ దారుణానికి సూత్రధారులు, పాత్రధారులను మట్టుబెట్టేందుకు అప్పట్లో ఆపరేషన్ 'రాత్ ఆఫ్ గాడ్'ను ఇజ్రాయెల్ చేపట్టింది. ఇరవై ఏళ్ల పాటు శ్రమించి దాదాపు 12 నుంచి 20 మంది వరకు హంతకులను మట్టుబెట్టింది. 2023 అక్టోబర్ 7వ తేదీ ఒక్కరోజే హమాస్ మిలిటెంట్లు చేసిన దాడిలో ఇజ్రాయెల్‌లోని వివిధ ప్రాంతాల్లో 1200 మంది ప్రాణాలు కోల్పోగా.. దాదాపు 250 మందిని బందీలుగా గాజాకు తరలించారు. ఆ సమయంలో ఇజ్రాయెల్ ఓ కీలక నిర్ణయం తీసుకొంది. దాడిలో ప్రత్యక్షంగా పాల్గొన్న వారిని ఏమాత్రం క్షమించకూడదని భావించింది. దీనికోసం ఏకంగా ఓ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటుచేసింది. దానికి 'నీలీ' అని పేరు పెట్టింది. హిబ్రూ భాషలో 'ఇజ్రాయెల్‌లో శాశ్వతమైన వ్యక్తి అబద్ధం చెప్పడు' అని అర్థం. తొలి ప్రపంచయుద్ధంలో ఈ పేరును యూదు గూఢచారులు వాడేవారు. ఇజ్రాయెల్ సరిహద్దు పొడవునా జరిగిన దాడులకు సంబంధించిన పలు వీడియోలను చిత్రీకరించిన హమాస్ మిలిటెంట్లు సోషల్ మీడియాలో విడుదల చేశారు. తాము ఇజ్రాయెల్‌పై దాడి చేసినట్లు చెప్పుకోవడానికి ఆ సమయంలో చేసిన ఫోన్లను ఐడీఎఫ్ దళాలు గుర్తించాయి. నిందితుల పేర్లను గుర్తించేందుకు ముఖ గుర్తింపు టెక్నాలజీ, సెల్ టవర్ లొకేషన్లు, గాజా బందీల ఇంటరాగేషన్ల ద్వారా వందల మంది వివరాలను సేకరించాయి. సోషల్ మీడియా వీడియోలను ఇజ్రాయెల్ మిలిటరీ ఇంటెలిజెన్స్, షిన్‌బెట్ (ఇజ్రాయెల్ అంతర్గత రక్షణ సంస్థ) ఇతర సెక్యూరిటీ సర్వీసులు క్షుణ్ణంగా అధ్యయనం చేశాయి. ఒక అనుమానితుడికి వ్యతిరేకంగా కనీసం రెండు ఆధారాలు దొరికినా అతడిని అంతం చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. చివరికి ఇజ్రాయెల్ కంచెలను కూల్చేందుకు ట్రాక్టర్లు నడిపిన డ్రైవర్లను కూడా వదల్లేదని అమెరికా మీడియా కథనంలో వెల్లడించింది. అక్టోబర్‌లో హమాస్‌తో కాల్పుల విరమణ జరిగి, చివరి బందీని విడుదల చేసినా.. ఈ ఆపరేషన్ మాత్రం ఆగలేదు.


**దొరికితే ప్రాణాలు గాల్లోకే..**

గత శుక్రవారం హమాస్ టాప్ లీడర్ ఎజ్జెదిన్ అల్ హద్దాద్‌ను ఐడీఎఫ్ దళాలు అంతం చేశాయి. అతడు అక్టోబర్ 7 దాడిని ప్లాన్ చేసిన నాయకుల్లో ఒకడు. ఈ నిందితులను అంతం చేసేవరకు ఇజ్రాయెల్ దాడులు ఆగవని మిలిటరీ చీఫ్ జమీర్ పేర్కొన్నారు. నోవా మ్యూజిక్ ఫెస్టివల్‌పై దాడి చేసిన హమాస్ ప్లాటూన్ కమాండర్ అలీ సమీ మహమ్మద్ షక్రాను ఏప్రిల్ 12న ఇజ్రాయెల్ దళాలు హతమార్చాయి. అతడు అక్టోబర్ 7 దాడిలో పాల్గొన్న ఫొటోను కూడా విడుదల చేశాయి. ఇక కిబుట్జ్ నిర్ ఓజ్‌పై దాడి చేసిన అబ్ద్ అల్ రహమాన్ అమ్మర్ హసన్ ఖుదారీని మరో మూడ్రోజుల తర్వాత మట్టుబెట్టాయి. ఇజ్రాయెల్ పెద్ద టార్గెట్లలో ఒకరైన హమాస్ నాయకుడు సలేహ్ అల్ అరౌరీ 2024 నూతన సంవత్సరం రోజున తుర్కియే నుంచి లెబనాన్ వచ్చాడు. అతడిని సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని హెజ్‌బొల్లా హెచ్చరించింది. కానీ, అరౌరీ ఆరుగురు హమాస్ సభ్యులతో సమావేశం అయ్యాడు. కానీ, అరౌరీ ఆరుగురు హమాస్ సభ్యులతో సమావేశం అయ్యాడు. ఈ విషయం తెలియడంతో ఇజ్రాయెల్ ఫైటర్ అత్యంత కచ్చితత్వంతో అతడి భవనంపై దాడి చేయగా, అందరూ చనిపోయారు. ఆ గదిలో ల్యాప్‌ట్యాప్‌లు, ఫోన్లు ఉన్నట్లు తర్వాత గుర్తించారు. ఆ తర్వాత ఆరు నెలలకు హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియేను ఇరాన్‌లోని ఐఆర్‌జీసీ గెస్ట్ హౌస్‌లోనే ఇజ్రాయెల్ హత్య చేసింది. ఆ తర్వాత కూడా 'నీలీ' టాస్క్ ఫోర్స్ వేట అక్టోబర్ 7 నిందితుల కోసం కొనసాగుతూనే ఉంది.

## ప్రచండ భానుడు

సూర్యాపేట జిల్లా మునగాలలో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మార్కాపురం జిల్లా కనిగిరిలో అత్యధికంగా 48.3 డిగ్రీలు నమోదు కాగా, కృష్ణా జిల్లా కంకిపాడులో 47.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏలూరు జిల్లా చింతలపూడిలో 47.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు, పల్నాడు జిల్లా అచ్చంపేటలో 47.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు, ఎన్టీఆర్ జిల్లా నందిగామలో 47.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు, ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లలో 46.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు, బాపట్ల జిల్లా ఇంకొల్లులో 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యాయి. ఏపీలోని వేటపాలెం (బాపట్ల), నందివాడ (కృష్ణా)ల్లో 47.6 డిగ్రీలు, ఎన్టీఆర్ జిల్లా తొర్రగుడిపాడు, ప్రకాశం జిల్లా అద్దంకిలో 47.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఏలూరు జిల్లా అల్లిపల్లిలో 47.3 డిగ్రీలు, నందనమారెళ్ల (మార్కాపురం)లో 46.6, కూనవరం (పోలవరం)లో 46.5, కావలి (శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు)లో 46.4, తెనాలి (గుంటూరు)లో 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని 18 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. 20 జిల్లాల్లోని 200 మండలాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సోమవారం వరకు ఎండల తీవ్రత కొనసాగనుందని అధికారులు తెలిపారు. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లిలో 46.4, మహబూబాబాద్ జిల్లా కురవిలో 46.3, ఆదిలాబాద్ జిల్లా జైనథ్‌లో 46.2, సిద్దిపేట జిల్లా అక్కన్నపేట్‌లో 46.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని 20 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలు దాటాయి. భానుడి భగభగలతో జనం ఇంటి నుంచి కాలు బయట పెట్టడానికి భయపడుతున్నారు. ఏమైనా అత్యవసర పరిస్థితి ఎదురైనా ఎండలకు హడలిపోతున్నారు.

# పోరుగడ్డపై అక్రమాల పొంగులు



## రంగురంగుల బ్రోచర్లతో వెంచర్ల నయా వ్యాపారం

- పర్మిషన్లు కొన్ని.. కార్యకలాపాలు ఎన్నో..
- అనుమతులు లేకుండానే ప్లాట్ల అమ్మకాలు
- అన్నీ తెలిసిన అధికార యంత్రాంగంపై అనేక ఆరోపణలు

**నల్లగొండ ప్రతినిధి, మే 21 (జనంసాక్షి):** నల్లగొండ జిల్లా కేంద్రం మున్సిపాలిటీ నుండి మున్సిపల్ కార్పొరేషన్ గా ఏర్పడి మహా నగరంగా రూపు దిద్దుబాటు జరుగుతున్న వేళ అక్రమార్కులకు దోచుకున్నోడికి దోచుకున్నంతగా ఉంది వ్యవహారం. అక్రమ వెంచర్లు పుట్టలు పుట్టలుగా వెలుస్తున్నాయి. అడ్డు అదుపు లేకుండా ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమ లే ఔట్లతో మూడు పువ్వులు ఆరు కాయలు అనే రీతిలో జోరుగా రియల్ వ్యాపారం జరుగుతుంది.

నల్లగొండ కార్పొరేషన్ ఏర్పడిన తరువాత రియల్ వ్యాపారులు కొందరు అక్రమ మార్గమే సక్రమ మార్గంగా ఇష్టమైన రీతిలో వెంచర్లు ఏర్పాటు చేస్తూ వాటికి ఉండవలసిన కనీస అనుమతులు లేకుండా ముఖ్యంగా డిటిసిపి, మున్సిపల్ కార్పొరేషన్ లే ఔట్లు పర్మిషన్, రేరా,ఎల్పీ నెంబర్ లేకుండా అలాగే నాలా కన్వెన్షన్ చేయకుండా ప్రభుత్వ భూములు కూడా కబ్జా చేసి సామాన్య ప్రజలకు ఆశ చూపి అమ్మకాలు చేస్తున్నారని బలమైన ఆరోపణలు వస్తున్నాయి. ఒకవైపు కొంత మాత్రమే పర్మిషన్లు తీసుకొని రంగు బ్రోచర్లు వేసి పెద్దఎత్తున మార్కెటింగ్ చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారనే ఆరోపణలు తరచూ వస్తూనే ఉన్నాయి. కానీ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదని తెలుస్తోంది.

### అనధికార లే ఔట్లు వెలుగులోకి..

నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 44వ డివిజన్ లోని అఫ్జల్ నగర్ హైదర్‌ఖాన్ గూడలో సర్వే నెంబర్ 141లో సుమారు 2000 వేల గజాల స్థలంని 15 ప్లాట్లుగా చేసి అమ్ముతున్నారని, అలాగే నాలా కన్వర్షన్ చేసి డిటిసిపి అప్రూవల్, మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ పర్మిషన్ లేకుండనే ప్లాట్లు నెంబర్లు వేసి బాజప్తా అమ్మకాలు చేస్తున్నారు. రోడ్డు కూడా 20 ఫీట్లకు మాత్రమే వదిలి వారికి ఇష్టానుసారంగా లే ఔట్ మ్యాప్ లు వేసుకొని సుమారు గజం 17 వేలుపైగా అమ్మకానికి పెట్టినట్లు తెలుస్తుంది. దీంతో అటు ప్రభుత్వానికి కట్టాల్సిన పన్నులను ఎగ్గొడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.

### అధికారుల మౌనం వెనుక అంతర్యం ఏమిటి?

నల్లగొండలో అనధికార వెంచర్లు ఏర్పాటులో అధికారుల హస్తం ఉందా అంటే ఉండే ఉంటుందనే ఆరోపణలు కూడా వస్తున్నాయి. ఇంతగా ఏర్పడుతున్న వెంచర్లు అన్ని కూడా వారికి తెలియకుండా ఉంటుందా అని వారి కనుసన్నల్లోనే నడుస్తున్నాయని గుసగుసలు వినిపిస్తున్నాయి. చిన్న గోడ కట్టాలి అంటే ఎన్నో అనుమతులు తీసుకోవాలని, వెంట పడి మరీ కట్టించుకునే మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కోట్ల రూపాయల వ్యాపారం చేస్తున్న వెంచర్ల వద్ద ఎలాంటి అనుమతులు ఉన్నాయని ప్రశ్నించకుండా మౌనం వ్యవహరించడం వెనుక ఏదో పెద్ద హస్తం ఉంది. అందుకే మౌనంగా ఉంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులు చోద్యం చేస్తున్నారని మరి అనధికార లే ఔట్లు ప్లాట్లుగా చేసి రిజిస్ట్రేషన్ చేస్తున్న రిజిస్ట్రేషన్ అధికారులు ఏం చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తం అవుతు న్నాయి. ఇకనైనా కళ్ళు తెరిచి సక్రమంగా ఉన్న వెంచర్లకు మాత్రమే రిజిస్ట్రేషన్ చేయాలని, అలాగే అనుమతులు లేని వెంచర్ల మీద మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు.






### అక్రమ లే ఔట్లు చేస్తే కఠిన చర్యలు : కృష్ణవేణి, టౌన్ ప్లానింగ్ అధికారిణి

ప్రభుత్వ అనుమతులు, ముఖ్యంగా మున్సిపల్ కార్పొరేషన్ అనుమతులు తీసుకోకుండా వెంచర్లు ఏర్పాటు చేసినా, వాటిని రిజిస్ట్రేషన్ చేయించినా కఠిన చర్యలు ఉంటాయి. ప్రభుత్వ ఆదాయంకి నష్టం కలిగించే పనులు ఎవరు చేయవద్దు. అలాంటి అనధికార ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయొద్దు.






# జవహర్ నగర్ డంప్‌యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం

- ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అఖిలపక్ష సమావేశం
- అభివృద్ధి, కాలుష్య నివారణపై కీలక చర్చ
- ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయం అవసరం
- రామ్కీ సంస్థ పనితీరుపై విమర్శలు



**సికింద్రాబాద్, మే 20 (జనంసాక్షి):** జవహర్ నగర్ డంప్‌యార్డ్ సమస్యలను తక్షణమే పరిష్కరించి, పరిసర ప్రాంత ప్రజలను కాలుష్య కోరల నుంచి రక్షించాలని పలువురు ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జవహర్ నగర్ డంప్‌యార్డ్ సమస్యలు, అభివృద్ధి పనులపై ముఖ్య మంత్రి ఆదేశాల మేరకు అఖిలపక్ష సమావేశం నాగోల్ లోని స్వాగత్ గ్రాండ్ హోటల్‌లో మంగళవారం నిర్వహించారు. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో హెచ్ఎండీఏ అభివృద్ధి పనులను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జవహర్ నగర్ డంప్‌యార్డ్ వల్ల భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని, రోడ్ల పరిస్థితి దయనీయంగా ఉందని, తాగునీటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని ప్రజా ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. రామ్కీ సంస్థ డంప్‌యార్డ్ నిర్వహణ సరిగా చేయడం లేదని విమర్శించారు.

మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

డంప్‌యార్డ్ సమస్యను స్థానిక స్థాయిలో పరిష్కరించాలని, చెత్త సేకరణ, నిర్వహణలో మెరుగుదల అవసరమని, సీఎస్ఆర్ నిధులను స్థానిక అభివృద్ధికి వినియోగించాలని నాయకులు సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమని సమావేశంలో అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ సుమతి, డీసీసీ అధ్యక్షులు, మాజీ మేయర్లు, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు మధ్య దళారులను ఆశ్రయించి మోసపోవద్దు

- వరి ధాన్యం అమ్మేందుకు వచ్చే రైతులకు, మజ్జిగ, నీళ్లు పంపిణీ
- ఆమనగల్ పిఏసిఎస్ చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా



**కడ్తాల్ మే 21 (జనంసాక్షి):** రైతన్నలు మధ్య దళారులను ఆశ్రయించకుండా నేరుగా ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఆమనగల్లు మార్కెట్ యార్డ్ ఆవరణలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకువచ్చి ధాన్యాన్ని అమ్ము కోవచ్చని డిసిసిబి డైరెక్టర్,ఆమనగల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా కోరారు. గురువారం మార్కె ట్ యార్డు ఆవరణలో వరి ధాన్యం అమ్మేందుకు వచ్చిన రైతన్నల కోసం గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంచినీళ్ల బాటిళ్లు,మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు గంప వెంకటేష్ గుప్తా తెలిపారు.గురువారం రైతులకు నీళ్ల బాటిళ్లు,మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులెవ్వ రు అధైర్య పడొద్దు చివరి గింజ వరకు వరి ధాన్యాన్ని కొనుగోలుకు ప్రాథమిక సహకార సిబ్బంది సిద్ధంగా ఉన్నారని గుర్తు చేశారు.రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని దీనితో పాటు సన్న రకం వడ్లకు రూ.500 బోనస్ ప్రభుత్వం చెల్లిస్తుందని ఆయన వివరించారు.మార్కెట్ యార్డ్ ఆవరణలో రైతుల కోసం అన్ని రకాల ఏర్పాట్లు చేయడం జరిగిందని మరో సారి ఆయన గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో సింగల్ విండో వైస్ చైర్మన్ ధోనాదుల సత్యం,ఆమనగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్లు పాపిశెట్టి రాము,దుద్దు ఆంజనేయులు, ఎనుముల రమేష్,ఎంగలి భాగ్యలక్ష్మి రఘు,నాగిళ్ల జగన్, అనూష శ్రీశైలం,రామ్ నుంతల సర్పంచ్ శ్రీను నాయక్, మాజీ ఎంపీటీసీ లచ్చిరాం నాయక్,బిఆర్ఎస్ నాయకులు సయ్యద్ ఖలీల్,సైదులు గౌడ్,పాండు,వేణు,ఏఈవోలు మీనాక్షి భూదేవి,సింగల్ విండో సీఈఓలు పద్మాకర్ రెడ్డి,దేవేందర్,సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

### మూడు గ్రామాల్లో ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేసిన జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాగ్యలక్ష్మి



**చిగురుమామిడి మే21(జనంసాక్షి):** రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు మాత్రమే విక్రయించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాగ్యలక్ష్మి తెలిపారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలో విత్తనాలు,ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి ఆకస్మిక తనిఖీ చేశారు. మండలంలోని సుందరగిరి,బొమ్మనపల్లి,రేకొండ గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి రికార్డ్స్ ను,ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు.ఎరువులు, నాణ్యమైన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు.రైతులకు విత్తనాలు కొనుగోలు సమయంలో తప్పనిసరిగా రసీదు అందించాలని,మండలానికి పచ్చిరొట్ట ఎరువులు 330క్వింటల్ల జీలుగ విత్తనాలు,50క్వింటళ్ల జనుము విత్తనాలు మంజూరు అయినట్టు తెలిపారు.అలాగే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రైతు పథకాలు పొందాలంటే ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకొవాలని మండల తెలిపారు. ఇందులో మండల వ్యవసాయ అధికారి పున్నంచందర్, ఏఈఓలు సాయికుమార్, అఖిల, పాల్గొన్నారు.

# మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి ఘన నివాళి

### ఆధునిక భారత స్వప్నికుడు సంస్కరణల సృష్టికర్త రాజీవ్ గాంధీ

**కమ్మర్పల్లి మే 21(జనంసాక్షి) :** భారత రత్న భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం రోజున మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆధునిక భారత నిర్మాణంలో రాజీవ్ గాంధీ చూపిన బాట నేడు ప్రతి ఒక్కరూ ఎంతో స్ఫూర్తిదాయకంతో తీసుకోవాలని సూచించారు.18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కీలక సంస్కరణలు తీసుకువచ్చిన వ్యక్తి ఆయనని ఆయన సేవలను దేశం ఎన్నటికీ మరువదని కొనియాడారు.ఆనాడే ఐటీ రంగాన్నీ,టెలి కమ్యూనికేషన్, సాంకేతికత,గ్రామీణ అభివృద్ధి,ఆర్థిక సంస్కరణలు దేశ ప్రగతికి మూల స్తంభాలని చెప్పినా గొప్ప నాయకుడు రాజీవ్ గాంధీ అని గుర్తు చేసుకొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బోనగిరి భాస్కర్,మార్కెట్ కమిటీ చైర్మన్ పాలేపు నర్సయ్య,వైస్ చైర్మన్ బుచ్చన్న,మాజీ మండల అధ్యక్షుడు సుంకేట రవి,డిసిసి నాయకులు మురళి,తిప్పి రెడ్డి శ్రీనివాస్,తక్కురి దేవేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సల్లూరి గణేష్ గౌడ్,అల్లకుంట రాజేష్,వన్నెల రాజేశ్వర్,నిమ్మ రాజేంద్రప్రసాద్,అజ్మీత్ పాషా, సంపంగి నాగరాజు, గణేష్,సుమన్,విజయ్,నరేష్,అజార్ తదితరులు పాల్గొన్నారు

# ఏఐకేఎంఎస్ 11వ జిల్లా మహాసభను విజయవంతం చేయాలి

- మే 23న మోపాల్ మండల కేంద్రంలో
- రైతు వ్యతిరేక విధానాలను ఖండించిన భూమయ్య
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్ర విమర్శలు
- రైతులు, కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి



**నిజామాబాద్ అర్బన్, మే 21 (జనంసాక్షి):** అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా 11వ మహాసభను ఈ నెల 23న శనివారం మోపాల్ మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య ప్రకటించారు. గురువారం సాయినగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో భూమయ్య మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక చర్యలు చేపడుతున్నాయని ఆరోపించారు. రైతులు ఎన్నడూ లేని విధంగా వ్యవసాయ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని, యూరియా కొరత, ధాన్యం అమ్మకాల్లో ఇబ్బందులు, తడిసిన ధాన్యం సమస్యలు తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. రేవంత్ రెడ్డి సర్కారు జిల్లాలో మూతపడిన చక్కెర ఫ్యాక్టరీలను తెరిపిస్తామని ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం రైతులను మోసం చేసినట్లే అని విమర్శించారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని మంచిప్ప 21 ప్యాకేజీ పనులకు నిధులు ఇవ్వకుండా పెండింగ్‌లో ఉంచుతున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న కొత్త చట్టాలు రైతులను భూముల నుంచి, వ్యవసాయం నుంచి దూరం చేస్తున్నాయని, నూతన విత్తన చట్టం, విద్యుత్ చట్టం, ఉపాధి పనుల్లో జీరామ్ చట్టాలు రైతు వ్యతిరేకమని మండిపడ్డారు. ఈ విధానాలను ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 23న జరిగే జిల్లా మహాసభకు రైతులు, రైతు కూలీలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని భూమయ్య పిలుపునిచ్చారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వి. కోటేశ్వరరావు, అధ్యక్షులు మామిడాల బిక్షపతి, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు అగ్గు ఎర్రన్న, న్యూ డెమోక్రసీ కార్యదర్శి బండమీది నరసయ్య, అగ్గు చిన్నయ్య, గుడ్డోల్ల గంగాధర్, వేల్పూర్ భూజేందర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

### గంజాయి, సిగరెట్లు, గుట్కా, మద్యం

# అమ్మకాలపై ఆ గ్రామంలో.. నిషేధం

- ఎడపల్లి పంచాయతీ సాహసోపేత నిర్ణయం
- అమ్మినా, సేవించినా రూ.10 వేల జరిమానా
- సమాచారం ఇచ్చేవారికి రూ.5 వేల బహుమతి
- 18 ఏళ్లలోపు వారికి అమ్మకాలపై కఠిన చర్యలు

**ఎడపల్లి, మే 21 (జనంసాక్షి):** ఎడపల్లి మేజర్ గ్రామపంచాయతీ పాలకవర్గం గ్రామ యువత, పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సాహసోపేత నిర్ణయం తీసుకుంది. గ్రామంలో గంజాయి అమ్మకాలు, సేవన, 18 ఏళ్లలోపు వారికి సిగరెట్లు, గుట్కాలు, మద్యం అమ్మకాలపై జరిమానాలు విధించే తీర్మానాలు చేసింది. గురువారం జరిగిన పాలకవర్గ సమావేశంలో సర్పంచ్ కందగట్ల రామచందర్, ఉపసర్పంచ్ మచ్కూర్ గంగాధర్, పాలకవర్గ సభ్యులు రెండు ముఖ్య తీర్మానాలు చేశారు. గ్రామంలో గంజాయి అమ్మినా, సేవించినా సమాచారం ఇచ్చేవారికి రూ.10 వేల బహుమతి, సమాచారం గోప్యంగా ఉంచుతామని తీర్మానించారు. అలాగే 18 ఏళ్లలోపు వారికి సిగరెట్లు, గుట్కాలు, మద్యం అమ్మిన షాపు యాజమాన్యానికి రూ.10 వేల జరిమానా, సమాచారం ఇచ్చేవారికి రూ.5 వేల బహుమతి ఇవ్వాలని నిర్ణయించారు. ఈ నిర్ణయాలను అతిక్రమించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని సర్పంచ్ రామచందర్ హెచ్చరించారు. గ్రామ యువత, పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు పాలకవర్గం వివరించింది. ఈ తీర్మానాలు గ్రామంలో మత్తు పదార్థాల వ్యాప్తిని అరికట్టడంలో కీలకం అవుతాయని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



# కమిషన్ల సర్పంచ్..?

### ట్రాక్టర్‌కు నాకింత అంటూ వసులు.?

### పేరుకే అభివృద్ధి పనులకు పేరుతో అక్రమ ఎర్రమట్టి దందా

**నవాబ్ పేట్ మే 21( జనం సాక్షి) :** అభివృద్ధి పనులు అడ్డుపెట్టుకొని మండలంలోని చిట్టిగిద్ద గ్రామ సమీపం నుండి స్థానిక సర్పంచ్ ఎర్రమట్టి అక్రమ దందా సాగిస్తున్నాడు.గ్రామంలో అభివృద్ధి పనులు చేస్తున్ననని గ్రామ ప్రజలను మభ్యపెడుతూ ట్రాక్టర్,టిప్పర్ యజమానులతో కుమ్మక్కై ఎలాంటి అనుమతులు లేకుండా ఎర్రమట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నాడు.ఒక్కో ట్రాక్టర్ కు సుమారు రూ.3వేలు, టిప్పర్‌కు రూ.6వేల వరకు ట్రాక్టర్, టిప్పర్ యజమానులతో మాట్లాడి దానిలో కూడ కమిషన్ సర్పంచ్ శ్రీధర్ రావు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఎవరైనా అధికారి సమాచారం తెలుసుకొని విచారణకు రాగ గ్రామంలో రోడ్డు వేస్తున్నామని, పలు అభివృద్ధి పనులకు మట్టిని వాడుకుంటున్నామని సర్పంచ్ శ్రీధర్ రావు చెప్పుకొస్తున్నారు.కనీసం మండల సంబంధిత అధికారులు సమాచారం లేకుండా ఎర్రమట్టి అక్రమ రవాణా చేస్తున్న కూడా ఆ సర్పంచ్‌పై ఏ అధికారి చర్యలు తీసుకోవడం లేదంటే ఆయన వెనుక రాజకీయ అండదండాలు ఉన్నాయనే వినికిడి వినిపిస్తుంది.

### ఆ సర్పంచ్‌కి ఎర్రమట్టితో దందాకు సంబంధం ఉందా..?

చిట్టిగిద్ద సర్పంచ్‌కి ఎర్రమట్టి దందాకు సంబంధం ఉందా..? ఒకవేళ సంబంధం లేకపోతే తరలిస్తున్న చోట ఆ సర్పంచ్ ఎందుకు ఉన్నట్లు..? మట్టి దందాను ఆ సర్పంచ్ ఆపడానికి వస్తే సంబంధిత అధికారులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదు..?ఎర్రమట్టిలో సర్పంచ్ శ్రీధర్ రావుకు పర్సంటేజ్ వస్తున్నందుకే ఎర్రమట్టి సహకరిస్తున్నట్లు పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులకు సమాచారం ఇస్తే తాను చేసే దందా బయటపడుతుందని చెప్పకుండా గుట్టు చప్పుడుగా ఎర్రమట్టి దందా కొనసాగిస్తున్నట్లు తెలుస్తుంది.

### అవును తరలించిన..

అవును ఎర్రమట్టి పట్టా తరలించాను.ఆ భూమి పట్టాదారును అడిగిన అధికారుల పర్మిషన్ మాకెందుకని చిట్టిగిద్ద సర్పంచ్ తెలపడం విమర్శలకు తవిస్తుంది.అధికారులకు కూడా చెప్పిన అని ఆయన చెప్పారు.అంటే ఈ మట్టి దందాలో అధికారులకు కూడా పర్సంటేజీలు వెళ్తున్నాయానే సందేహాలు వెల్లువెత్తుతున్నాయి.

# సబ్ స్టేషన్ భూమిని కబ్జా చేస్తున్నారు

### పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సబ్ ఇంజనీర్ అధికారులపై దురుసు ప్రవర్తన

**ముత్తారం, మే 21 (జనంసాక్షి):** ముత్తారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌కు చెందిన ప్రభుత్వ భూమిని కొంతమంది అక్రమంగా కబ్జా చేస్తున్నారని మండల విద్యుత్ సబ్ ఇంజనీర్ సంతోష్ రెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.గురువారం మాట్లాడుతూ సబ్ స్టేషన్ భూమిలో కంచె ఏర్పాటు చేయడానికి వేసిన ఫోళ్లను కబ్జాదారులు ధ్వంసం చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగించడంతో పాటు అధికారులపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. భవిష్యత్తులో విద్యుత్ కార్యాలయాలకు ఆటంకాలు ఏర్పడే ప్రమాదం ఉందని, కబ్జాదారులపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు.

# ఆర్జీ-1 ఏరియాలో ఘనంగా ముగిసిన సింగరేణి వేసవి క్రీడా శిక్షణా శిబిరం

- సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండి క్రీడల్లో రాణించాలి : జీఎం డి. లలిత్ కుమార్



**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణి ఆర్జీ-1 ఏరియాలో వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి ఉచిత క్రీడా శిక్షణా శిబిరం గురువారం ఘనంగా ముగిసింది. స్థానిక జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో నెల రోజులుగా నిర్వహించిన ఈ శిబిరంలో సింగరేణి ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల పిల్లలతో పాటు పరిసర ప్రాంతాల బాలబాలిక లు పాల్గొన్నారు.ముగింపు కార్యక్రమానికి ఆర్జీ-1 ఏరియా జనరల్ మేనేజర్, వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డి. లలిత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ పూర్తి చేసిన క్రీడాకారులకు ఉచితం గా టీ-షర్టులు పంపిణీ చేశారు. సేవా అధ్యక్షురాలు అనిత లలిత్ కుమార్, ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీఎం లలిత్ కుమార్ మాట్లాడుతూ, వేసవి సెలవుల్లో నిర్వహించే క్రీడా శిక్షణ పిల్లల మానసిక, శారీరక వికాసానికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, పట్టుదల, పోటీ తత్వం పెంపొందుతాయని పేర్కొన్నారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో పిల్లలు సెల్‌ఫోన్‌లు, టీవీలకే పరిమితం కాకుండా క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు.శిబిరంలో ఫుట్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, స్విమ్మింగ్, బాక్సింగ్, కరాటే వంటి క్రీడల్లో అనుభవజ్ఞులైన కోచ్‌ల ద్వారా శిక్షణ అందించినట్లు తెలిపారు. శిక్షణ పొందిన పిల్లలు భవిష్యత్తులో ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమం లో పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, సేవా జాయింట్ సెక్రటరీ పెరుమాళ్ల రజిత, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ హెచ్. రమేష్, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ సామల సత్యనారాయణ, వివిధ క్రీడల కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
22 మే 2026

# ప్రజాధనం దుర్వినియోగం

## పెద్దమల్లారెడ్డి పంచాయతీలో బినామీ చెక్కుల భాగోతం బట్టబయలు




- 'యాదగిరి' ఖాతాలో లక్షల జమపై గ్రామస్తుల ఆగ్రహం
- సర్పంచ్-ఉపసర్పంచ్-కార్యదర్శి కుమ్మక్కు ఆరోపణలు
- 'కరోబార్' పేరుతో ప్రజాధన దుర్వినియోగంపై జడ్పీ సీఈఓ విచారణ
- రూ.2.95 లక్షల చెక్కుపై సెక్రటరీకి ప్రశ్నల వర్షం
- 'చట్టానికి విరుద్ధమే' అంటూ సీఈఓ స్పష్టీకరణ
- కఠిన చర్యల కోసం గ్రామస్తులు, వార్డు సభ్యుల డిమాండ్

**భిక్కనూరు, మే 21 (జనం సాక్షి మండల ప్రతినిధి):** భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామ పంచాయతీలో ప్రజాధన దుర్వినియోగం, బినామీ పేర్లతో చెక్కుల జారీ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే సర్పంచ్ బంధువులు, పంచాయతీ కార్యదర్శి కుమారుడి పేర్లతో లక్షలాది రూపాయలు డ్రా చేసిన ఘటన వివాదాస్పదంగా నిలిచిన తరుణంలో, తాజాగా 'కరోబార్' యాదగిరి పేరుతో భారీ మొత్తంలో చెక్కులు జారీ చేసిన అంశం మరింత కలకలం రేపుతోంది. గ్రామ పంచాయతీ నిధులను ఒకే వ్యక్తి ఖాతాలోకి మళ్లించడం వెనుక ఉన్న అసలు ఉద్దేశ్యంపై గ్రామస్తులు తీవ్ర అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టే పనులకు సంబంధించిన చెల్లింపులు నేరుగా కాంట్రాక్టర్లు, సరఫరాదారులు లేదా కూలీలకు జరగాల్సి ఉండగా, పెద్దమల్లారెడ్డిలో మాత్రం శానిటేషన్ పనుల నుంచి తాగునీటి సరఫరా, వాటర్ ట్యాంక్ నిర్వహణ వరకు అనేక ఖర్చులను 'కరోబార్' యాదగిరి పేరుతో చెక్కుల రూపంలో చెల్లించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్థానికంగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం యాదగిరిని కేవలం బినామీగా ఉపయోగించి, తెరవెనుక సర్పంచ్, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి కలిసి నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

గ్రామ వార్డు సభ్యుల ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చందర్ నాయక్ ఆధ్వర్యంలో గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సుమారు రెండు గంటల పాటు విచారణ నిర్వహించారు. ఈ విచారణలో భిక్కనూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ రెడ్డి, సర్పంచ్ కోడూరి సాయి గౌడ్, పంచాయతీ కార్యదర్శి పాత లక్ష్మి, గ్రామ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

విచారణ అనంతరం జడ్పీ సీఈఓ చందర్ నాయక్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పనుల్లో స్పష్టమైన నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు వెల్లడించారు. కొన్ని పనులు నిబంధనల మేరకు జరిగినప్పటికీ, మరికొన్ని పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా చేపట్టినట్లు తేలిందన్నారు. పూర్తి స్థాయి నివేదిక సిద్ధం చేసి పది రోజుల్లోగా జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామని తెలిపారు.

విలేకరుల సమావేశంలో పంచాయతీ కార్యదర్శి పాత లక్ష్మిని పాత్రికేయులు నిలదీశారు. తన సొంత కుమారుడు ధర్మగళ్ల సాయి కార్తీక్ పేరుపై రూ.2,95,050 విలువైన చెక్కును ఎందుకు డ్రా చేశారనే ప్రశ్నకు ఆమె సరైన సమాధానం ఇవ్వలేకపోయారు. పొంతనలేని సమాధానాలతో ప్రశ్నను తప్పించుకునే ప్రయత్నం చేయడం చర్చనీయాంశమైంది.

ఈ సందర్భంగా సర్పంచ్ లేదా కార్యదర్శి తమ కుటుంబ సభ్యులు, బంధువుల పేర్లపై చెక్కులు తీసుకోవచ్చా అనే ప్రశ్నకు స్పందించిన జడ్పీ సీఈఓ, చట్టంలో అలాంటి వెసులుబాటు లేదని, అలా చేయడం పూర్తిగా నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేశారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018 ప్రకారం ప్రజాప్రతినిధులు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పంచాయతీ పనుల్లో ఆర్థిక ప్రయోజనాలు పొందరాదని, అలా చేస్తే అనర్హత వేటు పడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్న పంచాయతీ కార్యదర్శి తన అధికార పరిధిని ఉపయోగించి కుటుంబ సభ్యులకు లబ్ధి చేకూర్చడం తీవ్రమైన అవినీతి చర్యగా పరిగణించబడుతుందని తెలిపారు.

మరోవైపు విచారణ తీరుపై ఫిర్యాదుదారులైన వార్డు సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు సర్పంచ్, కార్యదర్శిని వెనకేసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారని, విచారణ కేవలం కంటితుడుపుగా సాగిందని ఆరోపించారు. తమ బంధువుల పేర్లతో బిల్లులు తీసుకున్న ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామంలో పనులను నాణ్యతతో పూర్తి చేయలేదని మండిపడ్డారు. పది రోజుల్లోగా ఈ అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోకపోతే మళ్లీ ఉన్నతాధికారులతో పాటు అవినీతి నిరోధక శాఖను ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ఇప్పటికే గ్రామంలో మురికికాలువల సమస్యలు, తాగునీటి కొరత, పారిశుద్ధ్య లోపాలు తీవ్రంగా ఉన్నప్పటికీ, అభివృద్ధి పనులను పక్కనబెట్టి ప్రజాధనాన్ని బినామీల పేర్లతో స్వాహా చేస్తున్నారనే ఆరోపణలపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జడ్పీ సీఈఓ సమర్పించనున్న నివేదికలో ఈ 'కరోబార్ బినామీ స్కామ్'పై ఎలాంటి చర్యలు సిఫార్సు చేస్తారన్నదానిపై ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.



## మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం

**మొయినాబాద్, మే 21, జనంసాక్షి:** దివంగత నేత భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయమని చేవెళ్ల నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పామేన భీంభరత్ అన్నారు. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ లోగల రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... రాజీవ్ గాంధీ దేశాభివృద్ధికి, యువత సాధికారతకు చేసిన సేవలు అభినందనీయమన్నారు. పంచాయతీరాజ్ సంస్థలను బలోపేతం చేయడానికి కేంద్రం నుంచి గ్రామ పంచాయతీలకు నేరుగా నిధులను పంపించే వ్యవస్థను ఆనాటి ప్రధానిగా రాజీవ్ గాంధీ రూపొందించారన్నారు. స్థానిక సంస్థలు గ్రామ స్వరాజ్యానికి పునాదులు వేసిన గొప్ప మహనీయుడు రాజీవ్ గాంధీ అని, ఆయన ఆలోచన విధానాలను ముందుకు తీసుకెళ్లే బాధ్యత మనందరిపై ఉందన్నారు. పేద ప్రజల గుండెల్లో రాజీవ్ గాంధీ సేవలు మరిచిపోలేనివని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాణయ్య, కంజర్ల ప్రకాష్, భద్రప్ప, సంజీవరెడ్డి, కౌన్సిలర్ విక్రంరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## కాళేశ్వరం పుష్కరాలకు నిజామాబాద్ నుంచి ప్రత్యేక బస్సులు

**నిజామాబాద్ అర్బన్ మే 21 జనంసాక్షి:** కాళేశ్వరం పుష్కరాల సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని టీజీఎస్ఆర్టీసీ నిజామాబాద్ రీజియన్ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసినట్లు రీజియన్ మేనేజర్ టి. జోష్నా గారు తెలిపారు. నేటి నుంచి వచ్చే 12 రోజుల పాటు కాళేశ్వరం పుష్కరాలకు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక సర్వీసు నడపనున్నట్లు పేర్కొన్నారు. నిజామాబాద్ నుంచి ఉదయం 5:00 గంటలకు ప్రత్యేక బస్సు అందుబాటులో ఉంటాయని మరియు టికెట్ ఛార్జ్ కేవలం 380/- లకే అని తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. టీజీఎస్ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని కోరారు. భక్తుల ప్రయాణం సౌకర్యవంతంగా, సురక్షితంగా ఉండేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆర్ఎం టి. జోష్నా తెలిపారు. ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రీజనల్ మేనేజర్ కోరారు.


## ఇందిరా మహిళా శక్తి భవనం తుది దశ పనులను పరిశీలించిన కలెక్టర్

**నిజామాబాద్ అర్బన్ మే 21: జనం సాక్షి :** నిజామాబాద్ నగరంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమీపంలో అధునాతన హంగులతో నూతనంగా నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవన సముదాయంను కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం సందర్శించారు. తుది దశకు చేరుకున్న నిర్మాణ పనులను, వాటి నాణ్యతను పరిశీలించారు. చివరి దశలో ఉన్న పనులను సైతం వేగవంతంగా పూర్తి చేయించాలని, జూన్ 02వ తేదీ లోపు భవన సముదాయాన్ని సంబంధిత శాఖ అధికారులకు అప్పగించాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇందిరా మహిళా శక్తి భవనం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని సూచించారు. తుది దశ పనులను కూడా నాణ్యతతో పూర్తి చేయించి, సకాలంలో అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు శిక్షణ, ఉత్పత్తుల మార్కెటింగ్‌కు ఈ భవనం దోహదపడనున్నందున ఎలాంటి సౌకర్యాలకు తావు లేకుండా ప్రభుత్వం నిర్దేశించిన విధంగా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఆర్డీఓ సాయన్న, జిల్లా పంచాయతీరాజ్ అధికారి బావయ్య, ఈ.ఈ వీరానంద్, మెప్మా ఏపీడీ మధుసూదన్ తదితరులు ఉన్నారు.

### మున్సిపల్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి

## అవినీతి ఆరోపణలపై కమిషనర్‌కు ఫిర్యాదు

### కాంగ్రెస్ పార్టీ (టీజేఎస్) నాయకులు యగ్గని శ్రీనివాస్, అరికిల్ల భానుచందర్



**జమ్మికుంట,మే 21 (జనం సాక్షి):** జమ్మికుంట నూతన మున్సిపల్ కమిషనర్‌గా వచ్చిన మల్లి కార్జున్‌ని కాంగ్రెస్ పార్టీ టీజేఎస్ నాయకులు యగ్గని శ్రీనివాస్,అరికిల్ల భానుచందర్‌లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జమ్మికుంట మున్సిపాలిటీలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి బోల్ల సదానందంపై వస్తున్న అవినీతి ఆరోపణలపై తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం మున్సిపల్ కమిషనర్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు అందించారు.గత కొద్దిరోజులుగా చెత్త సేకరణ, వాహనాల డ్రైవర్లు సదానందంపై తీవ్ర అవినీతి ఆరోపణలు చేస్తున్నారని,గతంలో జరిగిన ఏసీబీ అధికారుల విచారణలో కూడా లక్షల రూపాయల అవినీతికి సంబంధించి ఇతని పేరే ప్రముఖం గా వినిపించిందని నాయకులు ఫిర్యాదులో పేర్కొన్నారు. అయినప్పటికీ గత మున్సిపల్ అధికారులు ఇతనిపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా విధుల్లో కొనసాగించడంపై స్థానిక ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.ఇటీవల ఓ మున్సిపల్ కౌన్సిలర్ పేరుతో,ఒక మున్సిపల్ డ్రైవర్‌తో మాట్లాడినట్లు చెబుతున్న ఆడియో రికార్డింగ్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోందని వారు గుర్తుచేశారు. ఒక కౌన్సిలర్ బహిరంగంగానే సదానందంపై ఆరోపణలు చేస్తున్నా అధికారులు స్పందించకపోవడం మున్సిపల్ శాఖపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ వ్యవహారంపై మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోకపోతే ఈ అవినీతి అంశాన్ని మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ (ఆర్‌డిఎంఏ), జిల్లా కలెక్టర్, అలాగే మున్సిపల్ శాఖ రాష్ట్ర కమిష నర్ దృష్టికి తీసుకెళ్తామని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి యగ్గని శ్రీనివాస్, తెలం గాణ జన సమితి (టీజేఎస్) యువజన విభాగం జిల్లా అధ్యక్షులు అరికిల్ల భానుచందర్ స్పష్టం చేశారు.

## రైతులను నిలువునా దోచుకుంటున్న 'బ్రోకర్లు'!?

### మిల్లర్లతో కుమ్మక్కై ఏ గ్రేడ్ ధాన్యాన్ని బి-గ్రేడ్‌గా మార్చి దోపిడీ

- తాలు, తరుగు పేరిట రైతుల నడ్డి విరుచుతున్నారు
- తడిసిన ధాన్యం రక్షణకు తార్పాలిన్లు, లారీలు సమకూర్చాలి
- ఉపాధి హామీ పనులు కూడా వేగవంతం చేయాలని బీజేపీ డిమాండ్



**ఇల్లంతకుంట, మే 21 (జనంసాక్షి):** ఇల్లంతకుంట మండలంలో వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న జాప్యం, తాలు, తరుగు, బి-కేటగిరి పేరుతో సాగుతున్న దోపిడీని అరికట్టాలని భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు భూమల్ల అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. మండల తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసిన అనిల్ కుమార్ మాట్లాడు తూ, కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన రైతులు నెల రోజులుగా పడిగాపులు కాస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, ప్రణాళికా లోపం కారణంగా కొనుగోళ్లు సకాలంలో పూర్తి కాకపోవడంతో రైతులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. నాణ్యమైన ధాన్యాన్ని కూడా బి-కేటగిరిగా మార్చి దోపిడీ చేస్తున్నారని, కాంటా చిట్టి ప్రకారం మాత్రమే రైతులకు పూర్తి చెల్లింపులు జరగాలని డిమాండ్ చేశారు. రైస్ మిల్లర్లు 'తాలు', 'తరుగు' పేరుతో అదనంగా కిలోలు తగ్గించుకునే దోపిడీని తక్షణమే అరికట్టాలని, నిబంధనలు ఉల్లంఘించే మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. వర్ష సూచన ఉన్నందున తడిసిన ధాన్యం రక్షణకు తార్పాలిన్లు, అదనపు లారీలు సమకూర్చి రెండు మూడు రోజుల్లో ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని సూచించారు. రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తక్షణం స్పందించాలని, లేనిపక్షంలో రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మండల ఉపాధ్యక్షులు కూనబోయిన బాలరాజు, పండుగ లక్ష్మణ్, దూది సుదీర్, మండల ప్రధాన కార్యదర్శి కరికె నవీన్, కోశాధికారి పిల్లి గోపాల్, రాష్ట్ర నాయకులు మేకల మల్లేశం, నాయకులు మారవేణి రాజు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



## ఇందుర్తిలో షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

### మంటల్లోచిక్కుకున్న గేదెకు తీవ్ర గాయాలు

**చిగురుమామిడి మే 21 (జనంసాక్షి):** మండలంలోని ఇందుర్తి గ్రామంలో షార్ట్ సర్క్యూట్ తో పట్టపగలు భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుందని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.నర్సింగోజు రాజమౌళి అనే రైతుకు చెందిన లక్ష 20వేల రూపాయల విలువచేసే చుడి గేదె మంటల్లో చిక్కుకోగా తీవ్ర గాయాలై ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు బాధిత రైతు రోధిస్తూ తెలిపారు.అక్కడున్న పశువుల కొట్టంతోపాటు 5వందల గడ్డి కట్టలు పశుగ్రాసం దగ్ధమైనట్లు రైతు రాజమౌళి తెలిపారు. వెంటనే రైతులు ఫైర్ ఇంజన్ కు సమాచారం ఇవ్వడంతో ఫైర్ ఇంజన్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. లేకుంటే మరింత భారీ నష్టం జరిగేదని రైతులు వాపోయారు. గేదె 80శాతం కు పైగా మంటల్లో కాలిపోయిందని బాధిత రైతు రాజమౌళిని ప్రభుత్వం ఆదుకోవాలని తోటి రైతులు కోరుతున్నారు.

## గ్రామాల్లో ట్రాన్స్‌జెండర్ల రాకపై నిషేధం ఎత్తివేత

- కలెక్టర్ చొరవతో ఇరువర్గాల మధ్య సయోధ్య
- సర్పంచులు-ట్రాన్స్‌జెండర్లతో సమావేశం
- గుర్తింపు కార్డులతో నకిలీల నియంత్రణ
- బలవంతపు వసూళ్లు చేయబోమని ట్రాన్స్‌జెండర్ల హామీ



**నిజామాబాద్, మే 21 (జనంసాక్షి):** నిజామాబాద్ జిల్లాలో గ్రామాల్లో ట్రాన్స్‌జెండర్ల రాకపై విధించిన నిషేధాన్ని ఎత్తివేసేందుకు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి చొరవతో కీలక సయోధ్య కుదిరింది. ఇటీవల కొన్ని గ్రామాల్లో ట్రాన్స్‌జెండర్ల ప్రవేశంపై గ్రామ కమిటీలు తీసుకున్న నిషేధ నిర్ణయాల నేపథ్యంలో గురువారం సమగ్ర జిల్లా కార్యాలయాల సముదాయంలో సంబంధిత శాఖల అధికారులు, ట్రాన్స్‌జెండర్లు, గ్రామ సర్పంచులతో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోనే తొలిసారిగా ఈ తరహా సమావేశం జరగడం విశేషం. సిరికొండ మండలం మైలారం గ్రామంలో ఇటీవల చోటుచేసుకున్న సంఘటనతో పాటు మరికొన్ని గ్రామాల్లో తలెత్తిన వివాదాలపై కలెక్టర్ ఇరు వర్గాల అభిప్రాయాలను విన్నారు. వివాహాలు, గృహప్రవేశాలు, వ్యాపార ప్రారంభోత్సవాల్లో ట్రాన్స్‌జెండర్లు బలవంతంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారని సర్పంచులు తెలిపారు. నకిలీలు కూడా వేషధారణలో వచ్చి సమస్యను మరింత తీవ్రం చేస్తున్నారని ఆరోపించారు. మరోవైపు, గ్రామాల్లో ప్రవేశాన్ని నిషేధించడం వల్ల తమ గౌరవానికి భంగం కలుగుతోందని, జీవనోపాధి కోల్పోతున్నామని ట్రాన్స్‌జెండర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇరు వర్గాల వాదనలు విన్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, నకిలీలను అరికట్టేందుకు గుర్తింపు కార్డులు జారీ చేస్తామని ప్రకటించారు. బలవంతపు వసూళ్లు చేయకుండా ప్రజలు ఇష్టపూర్వకంగా ఇచ్చినదాన్ని మాత్రమే స్వీకరించాలని ట్రాన్స్‌జెండర్లను కోరారు. దీంతో గ్రామాల్లో ట్రాన్స్‌జెండర్ల రాకపై విధించిన నిషేధ బ్యానర్లు, ఫ్లెక్సీలను తొలగించి ఆంక్షలను ఎత్తివేయడానికి సర్పంచులు అంగీకారం తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు, నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్ యాదవ్, జిల్లా సంక్షేమ అధికారి పద్మ, ట్రాన్స్‌జెండర్లు, సర్పంచులు పాల్గొన్నారు.

## నేరేడ్‌మెట్‌లో 'మీ సురక్ష'పై అవగాహన సదస్సు




**మల్కాజిగిరి మే 21(జనంసాక్షి) :** నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శక్తి నగర్ కాలనీలో గురువారం సాయంత్రం మల్కాజిగిరి ఏసీపీ యాదగిరి రెడ్డి ఆధ్వర్యంలో కాలనీ వాసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులకు మీ సురక్ష కార్యక్రమం మరియు సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ యాదగిరి రెడ్డి మాట్లాడుతూ, కాలనీల్లో భద్రతను పటిష్టం చేయడంలో భాగంగా ప్రతి ఒక్కరూ 'మీ సురక్ష' యాప్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఇళ్లలో పనిచేసే సిబ్బంది, డ్రైవర్లు, కేర్ టేకర్ల వివరాలను తప్పనిసరిగా యాప్ లో నమోదు చేయించాలని కోరారు. దీనివల్ల నేరాల నియంత్రణతో పాటు అపరిచిత వ్యక్తులపై నిఘా ఉంచడం సులువవుతుందని పేర్కొన్నారు. ప్రస్తుత రోజుల్లో పెరుగుతున్న సైబర్ మోసాల పట్ల కాలనీవాసులు అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని లింకులను క్లిక్ చేయవద్దని మరియు ఓటీపీలను ఎవరికీ షేర్ చేయవద్దని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నేరేడ్‌మెట్ సీఐ సందీప్ కుమార్, ఎస్ఐ రమేష్, కాలనీ ప్రెసిడెంట్ నర్సింగరావు మరియు స్థానిక కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కరీంనగర్ 24వ డివిజన్‌లో ఓపెన్ జిమ్ ప్రారంభించిన మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్ అర్బన్, మే 21 (జనంసాక్షి) :** కరీంనగర్ నగర ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన "ఫిట్ ఇండియా" నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకుని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో నగరంలో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు చేపడుతున్నట్లు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. గురువారం రోజు నగరంలోని 24వ డివిజన్‌లో మలయప్ప ఫౌండేషన్ సీఎస్ఆర్ నిధుల ద్వారా నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో ప్రజలకు ఆరోగ్యకరమైన జీవనశైలిని అందించేందుకు ఇలాంటి సౌకర్యాలను మరింత విస్తరించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం వేళల్లో వాకింగ్‌కు వచ్చే ప్రజలు, మహిళలు, యువత ఈ ఓపెన్ జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓపెన్ జిమ్‌ల ద్వారా ప్రజలు ఉచితంగా వ్యాయామ సదుపాయాలను వినియోగించుకోవచ్చని, దీనివల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరిన్ని పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై సునీల్‌రావు, కార్పొరేటర్లు ఒంటెల సత్యానారాయణ రెడ్డి, బండ రమణారెడ్డి, పాలకవర్గ సభ్యులు, వాకర్స్, డివిజన్ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.




## ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలి

### ప్రభుత్వ లక్ష్యాల మేరకు కూలీలకు ఉపాధి కల్పించాలి

### ధాన్యం కొనుగోలు, తరలింపు పనులు త్వరితం చేయాలని జిల్లా కలెక్టర్ సూచన

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 21 (జనంసాక్షి):** ప్రభుత్వ లక్ష్యం మేరకు ఉపాధి హామీ పనులు చేయించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఊర చెరువులో (జల సంచాయ్ - జన్ భాగిదారి) ఉపాధి హామీ పనులు కొనసాగుతుండగా గురువారం జిల్లా కలెక్టర్ స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ లక్ష్యాల మేరకు ప్రతి రోజూ 150 మంది కూలీలు పనికి హాజరయ్యేలా చూడాలని సూచించారు. పని చేసే చోట నీడ, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. నిరక్షరాస్యులైన కూలీలు ఉల్లాస్ కింద చదువు నేర్చుకోవాలని పేర్కొన్నారు. రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులు సన్నవడ్లు సాగు చేయాలని పిలుపునిచ్చారు.

అదే మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) కొనుగోలు కేంద్రాన్ని కూడా కలెక్టర్ పరిశీలించారు. ఇప్పటివరకు ఎంత ధాన్యం వచ్చింది, ఎంత కొనుగోలు చేశారు, ఎంత మిల్లులకు తరలించారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులు, గోదాములకు తరలించాలని, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు తగిన వాహనాలు సమకూర్చాలని సూచించారు. ఈ పర్యటనలో డీఆర్‌డీఓ లక్ష్మీనారాయణ, డీసీఎస్ఓ బుచ్చిబాబు, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, సహకార అధికారి రామకృష్ణ, సర్పంచ్ లక్ష్మీరాజం, ఎంపీడీఓ రమేష్, ఇంచార్జ్ తహసీల్దార్ మురళి తదితరులు పాల్గొన్నారు.

## పైప్‌లైన్ లీకేజీపై శాశ్వత పరిష్కారం చేపట్టాలి

### వారంలోపు సమస్య పరిష్కారం కావాలి

### గంజ్ కమాన్ వద్ద డ్రైనేజీ పనులు పూర్తి చేయాలి

### కమిషనర్ దిలీప్ కుమార్‌తో కలిసి పర్యవేక్షించిన ఎమ్మెల్యే ధన్ పాల్



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మే 21: జనం సాక్షి :** మిర్చి కాంపౌండ్ కు వెళ్లే దారిలో మంచినీటి పైప్ లైన్ లీకేజీ పై శాశ్వత పరిష్కారం చేపట్టాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అధికారులను ఆదేశించారు. నగరంలోని మార్వాడి గల్లీ, మిర్చి కాంపౌండ్ వద్ద లీకైన పైప్ లైన్ ను మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్, పబ్లిక్ హెల్త్ డీఈ శ్రీకాంత్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...గత మూడు రోజులుగా మంచినీటి పైప్ లైన్ లీకేజీకి గురైందని, దీంతో మురికి నీరు కలుషితమై నల్లాల్లోకి వస్తున్నాయన్నారు. మూడు రోజులుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న అధికారులు స్పందించకపోవడం తగదన్నారు. ఏళ్లుగా ఉన్న పాత లైన్ ను సర్వే చేపట్టి శాశ్వత పరిష్కారం చేపట్టాలన్నారు. నూతన పైప్ లైన్ వేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. వీలైనంత తొందరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సంబంధిత అధికారులు సైతం కార్పొరేటర్లకు, ప్రజలకు జవాబుదారులుగా ఉండాలన్నారు. అలాగే మిర్చి కాంపౌండ్ లో చేతిపంపులను మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.ప్రధానంగా గంజ్ కమాన్ వద్ద గత కొన్ని రోజులుగా నెలకొన్న డ్రైనేజీ సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందని ఎమ్మెల్యే చెప్పారు. టెండర్లు పూర్తయిన పనులు ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేస్తే బ్లాక్ లిస్టులో వేయాలన్నారు. వచ్చే మూడు రోజుల్లో పనులు పూర్తి కావాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట స్థానిక కార్పొరేటర్ బంటు ప్రీతి ప్రవీణ్, కార్పొరేషన్ ఏఈ శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు.

## సరస్వతీ పుష్కరాలకు టీజీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

### టీజీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మెన్ అండ్ ఎండీ వై.నాగిరెడ్డి




హైదరాబాద్ (జనంసాక్షి) : ప్రతిష్టాత్మకంగా ప్రారంభం కానున్న సరస్వతి పుష్కరాలకు వెళ్లే భక్తుల కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (వీసీ అండ్ ఎండీ) వై.నాగిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మే 21వ తేదీ నుండి జూన్ 1వ తేదీ వరకు (21-05-2026 నుండి 01-06-2026 వరకు) ఈ ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంటాయని ఆయన పేర్కొన్నారు. పవిత్ర పుష్కర స్నానాలు ఆచరించేందుకు కాళేశ్వరానికి వెళ్లే భక్తులకు ఎలాంటి రవాణా ఇబ్బందులు కలగకుండా, వారి ప్రయాణం సురక్షితంగా, సుఖవంతంగా సాగేలా అధునాతన బస్సులను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల యాక్షన్ ప్లాన్ కింద ఈ ప్రత్యేక రవాణా సౌకర్యాలను పర్యవేక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. భక్తుల రద్దీ, అవసరాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలోని ప్రధాన ప్రాంతాల నుండి కాళేశ్వరానికి ఈ ప్రత్యేక బస్సులు నడపబడుతున్నాయని ఎండీ స్పష్టం చేశారు. హైదరాబాద్, నర్సంపేట, తొర్రూరు, భూపాలపల్లి, మణుగూరు, కరీంనగర్, మంథని, హన్మకొండ, మహబూబాబాద్, జనగాం, పరకాల, నిజామాబాద్, గోదావరిఖని, మంచిర్యాల వంటి ముఖ్య ప్రాంతాల నుండి నేరుగా కాళేశ్వరానికి బస్సు సర్వీసులు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రయాణికులు మరియు భక్తుల సౌకర్యార్థం ఆయా ప్రాంతాలకు సంబంధించిన ప్రత్యేక సంప్రదింపు నంబర్లను కూడా సంస్థ విడుదల చేసిందని, హైదరాబాద్ భక్తులు సమాచారం కోసం 9959226245 నంబరును సంప్రదించవచ్చని తెలిపారు. పుష్కరాలకు వెళ్లే ప్రయాణికులు ముందస్తు రిజర్వేషన్ల కొరకు w w wtgsrtcbus.in ద్వారా తమ టిక్కెట్లను బుక్ చేసుకోవచ్చని సంస్థ పేర్కొంది. భక్తులందరూ ఈ ప్రత్యేక బస్సు సర్వీసులను వినియోగించుకుని, సురక్షితమైన వాతావరణంలో కాళేశ్వర సరస్వతి పుష్కరాల యాత్రను విజయవంతం చేసుకోవాలని వీసీ అండ్ ఎండీ వై.నాగిరెడ్డి కోరారు.

# పర్యాటక రంగానికి 'డిజిటల్' బూస్ట్

- ఇన్‌ఫ్లుయర్లు సామాజిక బాధ్యతతో తీసుకోవాలి
- డ్రగ్స్, బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్‌పై చైతన్యం కల్పించాలి
- త్వరలో 'ప్రభాత భేరి' సామాజిక చైతన్య కార్యక్రమం
- ఉత్తమ టూరిజం క్రియేటర్లకు అవార్డులు, ప్రోత్సాహకాలు
- తెలంగాణ పర్యాటక క్రియేటర్ల సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు



హైదరాబాద్, మే21 (జనంసాక్షి) : 'పర్యాటక రంగం కేవలం విహార యాత్రలకే పరిమితం కాదు.. అది రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, యువతకు ఉపాధికి, తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌కు శక్తివంతమైన సాధనం' అని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. డిజిటల్ వేదికల ద్వారా తెలంగాణ ప్రకృతి అందాలు, చారిత్రక వైభవం, సంస్కృతి సంపదను ప్రపంచానికి చాటాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా 99 రోజుల కార్యాచరణను వేగవంతం చేసిన రాష్ట్ర ప్రభుత్వం, పర్యాటక రంగానికి కొత్త ఊపునివ్వడానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందన్నారు. పర్యాటక వారోత్సవాల సందర్భంగా బేగంపేట టూరిజం ప్లాజాలో నిర్వహించిన 'తెలంగాణ పర్యాటక క్రియేటర్ల సమావేశం'లో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి జూపల్లి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఇన్‌ఫ్లుయెన్సర్లు ఇచ్చిన సలహాలు సూచనలు స్వీకరించి పర్యాటక రంగాన్ని మరింత మెరుగు పరుస్తామని చెప్తుతునే.. పర్యాటక ప్రమోషన్ తో పాటు ప్రజల్లో ముఖ్యంగా యువతలో సామాజిక స్పృహ కలిగించడానికి కృషి చేయాలని దిశానిర్దేశర చేశారు. పర్యాటక ప్రాంతాల ప్రోత్సాహంతో స్థానిక యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి తెలిపారు. పర్యాటక రంగం ద్వారా వచ్చే ఆదాయాన్ని వైద్య, ఆరోగ్య, విద్యా రంగాల బలోపేతానికి, పర్యాటక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి వినియోగిస్తామని చెప్పారు. 'మన ప్రాంతాలను మనమే చూడకపోతే జీవితం సంపూర్ణం కాదు' అని పేర్కొన్న ఆయన.. తెలంగాణలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు ఆర్థిక స్థోమత అడ్డంకి కాదన్నారు. అనవసర ఖర్చులను తగ్గించుకుని కుటుంబంతో కలిసి పర్యాటక ప్రాంతాల్లో గడపడం వల్ల మానసిక ప్రశాంతత, ఆనందం లభిస్తాయని సూచించారు. దేశ, విదేశీ పర్యాటకులతో పాటు స్వరాష్ట్ర ప్రజలు కూడా తెలంగాణ పర్యాటక ప్రాంతాలను విస్తృతంగా సందర్శించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పర్యాటక ప్రాంతాల్లో స్వచ్ఛత, కనీస వసతులు, ఆధునిక టెంట్ వసతి సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టామని తెలిపారు. వినియోగంలో లేని హరిత మోటళ్లు,, పర్యాటక భూములను ఆదాయ వనరులుగా మార్చే దిశగా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయర్లు కేవలం పర్యాటక ప్రమోషన్‌కే పరిమితం కాకుండా సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని మంత్రి జూపల్లి సూచించారు. యువత.. గంజాయికి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు, బెట్టింగ్‌కు, ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, వీటితో మానసిక రుగ్మతకు గురై బంగారు భవిష్యత్తును కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక, మానసిక రుగ్మతలను రూపుమాపేందుకు ఇన్ఫ్లు యెన్సర్లు తమ కంటెంట్ ద్వారా సామాజిక చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రభాత భేరి అనే సరికొత్త సామాజిక చైతన్య కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించబోతుందని, లఘు చిత్రాలు, నాటికలు, రంగస్థల ప్రదర్శనలు, వివిధ కళా రూపాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కార్యచరణను అమలు చేయబోతున్నామని ప్రకటించారు. తెలంగాణ సంస్కృతి, వారసత్వం, ఆతిథ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంలో క్రియేటర్లు భాగస్వాము లు కావాలని మంత్రి కోరారు. పర్యాటక రంగ అభివృద్ధిలో భాగస్వాములయ్యే కంటెంట్ క్రియేటర్లకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. తెలంగాణను ప్రపంచ పర్యాటక మ్యాప్‌లో అగ్రస్థానంలో నిలబెట్టేందుకు కలిసి పనిచేద్దామని పిలుపుని చ్చారు. ఉత్తమ ప్రతిభ కనబరిచే టూరిజం క్రియేటర్లకు ప్రభుత్వం తరపున అవార్డులు, ప్రత్యేక ప్రోత్సాహకాలు అందజేస్తామని మంత్రి జూపల్లి ప్రకటించారు. సందర్భంగా రాష్ట్ర పర్యాటక శాఖ నూతన మెటా ఖాతా, అధికారిక ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌ను మంత్రి జూపల్లి ఆవిష్కరించారు. తెలంగాణ చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపద, హస్తకళలు, చేనేత, కలంకారీ కళా వైభవాన్ని ప్రతిబింబించే 'టైమ్‌లెస్ తెలంగాణ' వీడియోను ప్రదర్శిం చారు. కార్యక్రమంలో పర్యాటక, భాషా సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్, ఎండీ గౌతమి, స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ లక్ష్మి, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, నిథమ్ డైరెక్టర్ వెంకట రమణ, సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ రహదారిపై కంటెయినర్‌లో మంటలు

- మంటల ధాటికి 8 కొత్త కార్లు బుగ్గి

మెదక్, మే21 (జనంసాక్షి) : మెదక్ జిల్లాలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. తూప్రాన్ సమీపంలో జాతీయ రహదారి ఎన్‌హెచ్-44పై ప్రయాణిస్తున్న కంటైనర్ లారీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మహారాష్ట్ర వైపు నుంచి హైదరాబాద్‌కు వస్తున్నఈ కంటైనర్ లారీ అగ్నికి ఆహుతైంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లారీలో కొత్తగా తరలిస్తున్న ఎనిమిది మారుతీ కార్లు ఉన్నాయి. మంటలు ఒక్కసారిగా వ్యాపించి కంటైనర్‌తో పాటు అన్ని కార్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. మంటలు ఎగిసిపడటంతో జాతీయ రహదారిపై భయాందోళన వాతావరణం నెలకొంది. స్థానికులు వెంటనే పోలీసులకు, అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అగ్నిప్రమాదం కారణంగా రహదారిపై కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. భద్రతా చర్యల్లో భాగంగా హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను పోలీసులు తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరటనిచ్చే విషయం. అయితే కోట్ల రూపాయల ఆస్తినష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. షార్ట్ సర్క్యూట్ లేదా సాంకేతిక లోపం వల్లే ఈ మంటలు చెలరేగి ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటనతో జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడగా, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

# కేబీఆర్ పార్క్‌ను కాపాడాలి

- పర్యావరణ పరిరక్షణలో అండగా ఉంటాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్ (జనంసాక్షి) : కేబీఆర్ పార్క్‌ను కాపాడాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేబీఆర్ పార్క్ రోడ్ విస్తరణ ప్రభావిత యజమానుల ఫోరం ప్రతినిధులు గురువారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావును కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో కేబీఆర్ పార్క్ చుట్టూ భారీగా చెట్లను నరికివేసే ప్రయత్నాలను వ్యతికించాలని, హైదరాబాద్ నగరానికి ఊపిరితిత్తుల్లాంటి కేబీఆర్ పార్క్‌ను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రతినిధుల విన్నపాన్ని విన్న కేటీఆర్ మాట్లాడుతూ కేబీఆర్ పార్క్ హైదరాబాద్ నగరానికి అత్యంత విలువైన "లంగ్స్ స్పేస్" అని పేర్కొన్నారు. వేగంగా విస్తరిస్తున్న మహానగరంలో పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడటంలో కేబీఆర్ పార్క్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఇలాంటి పచ్చదనాన్ని నాశనం చేసే ఏ చర్యనైనా ప్రజాస్వామ్యబద్ధంగా, చట్టబద్ధంగా అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేబీఆర్ పార్క్ ఉనికి, చెట్లకు ఏ మాత్రం ఇబ్బంది కలగకుండా అండర్‌గ్రౌండ్ ప్రతిపాదికన ప్రత్యామ్నాయ ప్రణాళికలు సిద్ధం చేశామని కేటీఆర్ తెలిపారు. ఆ ప్రణాళికలు ఇప్పటికీ మున్సిపల్ శాఖ వద్ద అందుబాటులో ఉన్నాయని గుర్తుచేశారు. అభివృద్ధి పేరుతో పర్యావరణాన్ని ధ్వంసం చేయడం సరైన విధానం కాదని, సాంకేతిక పరిజ్ఞానం, సమగ్ర ప్రణాళికలతో అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రెండింటినీ సమన్వయం చేయవచ్చని పేర్కొన్నారు. కేబీఆర్ పార్క్ చుట్టూ చెట్ల నరికివేతకు వ్యతిరేకంగా ప్రజలు వ్యక్తం చేస్తున్న ఆందోళనను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాల్సి అవసరం ఉందని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఈ అంశంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరపున అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. హైదరాబాద్ భవిష్యత్తు తరాలకు పచ్చని వారసత్వాన్ని అందించాలంటే కేబీఆర్ పార్క్ వంటి పర్యావరణ సంపదలను కాపాడుకోవడం అత్యవసరమని కేటీఆర్ స్పష్టం చేశారు.



## ధాన్యం కొనుగోలు కేంద్రంలో మంటలు

- దాదాపు వంద ధాన్యం బస్తాలు బుగ్గి

ఖమ్మం, మే21 (జనంసాక్షి) : ఖమ్మం రూరల్ మండలం తీర్థాల గ్రామంలో గల ధాన్యం కొనుగోలు కేంద్రం సమీపంలో రైతులు పొలాల్లో చెత్తకు నిప్పంటించడంతో ఆ మంటలు గాలికి వ్యాపించి కొనుగోలు కేంద్రంలోని వరి ధాన్యం బస్తాలకు అంటుకున్నాయి. దీంతో అక్కడ కాంటాలు వేసి ఉంచిన వరి బస్తాలు ఒక్కసారిగా మంటల్లో చిక్కుకుని దగ్ధమయ్యాయి. రైతులు వెంటనే మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ, గాలులు బలంగా వీయడంతో మంటలు అదుపులోకి రావడం లేదని ఆందోళన వ్యక్తం చేసారు. ఫైర్ సిబ్బందికి సమాచారం అందించినా స్పందన ఆలస్యమైందని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనలో సుమారు వంద ధాన్యం బస్తాలు దగ్ధమయ్యాయని, లక్షల రూపాయల నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోతున్నారు. మంటలు పూర్తిగా అదుపులోకి రాకపోతే ఇంకా పెద్ద ఎత్తున ధాన్యం నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఎంజేపీ బ్రాండింగ్ క్రియేట్ చేయాలి

- విద్యార్థులకు సమగ్ర విద్యాబోధన జరగాలి
- 8 వ తరగతి నుండే నీట్, ఎంసెట్ తర్ఫీదు
- 100 శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలకు అభినందనలు
- ఫలితాలు తక్కువగా వచ్చిన ప్రిన్సిపాల్‌లకు హెచ్చరిక
- పూలే గురుకుల పాఠశాలల ఫలితాలపై మంత్రి పొన్నం సమీక్ష



హైదరాబాద్, మే21 (జనంసాక్షి) : మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయాల పనితీరు పై మంత్రి పొన్నం ప్రభాకర్ గారు గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రిన్సిపాల్స్ ను అభినందించారు. ఫలితాలు తక్కువగా వచ్చిన గురుకుల విద్యాసంస్థలు కారణాలు సమీక్షించుకోవాలని ఆయన సూచించారు. వచ్చే విద్యాసంవత్సరం మంచి ఫలితాలు సాధించేలా పని చేయాలిని ఆయన అన్నారు. సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలు వచ్చే విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉండాలని ఆదిశగా అధ్యాపక బృందం పని చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. విద్యార్థులకు చదువులతో పాటు ఆటలు , సాంస్కృతిక కార్యక్రమాలు, సైన్స్, ఏఐ, తదితర అంశాలపై ఉన్నత స్థానాలకు ఎదిగేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలను అభిందించడంతో పాటు ఉత్తీర్ణత శాతం తక్కువగా వచ్చిన పాఠశాలల ప్రిన్సిపాల్ లను మందిలించారు. వచ్చే విద్యా సంవత్సరంలో మంచి ఫలితాలు రాబట్టాలని సూచించారు. గతంలో 327 స్కూల్ లలో 301 స్కూల్ లో ప్రైవేట్ భవనాల్లో ఉన్నాయని, ప్రభుత్వం విద్యకు ప్రధాన్యత ఇవ్వడం తో గురుకులాలు అద్భుతంగా పని చేస్తున్నాయనీ తెలిపారు. గురుకుల పాఠశాలలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, ప్రభుత్వం మెస్ ఛార్జీలు కాస్మొటిక్ చార్జీలు పెంచి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు ప్రభుత్వం మీద విశ్వాసంతో ,అధ్యాపకుల విశ్వాసంతో తమ పిల్లలను గురుకులాలకు పంపిస్తున్నారనీ తల్లిదండ్రుల కన్నా ఎక్కువగా ఉపాధ్యాయుల తోనే పిల్లలు సమయం ఇస్తారని తమ సొంత పిల్లల మాదిరి విద్యార్థులను చూసుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు మంచైనా,చెడైనా అధ్యాపకులు దిక్సూచి అని తెలిపారు. 026-27 సంవత్సరానికి రాష్ట్రంలోని అన్ని బీసీ సంక్షేమ శాఖ గురుకులాలు మరింత సమర్థవంతంగా విజయాలు సాధించాలనీ ఆకాంక్షించారు. ఎవరిని ఇబ్బంది పెట్టి పని చేయించుకోవడం లేదనీ పూర్తి స్థాయిలో విద్యా బోధన జరగాలనీ ఆదేశించారు.ప్రైవేట్ భవనాల్లో నెల వారి అద్దె కడుతున్నప్పటికీ మౌలిక సదుపాయాలు లేకపోతే కల్పించుకునే బాధ్యత ప్రిన్సిపల్ లది సూచించారు. టాయిలెట్స్, ఫ్యాన్స్,ఇతర మౌలిక సదుపాయాలు ఏం ఇబ్బందులు లేకుండా చూసుకోవాలనీ తెలిపారు.ఎంజేపీ గురుకులాలు అద్భుతంగా ఉండాలంటే అందరూ కలిసి సమిష్టి గా ఒక కుటుంబం లాగ పని చేయాలన్నారు.పిల్లల ఉజ్వల భవిష్యత్తు జ్ఞాపకులపై ఆధారపడి ఉందన్నారు. సమాజంలో ఏ విధంగా బతకాలి , డిసిప్లెన్, తల్లిదండ్రుల తో ఎలా వ్యవహరించాలి..పెద్దలతో ఎలా మాట్లాడాలి అని విద్యార్థులకు నేర్పించాలని సూచించారు.చిన్న చిన్న కారణాలతో గురుకులాల్లో సూసైడ్ జరుగుతున్నాయని విద్యార్థుల్లో మనో ధైర్యాన్ని కల్పించాలని వారిలో మోటివేటివ్ కల్పించాలన్నారు.జిల్లాలో ఉన్న స్కూల్స్ వారిగా సమిక్ష లు చేస్తూ వంద శాతం ఫలితాలు వచ్చిన స్కూల్స్ అభినందిస్తూ.. తక్కువ ఫలితాలు వచ్చిన స్కూల్స్ ఆత్మపరిశీలిన చేసుకోవాలనీ సూచించారు. అధ్యాపకులంతాఎంజేపీ కి బ్రాండ్ ఇమేజ్ క్రియేట్ చేయాలనీ పేర్కొన్నారు.పదవ తరగతి 98.45 శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల సెక్రెటరీ సైదులు తో పాటు ప్రిన్సిపల్ లను అభినందించారు.500 పైన వచ్చిన మార్కులు 9788 మంది విద్యార్థులకు వచ్చాయనీ204 ఎంజేపీ గురుకులాలు 100 శాతం ఫలితాలు సాధించాయనీ సంతోషం వ్యక్తం చేశారు.65 స్కూల్స్ వెనుకబడి ఉన్నాయనీ ఆ స్కూల్స్ ఆత్మపరిశీలిన చేసుకోవాలి ఉత్తీర్ణత తక్కువగా వస్తె మంచిది కాదనీ హెచ్చరించారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 90.31 శాతం ,ఒకేషనల్ ద్వితీయ సంవత్సరంలో 97.72 శాతం , ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం లో 85.80 శాతం, ఒకేషనల్ ప్రథమ సంవత్సరంలో 95.81 శాతం పాస్ శాతం ఉందని 900 పైన మార్కులు సాధించిన విద్యార్థులు 4183 మంది విద్యార్థులు ,980 మార్కులు పైన 496 మంది విద్యార్థులు సాధించారనీ ఇంటర్మీడియట్ లో తక్కువ ఉత్తీర్ణత శాతం వచ్చిన గురుకులాలను హెచ్చరించారు.35 విద్యా సంస్థలు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాయనీ అభినందించారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 8 విద్యా సంస్థలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయన్నారు.ఎంజేపీ లో చదివిన పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులకు నేరుగా ఇంటర్మీడియట్ తరగతులకు అడ్మిషన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.గురుకుల పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు ఇంకా ఏమి అవసరమని ప్రతిపాదనలు ఇవ్వాలని సూచించారు.

## అగ్నిప్రమాదంలో వరిపొలం దగ్ధం

- పరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతు వినతి

పెద్దపల్లి, మే21 (జనంసాక్షి) : కాల్వశ్రీరాంపూర్ మండలంలోని మిర్జంపేటలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన పుల్లూరి సాగర్ కు చెందిన 1.20 గుంటల వరి పొలం మంటల్లో కాలి బూడిదైనట్లు బాధితుడు తెలిపాడు. సాగర్ కు గ్రామ శివారులో ఎకరా 20గుంటల వరి పొలం ఉంది. హార్వెస్టర్లు రాక పొలం కోయలేదు. గురువారం ఉదయం ఓ గ్రామానికి చెందిన హార్వెస్టర్ పొలం కోయడానికి రాగా అప్పటికే మంటల్లో కాలి బూడిదైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్షా యాభైవేల ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు. గ్రామ శివారులో మిట్ట మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు వరి కొయ్యకాలుకు నిప్పంటించడంతో పలువురు రైతులకు చెందిన వరి కొయ్యకాలుతో పాటు, విద్యుత్ వైర్లు, పైపులు, తాటిచెట్లు మంటల్లో కాలి బూడిదయ్యాయి. రూ.లక్షల్లో ఆస్థినష్టం జరిగినట్లు గ్రామస్తులు వాపోయారు.

## బ్లాక్‌లో టిక్కెట్ల దందాపై పోలీసుల ఆరా

హైదరాబాద్, మే21 (జనంసాక్షి) : ఉప్పల్ స్టేడియం వేదికగా శుక్రవారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు , సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌కు భారీ డిమాండ్ నెలకొన్న నేపథ్యంలో ఉప్పల్ స్టేడియం టికెట్ల బ్లాక్ మార్కెట్ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంపై మల్కాజ్ గిరి పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. బ్లాక్ టికెట్ల విక్రయాలపై ఇప్పటివరకు 10 కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మ్యాచ్ ప్రారంభమయ్యే వరకు స్టేడియం పరిసర ప్రాంతాలు, ఆన్‌లైన్ ఫ్లాట్‌ఫార్మ్‌లు, సోషల్ మీడియాపై నిఘా కొనసాగుతుందని స్పష్టం చేశారు.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370